TIGHT BINDING BOOK

UNIVERSAL LIBRARY
OU_204019
UNIVERSAL LIBRARY

# ( సీతాదేవి వనవాసము )

పండిత ఈశ్వరచంద్ర విద్యాసాగరుల వారి

బంగాళీ గ్రంథము ననుసరించి వ్రాయఁబడినది.

తృతీయ ముద్రణము

మచిలీ పట్టణములోని

" సరస్వతీ నికేతనము " వారిచేఁ

ప్రచురింపఁబడి

బెజవాడ

వాణీ ముద్రాక్షరశాలయందు

వి. కే. స్వామిచే

ముద్రితము.

౧౯౧౮.

సర్వస్వామ్య సంకలితము ] [ దీని వెల ౦-౧౦-౦.

Approved by the Text Book Committee.

# అంకితము

అమ్మా! ఇదివఱకు భక్తియోగ మను గ్రంథమును నీ పాదపద్మములయం దర్పించి యుంటిని. నేఁడు సమర్పించు 'సీతాదేవి వనవాసము'ను గూడ నన్ను ధన్యునిగఁ జేయ వేఁడుచున్నాను.

గ్రంథకర్త.

ఓం.

# సీతాదేవి వనవాసము

---

## మొదటి ప్రకరణము

శ్రీ రామచంద్రుఁడు రాజ్యాభిషిక్తుఁడై, ప్రజలను కన్నబిడ్డలవలెఁ గాపాడుచు మహాప్రతాపమున రాజ్యపాలనం బొనర్చుచుండెను. అందువలన నచిరకాలములో, కోసలరాజ్య మంతయు సర్వవిధ సౌఖ్యములచేతను, సకలైశ్వర్యములతోడను తులఁదూఁగ సాగెను. ఈయన ప్రతిదినమును, నియమిత కాలమునకు మంత్రివరులంగూడఁ జేరి, రాజకార్యపర్యాలోచనాపరుఁడై మిగిలినకాలమును, సోదర త్రయముతోడను, జనకతనయా సహవాస సుఖమునను, గడపుచుండెను.

కాలక్రమమున జానకీదేవికి గర్భ లక్షణములు పొడగట్టుట వలన శ్రీరామచంద్రుఁడును, కౌసల్యాదేవియు, మితిలేని సంతసంబున మునింగిరి. ఆహ్లాద

జనకమగు కార్యకలాపములతోడ, రాజభవనము ప్రకాశింపఁజొచ్చెను. కొలఁదికాలములో యువరాజ సందర్శనం బగు నను మానసోల్లాసమువలన, పురజనులు తమతమ గృహములయందు ననేకవిధోత్సవములు చేయసాగిరి.

ఋష్యశృంగమహర్షి యజ్ఞమును జేయుచు నూరి సపరివారముగ రావలయునని శ్రీరామచంద్రుని నాహ్వానించెను. కాని జానకీదేవి పూర్ణగర్భిణియై యుండుట వలన, రామచంద్రుఁడును, లక్ష్మణుఁడును, యజ్ఞమున కేగఁజాలకుండిరి. కౌసల్య మొదలగు వృద్ధ మహిషీగణము మాత్రము, అరుంధతీదేవి వశిష్ఠమహర్షులుం గూడి యజ్ఞమును దర్శింప నేగిరి. వారును పూర్ణగర్భావస్థయం దున్న జానకీదేవిని విడనాడి వెళ్లుట కిచ్చగింపకున్నను, అల్లుని యాహ్వానమును నిరాకరించుట క్రమము గాదను తలంపున యజ్ఞమున కేగిరి.

కొన్ని దినముల క్రిందటనే జనకమహారాజు, శ్రీరామచంద్రుని సీతాదేవిని జూచుటకు, అయోధ్యాపురమునకు వచ్చి యుండెను. కౌసల్యాదేవి మొదలగువారు యజ్ఞమున కేగిన వెంటనే, యాయన తన రాజధాని యగు మిథిలాపురమునకు నిర్గమించెను. శ్వశ్రూజన

విరహముచేతను, పితృ విరహమువలనను, సీతాదేవి మిక్కిలి శోకాకులచిత్త యాయెను. పూర్ణగర్భావస్థ యాగుట శోకమోహము లాక్రమించిన యెడల, నపాయము గలుగ వచ్చునను తలంపున శ్రీరామచంద్రుఁడు సమస్తకార్యములఁ బరిత్యజించి యెల్లప్పుడు సీతాదేవి సమీపమందే నివసించుచు నామె నోదార్చుచుండెను.

ఒకదినమున రామచంద్రుఁడు జానకీదేవి సాన్నిధ్యమునందుఁ గూర్చుండి యుండ, ద్వారపాలకుఁడు వచ్చి సవినయవచనములతోడ "మహారాజా! ఋష్యశృంగ మహర్షి యాశ్రమమునుండి వార్తను గైకొని, యష్టావక్రమహాముని వచ్చియున్నాఁడు." అని విన్నవించుకొనఁగ "త్వరగా నాయన నిటకుఁ దోడ్కొనిరమ్ము." అని యాతురతతోడ శ్రీరాముఁడును సీతాదేవియు నాజ్ఞాపించిరి. వెంటనే ద్వారపాలకుఁడాయనను వెంట నిడుకొని వారి సన్నిధానమునకు వచ్చెను. అష్టావక్రుఁడు సీతారాములను సమీపించి చేతులెత్తి "దీర్ఘాయురస్తు" అని దీవింప వారాయనకుఁ బ్రణామం బొనర్చి యుచితాసనము నందుఁ గూర్చుండఁ బెట్టి "ఋష్యశృంగ మహర్షి కుశలముగ నున్నాఁడా? ఆయన యాగము నిర్విఘ్నముగ నెఱవేఱుచున్నదా?" అని శ్రీరాముఁ

డును, "మాగురుజనులును పూజ్యురాలగు శాంతాదేవియు, మిగిలిన వారును కుశలముగ నున్నారా? వారు మమ్ముఁ దలఁచుకొనుచున్నారా? లేక మఱచి పోయినారా?" అని జానకీదేవియుఁ బ్రశ్నించిరి.

అష్టావక్రుఁడు దండప్రణామమును నివేదించి, సీతాదేవిని సంబోధించి "అమ్మా! నిన్ను గన్నది విశ్వంభరాదేవి. నీ తండ్రి సాక్షాద్బ్రహ్మా నాఁ బరఁగు జనకమహారాజు. నీవు సర్వవిధములఁ బ్రసిద్ధి కెక్కిన రాజవంశమునకు వధువవై యున్నావు. కావున నీ విషయమున మేము ప్రార్థింపఁ దగినది యేమున్నది? కాని యిఁక నీవు వీరప్రసూతవు కావలయుననియే మే మహర్నిశము ప్రార్థింపుచుంటిమి." అని వశిష్ఠమహర్షి నుడివినాఁడని చెప్పెను. ఈవాక్యములు విని సీతాదేవి కొంచెము లజ్జితయై తలవంచు కొనెను, శ్రీరాముఁడు మిక్కుటమగు సంతసముతోడ "భగవానుఁడగు వశిష్ఠమహర్షి యాశీర్వాదము వలన మా మనోరథసిద్ధియగు ననుట నిక్కువము." అని నుడివెను. తదనంతరము అష్టావక్రమహాముని శ్రీరామచంద్రుని జూచి, "మహారాజా! పూజ్యురాలగు అరుంధతీదేవియు, కౌసల్యా మొదలగు వృద్ధమహిషీ గణమును, శాంతాదేవియు,

సీతాదేవి యెప్పు డేకోరికను గోరునో దాని నప్పుడే నెఱ వేర్పవలయు నని పలుమారులు చెప్పియున్నారు." అని నుడువ శ్రీరాముఁడిట్లనియె. "తాము వారికి నా సాష్టాంగ దండ ప్రణామంబులను దెలియఁజేయుఁడు. సీత యెప్పు డేకోరికను గోరిన దాని నప్పుడే నెఱవేర్చుచున్నాననియు, నిమేష కాలమైనను, ఆలస్యము గాని యశ్రద్ధగాని చేయుట లేదనియును విన్నవింపవలయును."

పిమ్మట అష్టావక్ర మహాముని జానకీదేవిని సంబోధించి "వత్సా! నీవు పూర్ణగర్భవతివై యుండుట చేత, యజ్ఞమునకుఁ దోడ్కొని పోఁజాలనైతిని. కాని యుండవలన నేను నీ యసంతుష్టికిఁ బాత్రుఁడను గాకుండుటను గాక. నీకు మానసోల్లాసమును గలిగించుటకు శ్రీరామలక్ష్మణులను నీ కొద్ద నేయుంచి యున్నాను. మేమందఱము యజ్ఞము పూర్తియైనంతనే యయోధ్యకు వచ్చి, అంకమునందు నవ కుమారునిచేత శోభిల్లు నిన్ను సందర్శింతుము." అని ఋష్యశృంగమహర్షి సాదరస్నేహవాక్యముల నుడివి యున్నాఁడని చెప్పెను. ఈ వాక్యముల వినుచున్న శ్రీరామచంద్రుఁడు సంతోషాంతరంగ హృదయుఁడై వశిష్ఠమహర్షి నాకేట్టి సందేశము నొసంగియున్నాఁడని యడుగ "వత్సా! యజ్ఞము

పూర్తియగుదాఁక మేమిచ్చటనే యుండవలయును. నేను బాలుఁడను. రాజ్యపదమునకు వచ్చి కొలఁది కాలమే యైనది. కావున ప్రజారంజనకార్యములయందెప్పుడును జాగరూకుఁడనై యుండవలయును. ప్రజారంజనసంభూతమగు చిర నిర్మల కీర్తియే రఘువంశీయులకు పరమోత్కృష్ట ధనము." అని సెలవొసంగెనని యాష్టావక్రుఁడు నుడువ శ్రీరాముఁడిట్లనియె. "నే నెప్పుడును ఆయన యాదేశములను, ఉపదేశములను, శిరస్సున ధరించుచుందును. కావున మీ రాయన చరణారవిందములకు నాసాష్టాంగదండప్రణామంబులు నివేదింపుఁడు. ప్రజల సౌఖ్యముకొఱకు దయాస్నేహములను, సుఖసౌఖ్యములను, విసర్జింపవలసి వచ్చినను, విడనాడుటకు సంసిద్ధుఁడను. చివరకు ప్రాణప్రియయగు సీతను బరిత్యజింపవలసివచ్చినను బరిత్యజింతును గాని వెనుదీయను. కాఁబట్టి యాయన, యజ్ఞపరిసమాప్తిదాఁక నచ్చటనే యుండవచ్చును. క్షణకాలమైనను బ్రజారంజన కార్యములయం దలక్ష్యముగాని, యశ్రద్ధగాని, జరుగుటలేదు. ఈ విషయమును వినిపింపవలయును." ఇట్లనుచుండ, జానకీదేవి పరమానందభరితయై, యిట్లనియె. "ఇట్లొనర్పని యెడలనార్యపుత్రుఁడు రఘుకుల ధురంధరుఁడెట్లగును?"

తదనంతరము, అష్టావక్రుండు సముచిత సంభాష ణలచే డ సీతారాముల నాశీర్వదించుచు విశ్రమించుట కేగెను. శ్రీరాముండును, సీతాదేవియు, సంభాషణకుం గడంగి మాటలాడుకొనుచుండ లక్ష్మణుండు వచ్చి, "ఆర్యా! మీ చరిత్రను చిత్రపటమునందుం జిత్రింప వలయు నని నేనొక చిత్రకారుని నాజ్ఞాపించి యుంటిని. ఆదే విధముగ నాతండు చిత్రపటమును సిద్ధముచేసి తీసికొని వచ్చియున్నాండు. కావున దానిని మీరు సందర్శింప వలయును." అని విన్నవించుకొనగ రాముండు "వత్సా! ఆకులచిత్తయైన దేవిని సంతోషపఱుచు విధమును నీవు బాగుగ నెఱుంగుదువు. కాని దానియం దెంతవఱకుం జిత్రింపంబడియున్నది?" అని ప్రశ్నింపంగా, "జానకీదేవి యగ్ని వలనం బరిశుద్ధ యగుపర్యంతము" అని లక్ష్మణుండు ప్రత్యుత్తరం బొసంగెను.

శ్రీరాముండీ వాక్యమును వినినంతనే, మిక్కిలి మనోవేదన నొందుచుం "వత్సా! నీవిది నా సమీపమునం బాకతను నోట రానీయంజనదు. ఆది విన్నను, శోక యాది తలంపునకు వచ్చినను నేను మిక్కిలి మనః పరితాపమును, లజ్జను, జెందుచున్నాను. అయ్యో! అది యెట్టి సంతాపకరమగు విషయము. ఏసాక్ష్యమైతే

జన్మించుట వలన జగత్తు పవిత్ర మాయెనో, యట్టి సీత యగ్ని వలనఁ బూతగావలసి వచ్చెను గదా! ప్రజా రంజన కార్య మెంతటి దురూహ్య వ్రతము?" అని పలుకు చుండ, "నాథా! మీ రావిషయముల మనస్సునకుఁ దెచ్చుకొని మనోవేదన నేల పొందెదరు? తా మప్పు డాకార్యమును సదసద్వివేచన తోడనే చేసియున్నారు. అప్పుడు తామ ట్లొనర్పనియెడల చిరనిర్మలమగు రఘు వంశమునకుఁ గళంకస్పర్శ గలిగి యుండు నని నిస్సం దేహముగఁ జెప్పవచ్చును. మఱియు నా కపవాద విముక్తి గూడ నయ్యెడిది కాదు." అని నుడువు జానకీ దేవి వాక్యము లాలించుచు, శ్రీరామచంద్రుఁడు నిట్టూర్పు విడచి "ప్రేయసీ! ఇఁక నాకథతోడ మనకుఁ బనిలేదు. రమ్మా. చిత్రపటమును సందర్శింతము." అని బయలు దేరిరి.

సీతారాములును, లక్ష్మణుఁడును జిత్రపటమును జూడ సాగిరి. జానకీదేవి కొంతవడి చిత్రపటమునం దటునిటు చూచి దాని పైభాగమందొక స్థలమును నిర్దేశించి చూపి "నాథా! ఆచిత్రితముల పేర్లేమి?" అని యడుగ రాముఁడిట్లు చెప్పందొడంగెను. "ప్రియా! అవి యన్నియు సమంత్రములగు సమ్మోహనాస్త్ర

ములు. బ్రహ్మ మొదలుగాఁగల ప్రాచీన ఋషిపుంగవులు వేదముల సంరక్షించుటకుఁగాను దీర్ఘకాలము తప మాచరించి యాతపోమయ తేజః పుంజము లగు పరమాస్త్రములను బొందియున్నారు. గురుపరంపరగా నవి భగవానుఁడగు కృశాశ్వునిం జెందెను. రాజర్షి యగు విశ్వామిత్రుఁ డాయనవలనుండి యాసమస్త మంత్రోపదేశములను బొంది కృపాప్రదర్శన పూర్వకముగ తాటకా సంహార కాలమునందు, వాని నన్నిటిని నాకుఁ బ్రసాదించియున్నాఁడు. అవి యప్పటినుండియు నాయధీనమం దున్నవి. నీకు పుత్రుఁడు గలిగినయెడల నవి వాని నాశ్రయించును."

ఈవైపున మిథిలాపుర వృత్తాంతమును జూపుమని లక్ష్మణుఁడు చెప్పఁగా సీతాదేవి చూచి పరమానంద చిత్తయై "ఉన్న దున్నటుల నా విషయమెంత మనోహరముగ చిత్రించినాఁడు? ఆహా! ఆర్యపుత్రుఁడు హరధనువు నెత్తి విఱుచుటకుఁ బ్రయత్నించు చుండుటయు, నాతండ్రియు నేనును విస్మయముతో రెప్పవాల్పక చూచుచుండుటయు నెంతబాగుగఁ బ్రదర్శింపఁబడియున్నది. ఈ దిక్కున వివాహమునాఁటి సభ. ఆసభకు మీరు నల్వురు సోదరులు తత్కాలోచితముగు

వేషభూషల ధరించి, యెట్టి సౌందర్యశోభచేఁ జెన్నారుచున్నారు? ఆసమయమునం దచ్చట యున్నటులున్నది. కాని చిత్రపటమును జూచుచున్నటులు లేదు.” అని నుడువు సీతాదేవి మాటలను వినుచుండు శ్రీరాముఁడు పూర్వవృత్తాంతము స్మృతి గోచరముకాఁగా నిట్లనియె. “ప్రేయసీ! మహర్షియగు శతానందుఁడు, నీ కమనీయ కోమల కరపల్లవమును, నాకరమునం దర్పించు నప్పటి స్థితి ప్రత్యక్షముగ జరుగు చున్నటు లున్నది. కాని, చిత్రితమువలె దోఁచుటలేదు.”

లక్ష్మణుఁడు చిత్రపటమునం దింకొక స్థలమున వ్రేలు పెట్టి చూపుచు “ఈమె పరమ పావనియగు జానకీదేవి. ఈమె పూజ్యురాలగు మాండవీదేవి. ఈమె శ్రుతకీర్తి” అని నుడివి లజ్జితుఁడై యూర్మిళను జూపకుండెను. దీనిని జానకీదేవి గ్రహించి, చిఱునవ్వొలయ వినోదార్థము వ్రేలితో యూర్మిళను జూపించి “వత్సా! ఈమె యెవరు?” అని ప్రశ్నింప లక్ష్మణుఁడు ప్రత్యుత్తరం బీయక ముసిముసి నగవులతోడ “దేవి! ఇటు చూడుము. హా! ధనుర్భంగ వార్తవిని క్రోధావేశ పరవశుఁడై క్షత్రియ కులాంతకారియగు పరశురాముఁడు, అయోధ్యాగమనపథమందెట్లు మనకడ్డ

ముగ నిలిచియున్నాఁడో కనుము. ఈ దిక్కున మహాప్రతాపశాలి యగు శ్రీరామచంద్రుఁ డీయన దర్ప సంహారము కొఱకు శరాసనమునం దెట్లు శర సంధానము జేయుచున్నాఁడో చూడుము." అని నుడువు చుండ శ్రీరామచంద్రుఁ డాత్మప్రశంసా శ్రవణ మువలన లజ్జితుఁడై "వత్సా! చిత్రపటమునం దనేక దర్శనీయ విషయము లుండఁగా, కేవల మీవిషయ మునే కైకొని మిక్కిలి యాందోళనము చేసెద వేల?" అని నుడువ జానకీదేవి పరమాహ్లాద భరితయై యిట్ల నియె. "నాథా! ఇట్లు కానియెడల మిమ్మంద ఱేకగ్రీవ ముగ నేల ప్రశంసింతురు?"

పిమ్మట అయోధ్యాపుర ప్రవేశ కాలమందలి, చిత్రరూపులఁ జూచి, శ్రీరాముఁ డశ్రుపూర్ణ నయనముల తోడను, గద్గద వచనముల తోడను, ఇట్లు చెప్పం దొడంగెను. "మనము వివాహముచేసి కొని వచ్చినప్పు డెట్టి సంతోషజనకమగు కార్యములతోడ దినములు గడచు చుండెను? మనలనుజూచి తండ్రిగారెట్టియా మోదమును, ఆహ్లాదమును బొందుచుండిరి? నూ తనవధువులనుగాంచి తల్లులు పరమానందభరితలై వారిక్షేమ మెప్పుడును గనుఁగొనుచు నెట్టిమమతను

ప్రదర్శింపుచుండిరి? రాజప్రాసాదము నిరంతర మానందోత్సవముల తోడ నిండి యుండెనుగదా? అయ్యో! ఆదినము లన్నియుగడచెను." ఇట్లాయన పలుకుచుండ లక్ష్మణుఁడు 'ఈమెయే మంథర' యని నుడివెను. మంథర పేరు విని నంతనే రాముఁడు విరక్తచిత్తుఁడై, యేవిధమగు ప్రత్యుత్తరం బొసంగక వేఱొక దిక్కునకు దృష్టిని మరలించి, యిట్లనియె. "ప్రేయసీ! ఇటు చూడుము. ఇదియే శృంగిబేర నగరము. ఈనగరమందలి యింగుదగు చెట్టుక్రింద పరమస్నేహితుఁడగు నిషాదపతి తోడ సమాగమ మెంత మనోహరముగా వ్రాయబడి యున్నది?"

దానినిచూచి సీతాదేవి సంతసించుచు "నాథా! ఈ దిక్కున జటావల్కలధారణ వృత్తాంతమును దెలుపు చిత్తరువును దిలకింపుఁడు." అని పలుక లక్ష్మణుఁడు "ఇక్ష్వాకు వంశజులు వృద్ధవయసున పుత్రుని హస్తములయందు, రాజ్యలక్ష్మిని సమర్పించి యరణ్యావాసమున కేగుచుండిరి. కాని యార్యుఁడు బాల్యకాలముననే కఠోరారణ్యావాస వ్రత మవలంబింప వలసి వచ్చెను." అని చెప్పుచు శ్రీరాముని సంబోధించి, "భారద్వాజ మహర్షి చిత్రకూటమున కేగు మార్గమును

జూపుచు, చెప్పిన కాళిందీ తీరస్థితంబగు వటవృక్ష మిదియే" అని నుడువ, సీతాదేవి వెంటనే "ఈప్రదేశ మందలి వృత్తాంతము జ్ఞాపకమున్నదా?" యనియడుగ, శ్రీరాముఁ డిట్లనియెను. "ప్రేయసీ! ఆవృత్తాంతమును మఱచుటెట్లు? ఇచ్చటనే నీవు నావక్షఃస్థలమందు తలఁ బెట్టుకొని నిద్రించితివిగదా!"

జానకీదేవి యింకొక వైపునకు వ్రేలు పెట్టి చూపుచు "నాధా! చూడుఁడు. ఈవైపున మనము దక్షిణారణ్యమును ప్రవేశించుట యెంత మనోహరముగ లిఖింపఁబడినది! దీనినిచూడఁగనే, యచ్చటి వృత్తాంత మంతయు జ్ఞాపకమునకు వచ్చుచున్నది. ఇచ్చట నేను సూర్యుని యుష్ణతాపమువలన బడలియున్నప్పు డాతప నివారణార్థము, తాము తాటి యాకును నాతలపైఁ బట్టుకొని యుంటిరి." అని నుడువ రాముఁ డిట్లనియె. "ప్రేయసీ! ఇవియే సెలయేళ్ళ ప్రక్కనున్న మునుల తపో వనములు. గృహస్థులు వానప్రస్థాశ్రమ మునవలంబించి, ఆయా తపోవన తరుతలముల యందు, విశ్రామజనిత సుఖభోగముల ననుభవించుచుందురు." అని చెప్పు చుండ లక్ష్మణుఁడు "దేవీ! ఇది దండకారణ్య మధ్య భాగమందున్న ప్రస్రవణగిరి. ఈపర్వత శిఖరప్రదేశ

మెల్లప్పుడు సంచారముచేయు జలధరపటల సంయోగమువలన నిరంతర నిబిడ నీలవర్ణాలంకృతమై యుండును. పర్వతోపరిభాగమందలి విశాల ప్రదేశమంతయు, నానావిధ వృక్షములచే నిండి నిబిడీకృతమై, సంతత స్నిగ్ధ శీతలతలములతోడ రమణీయమై యుండును. పాద దేశమునందు నిర్మల జలపూరితయగు గోదావరీనది, గొప్పగొప్ప తరంగముల పైని తరంగములతోడ ప్రబలవేగమునఁ బ్రవహింపుచుండును." అని నుడువ రాముఁ డిట్లనియె. "ప్రేయసీ! ఇచ్చట మనమెట్టి మానసోల్లాసముతోడ కాలమును గడపితిమో నీకు జ్ఞాపకమున్నదా? మనము పర్ణశాల యందు నివసించుచుంటిమి. లక్ష్మణుఁ డక్కడక్కడఁ దిరిగి, ఆహారోపయోగములగు కందమూల ఫలములను దెచ్చుట కేగుచుండెను. ఉదయముననను, సాయంసమయముననను మృదు మందగమనమునఁ బవిత్ర గోదావరీ తీరమునందుఁ దిరుగుచు, నిర్మల సలిల కణపూరితమగు శీతల సమీరణమును సేవింపుచుంటిమి. అయ్యో! అట్టి యవస్థయందుండియు నెట్టి సౌఖ్యమునఁ గాలమును గడపుచుంటిమి!"

లక్ష్మణుఁడు చిత్రపటము పైని వేఱొక వైపునఁ వ్రేలు పెట్టిచూపి "ఆర్యా! ఇదియే పంచవటీ తీరము. ఇది శూర్పణఖ" అని చూప, ముగ్ధ స్వభావయగు జానకీదేవి, యథార్థముగ పూర్వావస్థ తటస్థించెనని యెంచి, మ్లానవదన యై "అయ్యో! నాథా! ఇక్కడ నుండియే మీమాటలు వినుటయు, మిమ్ము చూచుటయుఁ బూత్రియయ్యెను." అని నుడివి భీతిల్ల, సీతాదేవి నోదార్చుచు, శ్రీరాముఁడు "ప్రేయసీ! ఇది చిత్రపటము గాని వాస్తవముగఁ బంచవటీ తీరముకాదు. పాపాత్మురాలగు శూర్పణఖకాదు." అని చెప్పెను. అంత లక్ష్మణుఁడు చిత్రపటమునం దొకచోటుఁ జూచి యిట్లు నుడువఁదొడంగెను. "ఏమి ఈ యాశ్చర్యము! దండకారణ్యమందు జరిగిన విషయ మంతయు, వర్తమానమున జరుగుచున్నటులు దోఁచుచున్నది! దురాచారుఁడగు నిశాచరుఁడు పసిఁడి లేడి నెపమునఁ గలిగించిన ఘోరవిపత్తు, సముచిత వైర నిర్యాతనమువలన సంపూర్ణముగఁ బ్రతికృత మైనను, అది జ్ఞాపకమునకు వచ్చినంతనే, హృదయము బ్రద్దలగుచున్నది. పిమ్మట శ్రీరాముఁడు, మానవ సంచార విహీనమగు దండకారణ్యమునందు వికలచిత్తుఁడై తిరుగుచుండుటం జూచిన

యెడల వజ్రసమ హృదయములుగూడ వ్రక్కలగు నను టకు సందియము లేదుగదా ?"

లక్ష్మణుఁడు పలుకు వాక్యముల విని, సీతాదేవి యశ్రుపూర్ణనయనములం గొని "నీ యభాగ్యురాలి కొఱకు కార్యపుత్రుఁ డెట్టి క్లేశముల ననుభవింపవలసి వచ్చెను" అనినుడువ శ్రీరాముని కన్నులనుండి నీటిబిందువులు జొట జొట రాలఁజొచ్చెను. అంత లక్ష్మణుఁడు శ్రీరాముని సం బోధించి "చిత్రపట సందర్శనమువలన తామేల యాకు లత నొందెదరు ?" అని ప్రశ్నింప, రాముఁ డిట్లనియె. "వత్సా ! తత్కాలమందు మనకు సంభవించిన విష మావస్థకు, ప్రతిహింసా సంకల్ప మనుక్షణము నా హృదయమును మేల్కొల్పు చుండనియెడల, నేను జీవించి యుండఁజాలననుట నిక్కవము. ఈ చిత్రపట సందర్శనమువలన నాయప్పటి యవస్థ స్మృతికి వచ్చి నా హృదయము తల్లడిల్లు చున్నది. కాని వత్సా ! నీ వీ సమస్త వృత్తాంతమును స్వయముగఁ జూచి యుండియుఁ దెలియని వానివలెఁ బ్రశ్నించెద వేల ?"

లక్ష్మణుఁ డీమాటలను విని, కొంచెము లజ్జి తుఁడై, శ్రీరాముని చిత్తవృత్తిని మరలించుట యావశ్యక మని తలంచి "ఆర్యా ! ఈవైపున దండకారణ్యా

భూభాగమును దిలకింపుఁడు ? ఇచ్చటనే కబంధరాక్షసుఁడు నివసించుచుండెను. ఈ దిక్కున ఋష్యమూక పర్వతమందుఁ బతంగమహాముని యాశ్రమము గలదు. ఈమెయే సిద్ధశబరి, సన్న్యాసిని. ఇదియే పరమ రమణీయమగు పంపాసరోవరము” అని చెప్పుచుండ, సీతాదేవిని సంబోధించి శ్రీరాముఁ డిట్లు చెప్పందొడంగెను. “ప్రేయసీ! ఇది యతిరమణీయమగు సరోవరము. నేను నిన్ను వెదకుచు వెదకుచు, నీసరోవరతీరమును జేరితిని. దీనియందు వికసిత కమలములు మందమారుత భరము వలనఁ గొంచెము కొంచెముగఁ గదలి సరోవరమున కనిర్వచనీయశోభను గలిగింపుచు సౌరభమును నలు దిక్కుల వెదఁజల్లుచుండెను. మధుపాన మత్తతవలన మధుకరములు రొదలుసేయుచు క్రిందికిమీఁదికిఁ దిరుగుచుండెను. హంసలు, సారసములు మొదలగు పక్షి తండములు, మానసోల్లాసముతోడ నిర్మల సలిలముల యందు కేళిసల్పుచుండెను. కాని, నా నయనాశ్రుధారలనవరతము ప్రవహించుచుండుటవలన, సరోవరము యొక్క సౌందర్యమును బూర్తిగఁ జూడఁజాలనైతిని.”

జానకీదేవి చిత్రపటమునందు దిగ్వొక స్థలమున దృష్టిని నిలిపి లక్ష్మణునితోడ, “వత్సా! ఆ పర్వత

మందలి, కుసుమితకదంబతరుశాఖలమీఁద, మయూరీ మయూరగణము లెట్లు నృత్యముఁ జేయుచున్నవి ! మలినకళేబరముఁగల నార్యపుత్రుఁడు, తరుతలమున మూర్ఛితుఁడై పడియున్నాఁడు. ఆర్యపుత్రుని బట్టుకొని నీవు రోదనము చేయుచుఁ గూర్చుండి యున్నావు. ఈపర్వతము పేరేమి ? " అని యడుగఁగ లక్ష్మణుఁడు "దేవీ ! ఆపర్వతముపేరు మాల్యవంతము. వర్షాకాలమం దది మిగుల రమణీయముగ నుండును. నవ జలధర పటల సంయోగమువలన, శిఖర ప్రదేశ మెట్టి యనిర్వాచ్య శోభఁ జెన్నారుచున్నదో చూడుము. ఆర్యపుత్రుఁ డిచ్చటనే మిక్కిలి వికలచిత్తుఁడై యుండెను." అను మాటలు వినుచున్న రామునకుఁ బూర్వావస్థ జ్ఞాపకమునకు వచ్చి వ్యాకుల హృదయుఁడై "వత్సా ! ఈ విషయము నింక విరమింపుము. ఇంక మాల్యవంతముపేరు దలపెట్టకుము. దీనిపేరు విన్నంతనే నేను శోకసాగరమం దనివార్య వేగమునఁ బడిపోవుచున్నాను. తిరిగి జానకీదేవి విరహము నూతన రూపమును దాల్చుచున్నది. " అని చెప్పుచుండు సమయమున జానకీదేవి నిద్రవలన నాకర్షింపఁ బడఁ జొచ్చెను. తద్దర్శనము వలన రామునితో లక్ష్మణుఁ డిట్లనియె.

"ఆర్యా! ఇఁక చిత్రపట సందర్శనమువలనఁ బ్రయో జనము లేదు. జానకీదేవి మిక్కిలి బడలి యున్నది. కావున కొంతవడి విశ్రమించుట యవసరము. నే నేఁగె దను. మీరు విశ్రామభవనమున కేఁగుఁడు."

ఇట్లు చెప్పుచు లక్ష్మణుఁడేఁగఁ బ్రయత్నించు సమయమునందు జానకీదేవి శ్రీరామునితోడ "నాథా! చిత్రపట సందర్శనమువలన నాకొక కోరిక గలుగు చున్నది. దానిని మీరు పూర్తిచేయవలయును." అని నుడివినంతనే, రాముఁడు "ప్రేయసీ! ఆ కోరికను దెల్పుము. దానిని వెంటనే నెఱవేర్తును." అని నుడువ, సీతాదేవి "నాథా! మునిపత్నులతోఁ గలసి తిరిగి తపోవనముల విహరించుచు, నిర్మల భాగీరథీ సలిలముల జలకమాడ వలయు నను నభిలాష నన్ను తొందర పఱుచుచున్నది." అని తన మనోభావమును వెల్లడిం చెను. వెంటనే శ్రీరాముఁడు లక్ష్మణునితోడ "వత్సా! జానకి యెప్పు డేకోరికను గోరునో దాని నప్పుడే నిర్వ హింపవలయునని గురుజను లాజ్ఞాపించియున్నారుగదా! కావున గమనోపయోగమగు ప్రయత్నములఁ జేయుము. రేపుదయముననే జానకి యభిలషించు స్థలమున కామె ననుపుదును." అని పలుక సీతాదేవి పరమానంద భరిత

మై "నాథా! మీరుకూడ నావెంట రారా?" అని ప్రశ్నింప రాముఁడు, "ప్రియా! నీ వా విషయమును గూర్చి నన్ను ప్రశ్నింపవలయునా? నిన్ను వదలి నేనొక ముహూర్తకాలమైనను స్థిరముగ నుండఁ గలనా?" అని నుడువ సీతాదేవి సంతసించుచు లక్ష్మణునివంకఁజూచి "వత్సా! నీవుకూడ నావెంటరావలయును" అని నుడువ లక్ష్మణుఁడు తన యంగీకారమును దెలిపి ప్రయాణ ప్రయత్నములు చేయుటకు నిర్గమించెను.

# సీతాదేవి వనవాసము.

## రెండవ ప్రకరణము

---

శ్రీరామచంద్రుఁడును, సీతాదేవియు, విశ్రామ భవనమున కేఁగి ప్రసంగమునకుఁ గడంగిరి. కానికొన్ని నిముసములలో జానకీదేవి నిద్రవలన నాకర్షింపఁబడఁ జొచ్చెను. తద్దర్శనమువలన శ్రీరాముఁడు "ప్రేయసీ ! నీవు బడలికఁ జెందినట్లున్నావు. కావున నీ బాహులతలను నాకంఠ ప్రదేశమునం దుంచి క్షణకాలము విశ్రమింపుము" అనినంతన, సీతాదేవి తన కోమలబాహు లతలచేఁ బ్రాణనాయకుని గౌఁగిలించుకొనఁ, శ్రీరాముఁడనిర్వాచనీయస్పర్శ సుఖానుభవమును బొంది, "ప్రేయసీ ! నీబాహు లతల స్పర్శవలన నాశరీర మమృతమయ మగుచున్నది. ఇంద్రియము లపూర్వ రసావేశముచేత వివశము లగుచున్నవి. చేతనము విలుప్తప్రాయమగుచున్నది. ఇప్పుడాకస్మికముగ నన్నావరించినది నిద్రావేశమో లేక మోహాపారవశ్యమో నిర్ణయింపఁజాలకున్నాను." అని పలుకి, శ్రీరాముని మృదుమంజుల

వాక్యములు విని సీతాదేవి చిఱునవ్వొలయ "నాథా! మీరు నాకు చిరసహాయులు. చిరప్రసన్నులు. ఇప్పుడు విన్న వాక్యములకంటె, స్త్రీలపక్షమునఁ గోరఁదగిన సౌభాగ్యవిభవ మేమున్నది? తాము నామీఁదఁ జిరకాల మీవిధమగు స్నేహానుగ్రహములు గలిగియుండవలయునని యే నాప్రార్థన." అని నుడివెను. జానకీదేవి నుడువు స్నేహమధుర కోమల వాక్యములు కర్ణగోచరములైనంతనే శ్రీరాముఁడు "ప్రియా! నీవాక్యశ్రవణము చేత నాశరీరము శీతల మగుచున్నది. శ్రోత్రములమృతరసముచే నింపఁబడుచున్నవి. సకలేంద్రియములు మోహ పరవశము లగుచున్నవి. సంజీవినీశక్తివలన, హృదయము ప్రఫుల్ల మగుచున్నది." అని నుడువు మాటలకు జానకీదేవి లజ్జితయై "నాథా! ఇందువలననే, తమ్మునందఱు ప్రియంవదులందురు. చివరకీ యభాగ్యురాలు తనకట్టి సౌభాగ్యము లభించు నని స్వప్నమందైనను దలంచి యెఱుంగదు గదా?" అని నుడువుచు జానకీదేవి శయనించుట కాతురయై యుండుటను గాంచి, శ్రీరాముఁడిట్లనియె. "ప్రేయసీ! ఇచ్చట శయనించుట కేవిధమగు శయ్యయు లేదు. కావున ననన్యసామాన్యమగు రామ బాహువులు వివాహ కాలము

నుండియు, నీకు గృహమందేమి, వనమందేమి, బాల్య
మందేమి జవ్వన మందేమి యాధారములై యుండు
విధమున నే, నేఁడివి నీకు తలగడ దిండ్లుగ నుపయోగిం
చుఁ గాత." అని పలుకుచు చేతులు చాచఁగ నే, వాని
పైఁ దలనిడుకొని జానకీదేవి నిద్రించెను.

శ్రీరాముఁడు నిమేష కాలము జానకీదేవి ముఖా
రవిందమును, ప్రేమాపూరిత వికసిత నయనముల
యెడ నిరీక్షించి చూచుచు, "ప్రేయసీ ముఖ్య వదన
పూర్ణేందు బింబమును సందర్శించినంత నే, నా చిత్త
చకోరము చరితార్థత నొందుచున్నది. అంతరాత్మ యని
ర్వచనీయానంద రసముచేత నభిషేకింపఁ బడుచు
న్నది. ఈమె గృహమునకు లక్ష్మీస్వరూప. నేత్ర
ములకు రసాంజన స్వరూప. ఈమె స్పర్శనము చందన
రసాభిషేక స్వరూపము. ఈమె బాహులతలు కంఠ
ప్రదేశమునం దుంచినప్పుడు కోమలమై శీతమును గలి
గించు ముత్యాల హారమువలె నుండును. ఆహా!
ప్రేయసీ సంబంధ మగు నవి యన్నియు నలౌకిక ప్రీతి
ప్రదములుగదా?" అని తలంచుచుండ సీతాదేవి స్వప్న
మునందు "హా! నాథా! ఎచ్చట నున్నారు" అని
కలవరించెను.

జానకీదేవి స్వప్నమందు నుడువు మాటలను విని శ్రీరాముఁడు "ఆహా! చిత్రపట సందర్శనమువలన, వియోగవిషయము ప్రేయసి హృదయమునందుఁ జొచ్చి స్వప్నమునం దాకారమును దాల్చి, తిరిగి యీమెకు తీవ్ర దుఃఖమును గలిగించుచున్నది గదా?" అని తల పోయుచు, జానకీదేవి శరీరముపైని చేయువైచి నెమ్మదిగ నిమురుచు, ప్రేమాభరమున శరీరము పులకరింప నిట్లు పలుకఁదొడంగెను. "అకృత్రిమ ప్రేమ యెట్టి పర మోత్కృష్ట పదార్థము? సుఖ దుఃఖముల యందేమి సంపద్విపత్తులయందేమి యౌవన వార్ధక్యముల యందే మి వికార శూన్యమై యొకే రూపముగ నుండును. నేసీవిధమగు ప్రణయసుఖమున కధికారినగుట సామాన్య విషయము కాదు. కాని, యిట్టి నిర్మలప్రేమ జగత్తు నం దత్యల్పము, కడుంగడు దుర్లభము. దుర్లభమే కానియెడల సంసారసుఖ మనంతము గదా!"

అని నుడువుచుండ, ద్వారపాలకుఁడు వచ్చి ద్వారమునొద్ద దుర్ముఖుఁడున్నాఁడని విన్నవించుకొనెను. దుర్ముఖుఁ డంతఃపురమునందుఁ దిరుగుచుండు నమ్మిక మగు బంటు. నూతన రాజ్య శాసన విషయమున ప్రజల యభిప్రాయములను దెలిసికొని వచ్చి చెప్పుటకుఁగాను,

శ్రీరాముఁడు వానిని గూఢచారునిఁగ నియమించెను. ప్రతిదినమును దుర్ముఖుఁడు మాఱువేసమున నాయా స్థానములయందుఁ దిరిగి, యచ్చటచ్చట విను సంగతులను శ్రీరామచంద్రునకు నివేదింపుచుండెను. కావున దుర్ముఖుఁడు వచ్చినాఁడను వార్త వినినంతనే, రాముఁడు వానిని దనసన్నిధికిఁ బంపవలయునని యాజ్ఞనొసంగెను. వెంటనే దుర్ముఖుఁడు రాముని సన్నిధానమునకు వచ్చిసాష్టాంగ దండప్రణామం బొనర్చి కరములు మోడ్చి నిలుచుండెను. రాముఁడు, "దుర్ముఖా! విశేషములు గలవా? నూతనవార్తలేవైనఁ దీసికొని వచ్చితివా?" అని ప్రశ్నింప "మహారాజా! ప్రజలెల్ల నేకగ్రీవముగా రామరాజ్యమునం దానందముగఁగాలము గడపుచున్నామని చెప్పుకొనుచున్నారు." అని దుర్ముఖుఁడు బదులు చెప్పెను.

దుర్ముఖుని వాక్యములవిని శ్రీరాముఁడుకొంచెము తీవ్రముగ నిట్లనియెను. "దుర్ముఖా! నీవు ప్రతిదినమును నన్ను గుఱించిన ప్రశంసావార్తలనే తీసికొని వచ్చుచుందువు. కాని, దూషణమును గుఱించి చెప్పుటయే లేదు. ఎవ్వరైనను నన్నుఁగూర్చి దోషములను వెల్లడించిన యెడల వానిని సవిస్తరముగఁ జెప్పుము. నేను వానికిఁ

ప్రతిక్రియనొనర్చి దోషవిముక్తుఁడ నగుదును. నా గుణ కీర్తనను వినుచుండవలయు ననుతలంపున నిన్ను గూఢ చారునిఁగ నియమింపలేదు.

దుర్ముఖుఁడు గత దినములయందు శ్రీరామునిగుణ కీర్తనను మాత్రమే వినుచుండెను. అందువలన వినిన వానిని విన్నటులు రామచంద్రునకు విన్నవించుచుండెను. కాని, యీదినమున జానకీదేవిసంబంధమునం ద్రపవాద మునువిని, యప్రియవాక్యములు పలుకఁజనదని యెంచి, యావిషయమును జెప్పకుండెను. కాని, శ్రీరాముఁడు దోషకథన విషయమును హెచ్చరించినంతనే దుర్ముఖుఁడు భయపడి హతబుద్ధియై, కొంతవడి మౌనమునుధరించి యుండి తదనంతరము కొంచెముధైర్య మవలంబించి వికాస విహీనమగు మోముతోడను వికృత స్వరముతో డను "లేదు. మహారాజా! లేదు. నేఁడెట్టిదూషణను వినలేదు." అనినుడివెను. కాని, రాముఁడు దుర్ముఖుని ముఖవైఖరిని జూచి మిక్కిలి సందేహముఁ గూడుకొని యాకులచిత్తుఁడై యిట్లనియె. "దుర్ముఖా! నేఁడు నీవు నిశ్చ యముగ దూషణమును వినియున్నావు. విన్నదానిని జెప్పక దాఁచెదవేల? ఆలసింపక, ఉన్నదున్నటులు చెప్పుము. చెప్పనియెడల నేనాగ్రహాగ్రస్తుఁడ నగుదును. ఈజన్మమున నీముఖమునుజూడను."

అత్యంతాగ్రహమునఁ గూడుకొనిన శ్రీరామ చంద్రునిఁ జూచి, దుర్ముఖుఁడు, "నేనెట్టి విషమసంధ యందుఁ దగుల్కొంటిని? రాజ్ఞీసంబంధమగు లోకాప వాదము నెట్లువిన్నవింతును? నేను హతభాగ్యుఁడను. కాని మొదల నిట్టికార్యభారమున కేల యంగీకరింతును? ముందు వెనుకలారయక యిట్టికార్యమునకుఁ బూనుకొని నప్పుడు ప్రభుసన్నిధానమందు యథార్థము నే చెప్పితీర వలయునుగదా?" అని తలంచి గజగజ వడకుచు, రామునివంకఁ జూచి "మహారాజా! నేను విన్న సంగతులను వినఁదలంచినయెడల తమరిచ్చటనుండి యింకొక గృహమునకు దయచేయుఁడు. ప్రాణముపోయినను నేనా విషయమునిచ్చట విన్నవింపను. అని నుడివినంతనే రామ చంద్రుఁడు జానకీదేవి మేల్కొనువఱకైనను వేచియుండక మెల్లమెల్లఁగా చేతిమీఁదనున్న సీతాదేవితలను క్రిందఁబెట్టి త్వరితగమనమున దుర్ముఖుని వెంట నిడుకొని మఱియొక గృహములోని కేఁగెను.

తదనంతరము శ్రీరాముఁడు మిక్కిలి యాతురత తోడ "దుర్ముఖా! ఇఁక నాలస్యము చేయవలదు. విన్న దానిని విన్నటులు చెప్పుము. నీయాకారమును జూచిన పలుశంకలు పుట్టుచున్నవి." అనినుడువ, దుర్ముఖుఁడు

"మహారాజా! నేను విన్న సర్వావస్థ దాయకమగు వృత్తాంతమును తమకు నివేదింపవలయునని తలంచి నప్పటినుండియు నాకుఁగంప మెత్తుచున్నది. రక్తము నుప్పొంగిపోవుచున్నది. ముందు వెనుకలారయక రాజ్య కార్యభారమునకుఁ బూనుకొనినప్పుడు, విన్నదానిని విన్నవించక తీరదుగదా? మహారాజా! నామీఁద నాగ్రహింపకుందురుగాక! మొత్తముమీఁద ప్రజలందఱేకగ్రీవముగ తమయశస్సును గానముచేయుచున్నారు. రామ రాజ్యమునందుఁ బరమానందముగఁ గాలము గడపుచున్నామనియును, కోసలరాజ్యమును బాలించిన యేరాజుకూడ ఇట్టిమంచిపద్ధతుల నెలకొల్పి యుండలేదనియును, చెప్పుకొనుచున్నారు. కాని, కొందఱు మాత్రము రాజ్ఞీవిషయమునందిట్లు నింద్యముగ మాటలాడుచున్నారు. "మారాజు నిర్మలహృదయుఁడు. కావుననే రావణుని గృహమునందంతకాల మొంటరిగ నివసించియున్న సీతాదేవిమీఁద నణుమాత్రమైనను, ననుమానము లేక, దూషితయని తలంపక, ఆమెను తీసికొనివచ్చి గృహమునందుంచుకొని యున్నాఁడు. ఇఁక మనస్త్రీల చరిత్రలయందు దోషములు కనఁబడిన యెడలఁ వారిని శాసించుట భారమగును. దండించుటకుఁ

ప్రయత్నించినప్పటికి, నారుసీతాదేవిని జేర్కొని మనల నిరుత్తరులుగఁ జేయుదురు. రాజు ధర్మాధర్మములకుఁ గర్త. కావున నాయన మార్గానుసారముగనే ప్రజలు గూడ వర్తింపవలయును." అని చెప్పి "మహారాజా! విన్నదానినంతయు విన్నవించుకొంటిని. నా యపరాధములను క్షమింపుఁడు. హా! విధాతా! నా కింతి కాలమునకు దుర్ముఖుఁడను నామమును సార్థకము జేసితివా?" అని నుడువుచు రోదనము చేయుచు సెలవు గైకొని దుర్ముఖుఁడేగెను.

దోష కథావృత్తాంతమును విని శ్రీరామచంద్రుఁడు "హా హతోస్మి! హా హతోస్మి" అని నుడువుచు మొదలు నఱికిన కదలీవృక్షమువలె భూమిమీఁదఁ బడి చేతనాశూన్యుఁడై కొంతవడికిఁ దెప్పిరిల్లి కన్నీటిని గార్చుచు, పరితపించుచు "అయ్యో! యెట్టి సర్వానర్థదాయకమగు వృత్తాంతమును వింటిని. ఇంతకంటె నావక్షస్థలమందు పిడుగుపడిన శ్రేయోదాయకముగ నుండెడిది గదా? అయ్యో! నేనెందుకొఱకు కింతదనుక జీవించియుంటిని? నేనుమిక్కిలి హతభాగ్యుఁడను. కానిచో నన్ను సంక్రమించుచున్న రాజ్యాధిపత్యమును విడనాడి యేల యరణ్యావాసమున కేఁగవలసి వచ్చెను? ఎందువలన దురాత్ముఁ

డగు దశాననుఁడు పంచవటీతీరమునకువచ్చి, ప్రాణప్రియ యగు జానకీదేవిని బలవంతముగ నెత్తుకొనిపోయి, చిర నిర్మలమగు రఘువంశమున కపవాద కళంకమును గలి గించెను ? అగ్ని పరిశుద్ధివలన నాయపవాద విమోచన మైనప్పటికిని, ఏల యది నూతనాకారమునుదాల్చి సర్వత్ర వ్యాపించుచున్నది ? వీనినిబట్టిచూడ రాముఁడు పరమ నిర్భాగ్యుఁడు. రామునిజీవితము దుఃఖభాజనముకొఱకు. అయ్యో ! ఇప్పుడేమి చేయుదును ? ఏమి చేయుటకుఁ దోఁచుటలేదుగదా? ఈలోకనిందను నివారించుట సాధ్యముకాదు. ఇప్పుడిది యాధారశూన్యమైనదని యెంచి యుపేక్షింతునా ? లేక, నిరపరాధయగు జానకీదేవిని బరిత్యజించి కులకళంకమునుదీర్తునా ? ఏమిచేయుదును ? ఏవిధముగను నిర్ణయింపఁజాలకున్నాను. నావలె నిట్టి విషమసంకటమునందుఁదగులొ్కనినవాఁడు, భూమండల మందింకొకఁడుండఁడనుట నిక్కవము." అని మనోవేదన నొందుచు 'కొంతవడి తలవంచుకొని క్రిందఁజూచుచు, మౌనావలంబియై యుండి, పిమ్మట దీర్ఘనిశ్వాసమును విడిచి, 'ఈవిషయమునం దుచితానుచిత విచారణలతోఁ బనిలేదు. రాజ్యభారమును వహించుటవలన సర్వ విధములచేతను బ్రజలను రంజింపఁ జేయుటయే నా

ప్రథమకర్తవ్యము. మఱి ముఖ్యధర్మము. కావున జాన కిని బరిత్యజించియే తీరవలయును. అయ్యో ! దైవమా! ఏమనమునం దిట్టి సంకల్పముం డెనా ? ' అని నుడువుచు మూర్ఛితుఁడై క్రిందఁబడెను.

తదనంతరము రామచంద్రుఁడు కొంతవడికిఁ దెలివొంది లేచి మితిలేని దుఃఖమువలన గన్నీరు గార్చుచు, జాలిగొలుపు వాక్యముల నిట్లు తలపోయం దొడంగెను. "తిరిగి నాకిప్పుడు తెలివి రానియెడల నాకు మహోపకారమయ్యెడిదిగదా ? అట్లయినచో నిరపరాధయగు జానకీదేవిని బరిత్యజించి ఘోరతరపాప పంకమునందుఁ దగుల్కొనకుండెడివాఁడను. ఇంతకుముందేగదా ప్రజారంజనార్థము జానకీదేవిని బరిత్యజింపవలసివచ్చినను, పరిత్యజింతునని యష్టావక్రమహామునితోడఁ బ్రతిజ్ఞలుపలికియుంటిని. ఈవిధముగ సంభవించుననికాఁబోలు నానోటినుండి యట్టి విషమప్రతిజ్ఞవచ్చినది. అయ్యో ! ప్రేయసీ ! జానకీ ! అయ్యో! ప్రియవాదినీ ! అయ్యో ! రామమయజీవితా ! అయ్యో ! అరణ్యావాస సహచారిణీ ! చివర కీవిధముగ సంభవించునని కలయందైనను, దలంచియెఱుంగవుగదా ? దురాచారుఁడ, హతభాగ్యుఁడ, నరాధముఁడ నగు నాచేఁ బడినప్పటినుండియు క్షణ

కాలమైనను సౌఖ్యమెటులుంగవు గదా ? సీతా ! చందన తరువను భ్రమచేత నీవు విషవృక్షము నాశ్రయించితివి. నేను పరమపవిత్రమగు రాజవంశమునందు జన్మించితి ననుట నిక్కువము. కాని యాచరణయందుఁ జండాలుని కంటెను వేయిమడుంగుల యధముఁడను. కానియెడల నిర పరాధినగు నిన్నేల పరిత్యజించుటకుఁ దలపెట్టుదును ? అయ్యో ! ఈముహూర్తమునందు నాకు మరణముసంభ వించినయెడల ధన్యుఁడనుగదా? నేనిఁకఁ బ్రతికిఫలమేమి? నాజీవిత ప్రయోజనము సంపూర్ణమైనది. జగత్తు శూన్య మై జీర్ణారణ్యమువలెఁ దోఁచుచున్నది."

ఈవిధముగఁ దలపోయుచు, గజగజ వడఁకుచు, తత్తరిల్లుచు, క్షణకాలము నిశ్శబ్దముగ నుండి పిమ్మట దీర్ఘనిశ్వాసమును విడిచి "అయ్యో ! యేమైనది?" అని నుడివి కౌసల్యాదేవి మొదలగువారి నుద్దేశించి గద్గద వాక్యముల నిట్లు పలుకందొడంగెను. "అయ్యో! తల్లీ! కౌసల్యాదేవీ ! అయ్యో ! ప్రేమాస్పదుండవగు జనక మహారాజా ! అయ్యో ! వసుంధరాదేవీ ! అయ్యో ! కులగురువగు వసిష్ఠమహర్షీ ! అయ్యో ! భగవానుఁడా విశ్వామిత్రమహర్షీ ! అయ్యో ! ప్రియ స్నేహితుఁడ వగు విభీషణుఁడా ! అయ్యో! పరమోపకారీ సుగ్రీవా !

అయ్యో! వత్సా! ఆంజనేయా! మీరెచ్చటనున్నారు? ఇక్కడఁ బరమదుర్మార్గుఁడగు రాముఁడు, మీకు సర్వ నాశనమును గలిగింపఁ బ్రయత్నించు చున్నాఁడు. అయ్యో! నాకిట్టి మహానుభావుల నామముల నుచ్చ రించుటకుఁగూడ నధికారముగలదా? నావంటి మహా పాతకి యెవరి నామము లుచ్చరించునో వారికిఁ బాపస్పర్శ గలుగుననుట నిక్కువము. నిరపరాధ యని యెఱింగియు సరళహృదయయు, పరిశుద్ధచరిత్రయు, పరమపావనియు, పతిభక్తి పరాయణయునగు సాధ్విని ననాయాసముగఁ బరిత్యజించుటకుఁ బ్రయత్నించుచున్న నావంటి మహా పాతకి భూమండలమం దింకొకఁడు గలఁడా? అయ్యో! రామమయ జీవితా! సీతా! పాషాణహృదయుఁడును, పరమ కిరాతుఁడు నగు రామునివలన నీ కిట్టి దుర్గతి సంభవింప నున్నదని కలయందైనను దలంచి యెఱుం గవుగదా? నిశ్చయముగ రాముని హృదయము వజ్ర తుల్యము. కానియెడల నేల యది బ్రద్దలు కాకుండును? విధాత నన్నీవిధ మగు కఠిన హృదయునిఁగఁ జేసి యున్నాఁడు. లేనియెడల నిట్టి నృశంసకార్యమున కెట్లు పూనుకొనఁగలను?"

అని నుడువుచుఁగన్నీటినిగార్చుచు, తిరిగి విశ్రామ భవనమున కేగి నిద్రించుచున్న జానకీదేవి సాన్నిధ్య మందునిలిచి చేతులు జోడించుకొని, “ ప్రేయసీ! హత భాగ్యుఁడగు రాముఁడు ఈజన్మకు నీయొద్దనుండి సెలవు గైకొనుచున్నాఁడు.” అని నుడివి భూదేవిని సంబోధించి “దేవీ! విశ్వంభరా! దురాత్ముఁడగు రాముఁడు సీతను బరిత్యజించెను. కావున నీపుత్రికను నీవు సంరక్షించు కొనుము.” అని చెప్పుచు దుస్సహ దుఃఖ దవానలముచేత దహింపఁబడుచు, విశ్రామ భవనమును విడిచి కార్యాలోచన మందిరమున కేగెను.

# సీతాదేవి వనవాసము.

## మూఁడవ ప్రకరణము.

శ్రీరామచంద్రుఁడు కార్యాలోచన భవనమున కేఁగి సింహాసనాసీనుఁడై, భరత లక్ష్మణ శత్రుఘ్నులఁ దోడ్కొని రావలయునని పరిచారకుల కాజ్ఞాపించెను. పరిచారకు లేఁగి రాముని యాజ్ఞను దెలుపఁగా భరత లక్ష్మణ శత్రుఘ్నులు "సాయంకాలమునం దార్యుఁడు, జనకతనయా సహవాస సుఖమున కాలయాపనము చేయుచుండెను. కాని యిట్టి యసమయమునం దాకస్మికముగఁ గార్యాలోచన భవనమున కేఁగి మనలను బిలువ నంపుటకుఁ గారణమేమైయుండును?" అని తలంచుచు, విషయమును నిర్ణయించుకొనఁ జాలక పరిపరివిధములఁ దలపోయుచు, ఆకులచిత్తులై త్వరితగతిని గార్యాలోచన భవనమున కరుదెంచి, చేరలయందుఁ జెంపల నిడుకొని మాటిమాటికి దీర్ఘ నిశ్వాసమును విడుచుచు, సంతత ధారగాఁ గన్నీటినిగార్చుచున్న యగ్రజునిజూచి, దుఃఖ నిమగ్నులైరి. కాని, సాహసించి కారణ మడుగఁజాలకుండిరి. చివరకు నీ రేదియో యొక విపత్తు సంభవించి

నదని నిశ్చయించుకొని, కన్నీరుగార్చుచు రామునివంకఁ జూచుచుండిరి.

రామచంద్రుఁడు పొంగిపొరలుచున్న శోకప్రవాహావేగమును గొంచె మాఁపుకొని, కన్నీటిని తుడుచుకొనుచు, వాత్సల్య పూరిత స్వరముతోడ సోదరుల మువ్వురను గూర్చుండ నాజ్ఞాపించెను. వారు కూర్చుండి ప్రకాశ విహీనమగు శ్రీరామచంద్రుని ముఖమును నిరీక్షింపుచుండిరి. రాముని నయనయుగళమునుండి కన్నీటిధారలు ప్రబలవేగమునఁ బ్రవహించుచుండెను. తద్దర్శనమువలన భరత లక్ష్మణ శత్రుఘ్నులు మితిలేనిమనోవేదన నొందుచుఁగన్నీటిఁగార్చుచుండిరి. ఇట్లు కొన్ని నిముసములు గడచిన పిమ్మట, లక్ష్మణుఁడిఁక వేచియుండఁజాలక కొంచెము ధైర్య మవలంబించి, వినయవిధేయతలతోడ నిట్లనియె. "ఆర్యా! తమ యవస్థను జూచి మేము మృతప్రాయుల మగుచున్నాము. భవదీయ భావ సందర్శనమువలన, ప్రతివిధాన మొనర్చుటకు వీలుకాని యాపద యేదియో సంభవించినటులు స్పష్టముగఁ దోఁచుచున్నది. స్వల్ప కారణమువలన మహాసముద్రమొప్పుడును గల్లోలమునొందదు. వాయువేగముచేత హిమాలయ పర్వతరాజము చలింపదు.

కావున నీవు పరితపించుటకుఁగల కారణమును జెప్పి మా ప్రాణముల నిలుపుఁడు. తమ ముఖారవిందము సాయంకాలమందలి కమలము కంటెను మ్లానమై, ప్రభాతమందలి చంద్రునికంటె కాంతివిహీనమై కన్పట్టు చున్నది. ఆర్యా! త్వరగా సెలవిండు. ఆలసింప వలదు. మా హృదయములు బ్రద్దలగుచున్నవి." అని ప్రార్థింపఁ జొచ్చెను.

అత్యాతురతతోడఁ గారణమడుగు లక్ష్మణుని వాక్యముల విని, శ్రీరామచంద్రుఁ డతి దీర్ఘనిశ్వాస మునువిడిచి, మిక్కిలి శోకభరమునను, గద్గద స్వరము తోడను, సోదరులవంకఁ జూచి యిట్లనియె. "వత్సా! భరతా! వత్సా! లక్ష్మణా! వత్సా! శత్రుఘ్నా! మీరే నా జీవనము. మీరే నా సమస్తధనము. నేను దుస్సహరాజ్యభారవహనక్లేశమును మీకొఱకే భరించు చున్నాను. హితసాధనవలనను, అహితనిరాకరణవల నను, మీరే నాకు ముఖ్యసాహాయ్యులు. నేనిప్పుడు ఘోరవిపత్తునందుఁ దగుల్కొని దానినుండి యుద్ధరింపఁ బడుటకు మిమ్మీ యసమయమునందుఁ బిలువనంపి యున్నాను. ఈవిపత్తునుండి తప్పించుకొనుట కొక మార్గముమాత్రమే కలదు. అనేక విధముల యోచించి

చూచితిని. కాని చివరకా యుపాయమునే నవలంబించుటయే, సర్వవిధముల శ్రేయోదాయకమని తోఁచుచున్నది. కావున మీరా విషయమును సావధానచిత్తులరై వినుఁడు. తర్వాత సముచిత కార్యాచరణము వలన, నీవిపత్తునుండి విముక్తుఁడ నగుదును." అని చెప్పుచు, ప్రబల వేగమునవచ్చు నశ్రుధారల విసర్జింపుచుండెను.

తద్దర్శనమువలన భరత లక్ష్మణ శత్రుఘ్నులు మితిలేని దుఃఖమును బొందుచు, "ఆర్యుని లక్షణములు చూడ ఘోరవిపత్తేదియో సంభవించిన దనుట నిక్కువము. ఇప్పుడీయన మనకెట్టి ఘోరవార్తను వినిపించునోగదా ?" అని తలంచుచు విషయమును వినుటకాతురులై రెప్పవాల్పక తదేకనిష్ఠగా రాముని మోము వంక నిరీక్షించుచుండిరి. శ్రీరామచంద్రుఁ డొక నిమేష కాలము మౌనమును ధరించి యుండి పిమ్మట ఇట్లు చెప్పం దొడంగెను. "సోదరులారా ! మనవంశము నందు జన్మించిన నరపతు లెదురులేని ప్రతాపమునఁ బ్రజాపాలనం బొనర్చి యనేకవిధా లౌకిక కార్యములొనర్చి యీ చిరపవిత్రమగు నిక్ష్వాకు వంశమును త్రిలోక విఖ్యాతముగఁ జేసియున్నారు. కాని నేను

హతభాగ్యుఁడను. నేనుజనించి చిరపవిత్రమగు నిక్ష్వాకు వంశమును అసాధారణ కళంకపంకమునందు ముంచి యున్నాను. వత్సా! లక్ష్మణా! ఇందు నీకుఁ దెలియనిది లేశమైనను లేదుగదా! సోదరులారా! మేము ముప్వురము పంచవటీ తీరమునందు నివసించునప్పుడు, దురాత్మకుఁడగు దశాననుఁడు వచ్చి మేము సమీపమున లేనప్పుడు, బలాత్కారముగ జానకిని ఎత్తుకొని పాఱిపోయెను. అందువలన సీత యాదురాత్ముని యాలయమునం దొంటరిగఁ జాలకాలము నివసింపవలసి వచ్చెను. మేము సుగ్రీవుని సాహాయ్యమువలన నా దురాత్మునకుఁ దగు శిక్ష నొసంగి సీతాదేవి నుద్ధరించితిమి. పిమ్మట పరగృహమందు నేకాకిగా నున్న జానకిని గ్రహించి యయోధ్యకుఁ దీసికొని వచ్చితిని. ఇందువలన ప్రజలసంతృప్తినొంది యపవాదములఁ జాటుచున్నారు. ఈ యపవాద విముక్తికిగాను సీతను విడనాడుదు నని ప్రతిజ్ఞఁ బూని యున్నాను. సర్వవిధ ప్రయత్నముల చేతఁ బ్రజారంజనం బొనర్చుటయే రాజులకు పరమ ధర్మము. అట్లొనర్పఁజాలని వాని జీవితము నిష్ఫలము గదా? నిష్కల్మష చిత్తమున నీ యామోదమును దెలిపినయెడల నేనీ విపత్తునుండి యుద్ధరింపఁబడుదును.”

శ్రీరామచంద్రుని వాక్యములవిని, భరత లక్ష్మణ శత్రుఘ్నులు విషణ్ణహృదయులై, భయవిస్మయములు గ్రమ్మ నేమిచేయుటకుం దోఁపక, మౌనమును ధరించి క్రిందఁ జూచుచుండిరి. కొంతవడికి లక్ష్మణుఁడు తల యెత్తి శ్రీరామునివంకఁ జూచి కడు దీనస్వరముతోడ నిట్లనియె. "ఆర్యా! మీరెప్పు డేయాజ్ఞ నొసంగినను దానికి మేము ప్రత్యుత్తరముగాని యాటంకమునుగాని, గలిగించి యెఱుంగము. ఇప్పుడుగూడ మేము తమ యాజ్ఞను నిరాకరింపఁ దలంపలేదు. కాని తమప్రతిజ్ఞను వినినంతనే మాప్రాణములు పరలోక గమనోన్ముఖము లగుచున్నవి. తమ సన్నిధానమునకు వచ్చిన పిమ్మటను గూడ నిట్టి దుర్వార్తను విందుమను శంకయైనను మా మనములయం దుదయింపలేదు. కాని యీ విషయ మున నేను కొంచెము చెప్పఁ దలఁచితిని. తమ రాజ్ఞ యొసంగినయెడల విన్నవించుకొందును."

లక్ష్మణుని వినయపూర్వకమగు దీనాలాపముల విని "వత్సా! చెప్పఁ దలఁచిన దానిని స్వేచ్ఛగాఁ జెప్పుము." అని రామచంద్రుఁడు నుడివినంతనే లక్ష్మణుఁ డిట్లు చెప్పఁ దొడంగెను. "ఆర్యా! జానకీదేవి రావణా సురుని గృహమునం దేకాకిగా నున్నదనుమాట వాస్త

వము. రావణుఁడు మహాదుర్మార్గుఁ డని చెప్పుటకుఁ గూడ సందియము లేదు. కాని తాము దురాత్మునకుఁ దగు శిక్ష నొసంగితిరి. పిమ్మట పూజ్యురాలగు సీతాదేవిని తమ సాన్నిధ్యమునకుఁ దీసికొని వచ్చినప్పుడు లోకాపవాదభయమువలనఁ దాము దేవిని స్వీకరించుట కంగీకరింపరైతిరి. తదనంతర మగ్నిపరీక్షవలన జానకీదేవి పవిత్రచరిత్రయని వెల్లడియైన పిమ్మటనే యామెను మీరు గ్రహించి యయోధ్యకుఁ దీసికొని వచ్చితిరి. ఆపరీక్ష సర్వజన సమక్షమందు జరిగెనే కాని రహస్యముగ జరుగలేదు. మన మిర్వురమును, సైన్యాధిపతులును, సమస్తదేవతలును, దేవర్షులు మహర్షులును, పరీక్షాకాలమం దుండిరి. వారంద ఱేకగ్రీవముగ 'సీతాదేవి పరమపావని' యని నుడివిన పిమ్మటనే తాము జానకీదేవిని గ్రహించియున్నారు. కావున జానకీదేవి పైని పరగృహమందు నివసించెనను నిందను మోపుటకు వీలులేదు. కాని యిప్పుడు తా మెందువలన నీవిధమగు విషమప్రతిజ్ఞ నొనర్చియున్నారో తెలిసికొనఁ జాలకున్నాను. నిరాధార మగు లోకనిందలకు తమవంటి వారలు చలించుట న్యాయము గాదు. న్యాయాన్యాయ విచక్షణజ్ఞానము సామాన్య జనులకు శూన్యము.

వారికిఁ గల బుద్ధియు వివేకజ్ఞానము నత్యల్పము. వారి హృదయములయం దేదియుదయించునో, దానిని వారు పలుకుచుందురు. సంభవమా లేక యసంభవమా యను విచారణ లేకయే విన్న దానిని విశ్వసింతురు. వారి మాటలమీఁద నాధారపడిన యెడల సంసార యాత్ర జరుగుటయే దుర్లభమగును. పూజ్యురాలగు జానకీదేవి పరిశుద్ధచరిత్ర యను విషయమునందుఁ దమకు లేశమైనను సందియము లేదని నే నెఱుంగుదును. అగ్ని పరీక్షయందు ఉత్తీర్ణయైన సీతాదేవిని పరిశుద్ధచరిత యని తలంచుట కెవ్వరి హృదయములయందును శంక గలుగుటకు వీలు లేదు. కాఁబట్టి యిట్టి స్థితియందు జానకీ దేవిని బరిత్యజించినచో, లోకులు మనల నయోగ్యులుగఁ దలంతురు. మఱియును మనము ఘోరతర పాప పంకమునందుఁ దగులొందుదుము. కావున తామ బాగుగ విచారించి కార్యాచరణకుఁ గడంగ వలయునని ప్రార్థించుచున్నాను. మేము మీ యాజ్ఞానువర్తులము. కావునఁ దమయాజ్ఞను నిస్సందేహముగ శిరస్సున ధరింతుము."

లక్ష్మణుఁడు చెప్పు మాటలను విని రాముఁడు నిమిషకాలము మౌనావలంబియై యుండి తర్వాత నిట్లు

చెప్పఁ దొడంగెను. "వత్సా! సీత పరమపవిత్రురాలను విషయమునందు నాకణుమాత్రమైనను సందేహము లేదు. సామాన్యజను లేవిషయమును గూర్చియు బాగుగ విచారింపరు. వారు దేనిని విందురో, లేక వారి హృదయములయం దేది యుదయించునో, దానిని విశ్వసించి యాందోళన చేయుచుందురు. కాని యీ విషయమునందు ప్రజలదోష మణుమాత్రమైనను లేదు. ముందువెనుక లారయక ప్రవర్తించుటవలననే మనకిట్టి ఘోరవిపత్తు సంభవించినది. అయోధ్యాపురమునకు వచ్చిన పిమ్మట ప్రజల సమక్షమందు సీతను పరీక్షించిన యెడల, వారినాశ్రయించిన సకల సంశయములు దూరమయ్యెడివి. సీత యగ్నిపరీక్షయందు జయమొంది తన పరిశుద్ధచరిత్రను బ్రకటించెననుట సత్యము. కాని యీ విషయమైన యాథార్థ్యమందుఁ బ్రజల కంతఁగా విశ్వాసము లేదు. కొంతమంది కీపరీక్షసంగతి తెలియనే తెలియదు. కావున సీత చరిత్ర విషయమునందు వారికి సందేహ నివృత్తికాలేదు. ముఖ్యముగ రావణుని దుర్మార్గ చరిత్రను, బహుకాల మొంటరిగ వాని గృహమందు సీత నివసించుటను గూర్చి యోచించిన యెడల, సీత చరిత్ర విషయమునందు సందేహము గలు

గుటయం దాశ్చర్య మేమియు లేదు. ఇందువలనం బ్రజల మీఁద నేనణుమాత్ర మగుంనను నింద మోపఁజాలకున్నాను. నాదురదృష్టమువలన మఱి కిట్టి విపరీతోపద్రవము సంభవించినది. నేను రాజ్యభారమును వహింపనియెడల ప్రజారంజనంబొనర్తు నను ప్రతిజ్ఞకు బద్ధుఁడను గాకుందును. అందువలన నిరాధారమగు లోకాపవాదమును గణన సేయక నిస్సందేహముగ సంసారయాత్ర గడపుచుండెడివాఁడను. కాని రాజ్యపద మధిష్ఠించి ప్రజారంజనం బొనర్పఁ జాలని బ్రతుకు నిష్ఫలముగదా? ప్రజలు సీతను "అసతి" యని సిద్ధాంతీకరించి యున్నారు. వారి మనములనుండి యా సిద్ధాంతమును దొలఁగించుట యసంభవము. కావున సీతను గృహమునం దుంచుకొనినయెడల "అసతీసంసర్గి" యని ప్రజలు నన్ను సహ్యించుకొందురు. యావజ్జీవ మిట్టి నిందాస్పదమగు బ్రతుకు బ్రతుకుటకంటె మరణించుటయే మేలు. ప్రజలను రంజింపఁజేయుటకుఁగాను బ్రాణత్యాగమొనర్చుకొనుటకుఁగూడ సంసిద్ధుఁడను. నా ప్రాణములకంటెను గూడ మీరు నాకధికులు. అట్టి మిమ్ము ప్రజారంజనార్థము విడువ వలసి వచ్చినను విడుచుటకు వెనుదీయను. మఱి దుఃఖింపను. కావున సీతను విడనాడుట

యింత కఠినకార్యము గాదు. మీరెంత చెప్పినను లేక యది యెంత యన్యాయమైనను, సీతను బరిత్యజించి కులకళంకమును దీర్ప నిశ్చయించుకొని యున్నాను. కావున మీకు నామీఁద దయాస్నేహము లున్న యెడల నీవిషయమునం దాటంకమును గలిగింపవలదు. సీతను బరిత్యజించుటయో, లేక నేను ప్రాణత్యాగ మొనర్చుకొనుటయో, జరిగి తీరవలయు నని నమ్ముఁడు."

శ్రీరామచంద్రుఁ డిట్లు చెప్పుచు క్షణకాల మశ్రుపూర్ణ నయనములతోఁ దల వంచుకొని యుండ, సమ్ముఖ లక్ష్మణునివంకఁ జూచి యిట్లనియె. "వత్సా! నా పరితాపమును వినుము. నాయాజ్ఞను బరిపాలింపుము. ఇంతకు ముందే సీత తపోవన సందర్శనార్థ మేఁగెద నని కోరికను వెల్లడించి యుండెను గదా! కాఁబట్టి యామిషమీఁదనే యామెను దీసికొని వెళ్లి వాల్మీకిమహర్షి యాశ్రమమందు దిగవిడిచిరమ్ము. అట్లొనర్చిన యెడల నాకుఁబరమ సంతోష మొనర్చిన వాఁడవగుదువు. కాని యీవిషయమునం దాటంకమును గలిగించినచో నే నమిత కష్టమును జెందుదును. వత్సా! నీ వెప్పుడును నాయాజ్ఞ నుల్లంఘించి యెఱుంగవు. కావున రేపు ఉదయముననే నాయాదేశానుసారముగాఁ

ప్రవర్తింపుము. ఏ విధముచేతను అన్యథా వర్తింపవలదు. గంగానదిని దాటుదనుక నేను బరిత్యజించిన వార్తను సీతకుఁ దెలియనీయఁ జనదు. వత్సా! నీ హృదయము కరుణారస పరిపూర్ణము. అందువలన నీకింతగాఁ జెప్పవలసి వచ్చినది."

ఇట్లు చెప్పి రాముఁడు తలవంచుకొని కన్నీళ్ళు కార్చుచుండెను. భరత లక్ష్మణ శత్రుఘ్నులు శ్రీరాముని దృఢప్రతిజ్ఞకు మాఱు పలుకక మౌనావలంబులై సంతతధారగా నయనాశ్రువుల విసర్జింపుచుండిరి. కొంతవడికి తిరిగి శ్రీరాముఁడు, లక్ష్మణునితోడ తనయాజ్ఞను బాలింపుమని చెప్పి, సోదరులకు సెలవొసంగి తాను విశ్రామభవనమున కేఁగెను. అత్యంత దుఃఖముతోడ వీరు నల్వురు సోదరు లారాత్రి నెట్లెట్లో గడపిరి.

---

# సీతాదేవి వనవాసము.

## నాలుగవ ప్రకరణము.

మఱుదిన ముదయముననే లక్ష్మణుఁడు సుమంతుని బిలువనంపి "పూజ్యురాలగు జానకీదేవి తపోవన సందర్శనార్థ మేగును. కావున త్వరగా రథమును సిద్ధము చేసి తీసికొనిరమ్ము" అని యాజ్ఞాపించెను. లక్ష్మణుని యాదేశానుసారము, సుమంతుఁడు రథము నాయత్తపఱచుట కేగెను. తర్వాత లక్ష్మణుఁడు జానకీదేవి నివాస భవనమున కేగి, తపోవనమున కేఁగుటకు సంసిద్ధురాలై రథముకొరకు నిరీక్షించుచున్న సీతాదేవిని సమీపించి సాష్టాంగ దండప్రణామం బొనర్ప, జానకీదేవి యక్క ప్రియమ వాత్సల్యముతోడ, "చిరంజీవి వగుదువు నాత. చిరసుఖి వగుదువు గాత." అని యాశీర్వదించెను. లక్ష్మణుఁడు "దేవీ! రథము సిద్ధముగనున్నది. కావున మనము బయలుదేఱుటకుఁ గాలవిలంబన మధికముగ లేదు." అనుడువ సీతాదేవి పరమానందభరితయై వికసితవదనము తోడ నిట్లు పలుకం దొడంగెను. "వత్సా! లక్ష్మణా! నేడు తపోవనమున కేఁగుదు నను సంతోషమువలన

గతరాత్రియంతయు నిద్రయే యెఱుంగను. ప్రయాణ సన్నాహ మొనర్చుకొని రథముకొఱకై యెదురు చూచుచున్నాను. ఇట్టి సమయమం దార్యపుత్రుఁడు నేను తపోవనమున కేఁగుటను నిషేధించునని తలంచితిని. కాని, ప్రసన్నహృదయమున సమ్మతించుటవలన, నే నపరిమితానందమును బొందుచున్నాను. పూర్వజన్మమునం దొనర్చిన తపఃఫలమువలన నాకిట్టి సదయహృదయుండు భర్తగా లభించెను. ఆర్యపుత్రునివంటి దయామయుఁడగు భర్త యేకాలమం దేస్త్రీకి లభించెను? ఆయన వాత్సల్య మమతలు దలంపునకు వచ్చినప్పుడు నా సౌభాగ్యమునకు నేను గర్వించుచుందును. తిరిగి నాకు నారీజన్మమే లభించినయెడల, ఆర్యపుత్రుఁడే భర్తయగుఁగాక యని మనోవాక్కాయకర్మముల ననుదినమును దేవతలను బ్రార్థించుచుందును." అని నుడువుచు ప్రేమావికసిత నయనములతోడ, "వత్సా! నా వనవాసకాలమునందు మునిపత్నులవలన నాకు మిక్కిలి స్నేహము లభించెను. అందువలన వారికిఁ గానుకగ నర్పించుటకు, ఈచిత్రవిచిత్ర వసనములను, అమూల్యాభరణములను. దీసికొని వచ్చుచున్నాను." అని నుడువుచు, వానిని వరుసఁగా లక్ష్మణునకుఁ జూపించుచుండెను.

అట్టి సమయమందు ద్వారపాలకుఁడు వచ్చి, రథముతోడ సుమంతుఁడు ద్వారముకడ వేచి యున్నాఁడని విన్నవించుకొన, తపోవనదర్శనవాంఛ మిక్కుటమగుటవలన, రథము వచ్చినదనువార్త వినినంతనే సీతాదేవి, నిమేషకాలమైన నాలసింపక, యతిత్వరితముగ నన్ని వస్తువులఁ గైకొని లక్ష్మణునితోడ రథారోహణం బొనర్చెను. అతి స్వల్పకాలములోనే రథము, అయోధ్యానగరమునువిడిచి, జనపదములఁ బ్రవేశించెను. చిత్తాహ్లాదకరములును, నయనోల్లాసప్రదములగు ప్రదేశములఁ దిలకించుచు, జానకీదేవి యత్యంత సంతోషాంతరంగచిత్తయై "వత్సా! ఆర్యపుత్రుని యనుగ్రహము వలననేగదా, నీ మనోహర ప్రదేశములను జూచుచున్నాను. ఆయన సంతోషముతోడ నా ప్రయాణమునకంగీకరింపనియెడల, నేనీయానందమును బొందజాలను గదా? నేనెట్టి సంతోషముతోడ నాయనను బ్రార్థించితినో, యాయన యదేవిధముగఁ దన యామోదమును దెలిపియున్నాఁడు" అని నుడువుచుండ లక్ష్మణుఁడు సరళహృదయయగు జానకీదేవి యానందమునుగాంచి, చివరకు రామచంద్రుఁ డెట్టి ప్రేమను జూపించినాఁడని తలంచుచు, అతికష్టముమీఁదఁ బొంగిపొరలు దుఃఖము నాఁపుకొని, సంతోషమును బ్రకటించుచుండెను.

రథము కొంతదూర మేఁగునప్పటికి, ఆకస్మికముగ జానకీదేవి మ్లానవదనయై, లక్ష్మణునితో డ నిట్లు నుడువందొడంగె. "వత్సా! ఇంతదనుకను నేను మానసోల్లాసముఁ గూడుకొని యుంటిని. కాని, యిప్పుడాకస్మికముగ నాచిత్తము తత్తఱం బొందుచున్నది. నాదక్షిణనయన మదరుచున్నది. శరీరము వడంకుచున్నది. అత్యంత వ్యాకులతచేత నాహృదయము తల్లడిల్లుచున్నది. పృథ్వి శూన్యముగఁ గన్పట్టుచున్నది. ఆకస్మికముగ నాకిట్టి చిత్తచాంచల్యము, మనఃపరితాపము గలుగుటకుఁ గారణ మేమైయుండును? లేశమైనను గ్రహింపఁజాలకున్నాను. ఆర్యపుత్రుఁ డెట్లున్నాఁడో గదా! ఆయన కేదియో యశుభము సంభవించి యుండవలయును. లేనియెడల, నాప్రాణాధికులగు భరతశత్రుఘ్నుల కేదియో కీడు గలిగి యుండవలయును. కానియెడల ఋష్యశృంగమహర్షి యాశ్రమమునుండి యేదియో యొక యశుభవార్త వచ్చియుండవలయును. అచ్చట గురుజను లెట్లున్నారోగదా! ఏదైనకాని, యేదియో యొక విపత్తు సంభవించినదనుట నిక్కువము. కానిచో నిట్టి యానందదాయక సమయమం దీవిధముగఁ చిత్తచాంచల్యమును, మనోవేదనముఁ గలుగుటకుఁ గా

రణమేమయి యుండును? వత్సా! ఎందునవలన నాకీవిధ మగు పరితాపము గలుగుచున్నదో చెప్పుము. నా ప్రాణ మెట్లోయున్నది. నాకిప్పుడు తపోవనమును సందర్శింప వలయునను కోరికయే లేదు. ఇచ్చటనుండియే తిరిగి యయోధ్యాపురమున కేఁగవలయునని తోఁచుచున్నది. వత్సా! అడుగుట మఱచితిని. ఆర్యపుత్రుఁడు వచ్చెదనని నుడివి మనతో నేల రాలేదు? రథమెక్కునప్పుడు సంతోషమువలన నిమ్మాట యడుగ మఱచితిని. ఆయన రాకుండుటవలన నాకు పలుశంకలు గలుగుచున్నవి. వత్సా! ఏమిచేయుదును? చిత్తచాంచల్యము క్రమక్రమముగ వృద్ధియగుచున్నది. రావణుఁడు సన్యాసికొనిపోవుటకు ముందిదేవిధమగు చిత్తచాంచల్యము సంభవించి యుండెను. వత్సా! తిరిగి యట్టి యుత్పాతమేదియు సంభవింప లేదుగదా! ఎట్టి యిక్కట్టులు సంభవించునో తెలియదు గదా? వత్సా! తపోవన సందర్శనమునకు రానియెడల బాగుగనుండెడిది. ఆర్యపుత్రుని సాన్నిధ్యమందుండినచో నాకిట్టి మనోవేదన సంభవించి యుండదు. ఒక్కొకమా ఱార్యపుత్రుని నిఁకఁ జూడనని గూడఁ దోఁచుచున్నది."

జానకీదేవి చిత్తచాంచల్యమును జూచి, లక్ష్మణుఁడు విషణ్ణచిత్తుఁడై శోకాకులుఁడయ్యెను. ఎంతో

కష్టముమీఁదఁ బరభావమును దెలియనీయక తీవ్రవేగమునఁ బొంగిపొరలు దుఃఖము నాఁపుకొని శుష్కించిన మోమునఁ దనను వికృతస్వరమునఁ దను నిట్లు చెప్పఁ దొడంగను. "దేవీ! తాము భయమునుం జెందకుఁడు. రఘుకుల దేవతలు సర్వదా మీకు మంగళ మొనఁగూర్చుచుందురు. అందఱను విడనాడి వచ్చుటవలనను. సమీపమున నెవరు లేకుండుటవలనను, మీకు చిత్తచాంచల్యము సంభవించినదని తోచుచున్నది. కావున మీరు భయపడకుఁడు. నిమేషకాలములో మీకు భయనివృత్తి యగును. అప్పుడప్పుడు దుఃఖించుచు చిత్తవైకల్యము సంభవించుచుండుట సహజము. మనస్సు స్వాభావసిద్ధముగఁ జంచలము. అందువలన నన్నివేళలయందు నేకవిధముగ నుండదు. కావునఁ దాము దిగులొందకుఁడు."

సీతాదేవి లక్ష్మణుని వాడిపోయిన మోమును, స్వరవైవర్త్యమును గమనించి, "వత్సా! నిన్నుఁజూచి నాకు నొక్కటి సందేహము గలుగుచున్నది. నేనింతవఱకెప్పుడును నీ ముఖ మీవిధముగ వాడి యుండుటను జూచి యెఱుంగను. కాఁబట్టి యెద్దియైన నాపద సంభవించినయెడల నంటనే దానిని చెప్పుము. వత్సా! ఆర్య

పుత్రుండు క్షేమముగ నున్నాఁడుగదా? నిన్న సాయంకాలమునుండియు నేనాయనను సందర్శింపలేదు. ఇప్పుడాయన దర్శనంబైనయెడల నావిచారమంతయు నొక్కనిమేషములో మాయమగు ననుకొనుచున్నాను" అని నుడువుచుండ లక్ష్మణుండిట్లనియె. "దేవీ! తాము వ్యాకులతనొందకుఁడు. మీచిత్తచాంచల్యమును జూచి నేను గూడ చిత్తవికారమును బొందుచున్నాను. అందుచేత నేను మీకిట్లు గఱపుచున్నాను. కావునఁ దీనిని విరుద్ధముగ భావింపఁ జనదు. భావించినఁ గొందఱి హృదయాందోళనము మిక్కుటమగును. దానివలనఁ బరితాపము వృద్ధియగును."

కొలఁదికాలములో రథము గోమతీతీరమును జేరెను. ఆసమయమునకు సకల భువనప్రకాశకుఁడగు సూర్యుఁ డస్తాచలారోహణముఁ బొనర్చుచుండెను. సాయంసమయమునను గోమతీతీరము పరమ రమణీయమై విరాజిల్లుచుండును. అట్టిసమయమునందచ్చట నెట్టి యస్వస్థచిత్తులైనను శాంతహృదయు లగుదు రనుట నిస్సంశయము. వీరచ్చటి కేఁగినంతనే యదృష్టవశమున జానకీదేవికిఁ జిత్తచాంచల్యముదూరమాయెను. లక్ష్మణుండు పరమప్రీతినొందెను. ఆరాత్రి వారచ్చటనే విశ్రమించిరి.

జానకీదేవి పథశ్రమచేతను, చిత్తవికారమువలనను, బడలియున్నందున వెంటనే నిద్రించెను. ఆమె మేల్కొనియున్నంతదనుక లక్ష్మణుఁడు మనోహరమగు కథలను వినిపించుచు, ఆమెచిత్త మన్యదిక్కున కేఁగకుండునటులొనర్చెను. పగలు కనఁబడిన లక్షణము లేవియు లేక జానకీదేవి యారాత్రి హాయిగా నిద్రించెను.

ప్రభాతమైనంతనే గోమతీతీరమునుండి బయలుదేఱిరి. రథమున కిరుప్రక్కలఁ గనఁబడు పరమరమణీయప్రదేశములఁ జూచుచు జానకీదేవి యపరిమితానందమును బొందుచుండెను. గత దినమందలి మనోవ్యాకులత్వము లేశమైనను లేకుండెను.

ఇట్లు పోను పోను సీరి రథము భాగీరథీతీరమును జేరెను. గంగానదిని దర్శించినంతనే లక్ష్మణుఁడీనదిని దాఁటి జానకీదేవిని బరిత్యజించి రావలయునుగదా యని తలఁచి, పొంగి పొరలు శోక సాగరమందు మునింగి పోవుచుండెను. ఇట్లు దుఃఖించుచున్న లక్ష్మణునిఁ జూచి సీతాదేవి మిక్కిలి శోకాకులయై "వత్సా! ఎందువలన నీ వీ విధముగ దుఃఖించుచున్నావు." అని ప్రశ్నింపఁగా లక్ష్మణుఁ డెంతో ప్రయత్నముమీఁదఁ బొరలి పొరలి వచ్చు తీవ్రదుఃఖము నాఁపుకొని కన్నీటిని దుడుచు

కొనుచు నిట్లు చెప్పందొడంగెను. "దేవీ ! వ్యాకులత నొందకుము. నే ననేకదినములకు భాగీరథీనదిని సందర్శించితిని. నాహృదయమున దనిర్వాచ్యమగు భావోదయం బగుటవలన, నాకాకస్మికముగఁ గన్నీటిధారలు ప్రవహింప సాగినవి. మన పూర్వపురుషులు కపిల మహాముని శాపమువలన భస్మమైపోయిరి. అందుచేత భగీరథుఁడు మిక్కిలి శ్రమపడి, గంగను భూతలమునకుఁ దీసికొనివచ్చి, వారికి సద్గతులను గల్పించి యున్నాఁడు. ఆవిషయము జాహ్నవీదేవిని జూడఁగనే జ్ఞప్తికివచ్చుట వలన, నా కీ విధమగు చిత్తవైకల్యము సంభవించినది." అని సుమనస్సు పలుకులను సరళహృదయయగు సీతాదేవి విశ్వసించి సంతృప్తినొంది గంగనుదాఁటుటకు తొందర పెట్టసాగెను. కాని గంగానదిని దాఁటినంతనే యామె జీవితము దుస్సహ శోకసాగరమునఁ గడుప వలయు నను విషయ మామె కెట్లు దెలియును ?

గంగానదిని దాఁటుటకు పడవ దొరకెను. సుమంతుని రథముకడ నచ్చటనే యుంచి, లక్ష్మణుఁడును సీతాదేవియుఁ బడవనెక్కి నదినిదాఁటిరి. దాఁటఁగానే జానకీదేవి పరమోత్సాహముతోఁ దపోవనసందర్శనార్థము ముందడుగిడ సాగెను. లక్ష్మణుఁడు జానకీదేవిని

జూచి "దేవీ! నేనిప్పుడు మీకొక సంగతిని నివేదింప వలసియున్నది." అని నుడువుచు తలవంచుకొని కన్నీరు మున్నీరుగా నేడ్వసాగెను. లక్ష్మణుని స్థితిఁజూచి, సీతాదేవి యులికిపడి భయాకంపితయై యిట్లు ప్రశ్నింపఁ దొడంగెను. "వత్సా! నాకొక సంగతిని చెప్పెదనని యింత సంశయించుచున్నా వేల? చెప్పదలంచిన దానిని త్వరగాఁ జెప్పుము. నాహృదయము తల్లడిల్లుచున్నది. వెంటనే చెప్పుము. బయలుదేరునప్పు డార్యపుత్రున కేవిధమగు విపత్తు సంభవించెనని నువ్వు వినలేదు గదా? లేక యేయాత్మికకష్టము సంభవించెనో శీఘ్రముగఁ జెప్పుము." అని ప్రశ్నింప లక్ష్మణుఁ డిట్లనియె "దేవీ! యేమని చెప్పుదును? నానోట మాటలు రాకున్నవి. ఆర్యపుత్రుని యాజ్ఞానుసారముగ నేనిట్టి ఘటన ఘటింతునని కలయందైనను దలంచి యెఱుఁగను. సంభవించినవిపత్తు తలంపునకు వచ్చినంతనే నాహృదయము విదీర్ణమగుచున్నది. ఇంతకుఁ బూర్వమే నాకు మృత్యువు సంభవించినయెడల, నేను ధన్యుఁడనయ్యెడివాఁడను. ఆర్యపుత్రుని యాధర్మాదేశమును బాలింప వలసిన కారణముండెడిదికాదు. హా! విధాతా! నానొసటియం దిట్లు లిఖించితివా?" అనినుడువుచు మొదలు నఱికిన వృక్షమువలె క్రిందఁబడి రోదనము చేయసాగెను.

లక్ష్మణుని జూచి జానకీదేవి హతబుద్ధియై యమేషకాలము రెప్ప వాల్పక చూచుచు నిలుచుండె, తదనంతర మాయన కరములు పట్టుకొని లేవఁదీసి కూర్చుండఁ బెట్టి, చేలాంచలముచేఁ గన్నీళ్ళు తుడిచి, కాతర వచనముల నిట్లు పలుకసాగెను. "వత్సా! లక్ష్మణా! నీవేల యీవిధముగ విలపించుచున్నావు? మృత్యువును గోరుచున్నా వేల? నీవు మిక్కిలి వికలచిత్తుఁడవుగఁ గన్పట్టుచున్నావు. స్వల్ప కారణమువలన నీ వెప్పుడు నిట్టి పరితాపమును బొందువాఁడవు గావు. వత్సా! ఆర్యపుత్రున కేవిధమగు నశుభము చేకూరలేదుగదా? నా యార్యపుత్రుని యందే ప్రాణములు గలవాఁడవు. నీ మనోవైకల్యమును జూడ నాయన కేదియో విపత్తు సంభవించినదని తోఁచుచున్నది. దానిచేతనే కాఁబోలు గతదినము. నా కావిధముగ మనోవైకల్యము సంభవించినది. వత్సా! సంభవించినదానిని వెంటనే చెప్పి నా ప్రాణముల రక్షింపుము. ఇఁక నీ మనోవ్యధను సహింపఁజాలను-త్వరగాఁ జెప్పుము. ఆలసింపకుము. కాని వత్సా! నా కేవిపత్తు సంభవించినదని తోఁచుచున్నది. లేనియెడల యీయసమయమున నేల నీవు దుఃఖించెదవు."

జానకీదేవి వ్యాకులత్వమును, దుఃఖమును జూచిన కొలందిని, లక్ష్మణుని శోకానలము వేయిమడుంగులు వృద్ధియయ్యెను. సంతతధారగా కన్నీళ్ళు కారుచుండెను. నోట మాట రాకుండెను. 'ఎంతటి క్రూరకృత్యమైనను చెప్పియే తీరవలయును గదా' అని తలంచి, చెప్పుటకు బ్రయత్నించుచుండెను. కాని యెంత ప్రయత్నించినను, అతని నోటినుండి యాఘోరవార్త బయల్పడకుండెను. అట్లు మనోవేదన నొందుచున్న లక్ష్మణుని చేతులుపట్టుకొని సీతాదేవి కన్నీరు మున్నీరుగా నేడ్చుచు నిట్లు బ్రతిమాలఁజొచ్చెను. "వత్సా! లక్ష్మణా! ఇంక నాలస్యము చేయకుము. ఆర్యపుత్రుని యాదేశ మెట్టిఘోరతరమైనను వెంటనే దానిని జెప్పుము. సంకోచింపవలదు. నేను నీ కాజ్ఞ నొసంగుచున్నాను. కావున నిస్సంకోచముగఁ జెప్పుము. నీమాటలవలనను, ఆకారమువలనను నాకర్మమే గాలినట్టుల దోఁచుచున్నది. వత్సా! త్వరగాఁ జెప్పుము. ఇంక నాలసింపవలదు. ఇట్టి సందిగ్ధావస్థయందొక ముహూర్తకాలమైన నుండఁజాలను. వెంటనే చెప్పి నాకు ప్రాణదానం బొసంగుము. ఆర్యపుత్రున కేవిధమగు నమంగళమైనఁగూడ లేదుగదా? ఆయన క్షేమముగ నుండినయెడల నాకెట్టి కష్టములు

సంభవించినను గణనసేయను. వత్సా ! ఆర్యపుత్రుని మీఁద నొట్టు బెట్టుచున్నాను. శీఘ్రముగఁ జెప్పుము. ఇఁక నీ వాలసించిన యెడల, నన్ను జీవితావస్థయందుఁ జూడఁజాలవు. కష్టపెట్టి నాప్రాణములు దీయవలయు ననుకోరిక నీకు లేకుండినయెడల వెంటనే చెప్పుము."

జానకీదేవి దురవస్థను ప్రత్యక్షముగఁ జూచుచున్న లక్ష్మణుఁడిఁక నాలసించినచో ప్రమాదము గలుగ వచ్చునని తలఁచి విశ్వప్రయత్నమువిూఁదఁ గొంచెము ధైర్యము నవలంబించి, అతికష్టముమీఁద నిట్లు చెప్పఁ దొడంగెను. "దేవీ ! ఏమి చెప్పుదును ? చెప్పుటకు నా హృదయము బ్రద్దలై పోవుచున్నది. మీరు రావణాసురుని గృహమునం దేకాకిగా నున్న కారణమును బురస్కరించుకొని, ప్రజలు మీచరిత్ర విషయమునందు సందేహచిత్తులై, యపవాదములఁ జాటుచున్నారు. శ్రీరామచంద్రుఁడు వానిని విని, దయా స్నేహ మమతలను విడనాడి, యపవాద విమోచనార్థము మిమ్ము పరిత్యజించినాఁడు. తపోవన సందర్శన నెపమున మిమ్ము వాల్మీకి మహర్షి యాశ్రమమందు దిగవిడచి రావలసినదని నాకాజ్ఞ నొసంగి యున్నాఁడు. దేవీ ! ఇదియే వాల్మీకి మహర్షి యాశ్రమము" అని నుడువుచు లక్ష్మణుఁడు మూర్ఛిల్లెను.

ఈ వాక్యములు వినినంతనే, జానకీదేవి క్రిందఁబడి మూర్ఛిల్లెను. కొంతవడికి తెలివివచ్చి లక్ష్మణుఁడు పలుప్రయత్నము లొనర్చి సీతాదేవికి మూర్ఛ దెలిసి పిచ్చిదానివలె తదేకనిష్ఠగా లక్ష్మణునివంకఁ జూపించుచుండెను. లక్ష్మణుఁడు జానకీదేవిని గాంచి, హతబుద్ధియై, చిత్రప్రతిమవలె నిలుచుండి, కన్నీళ్ళు కార్చుచుండెను. పిమ్మట సీతాదేవి నయనయుగళమునుండి ప్రబలవేగముగ బాష్పధారలు ప్రవహింపఁ జొచ్చెను. తీవ్రముగ శ్వాసను విడచుచుండెను. శరీరము కంపింపుచుండెను. తద్దర్శనమువలన లక్ష్మణుఁడు మిక్కిలి పరితాపమునొందుచు, జానకీదేవిని శాంతచిత్తనుగఁ జేయుటకు మార్గము దోఁపక తల్లడిల్లుచు సంతతధారగా ప్రవహించు కన్నీటిని నాపుకొనఁ జాలకుండెను.

తదనంతరము జానకీదేవి కొంచెము ధైర్యము నవలంబించి "వత్సా! లక్ష్మణా! ఇంకేమని వచింతును? నా దురదృష్టముచేతనే నాకీ దుర్గతి పట్టినది. కాని మొదల రాజకుమారినై, మహారాజునకు కోడలనై, రాజాధిరాజునకు భార్యనై, యేకాలమందే స్త్రీ యెట్టి చిరదుఃఖము ననుభవించినదో చెప్పుము. యావజ్జీవము ఘోరతర దుఃఖము ననుభవించుటకే నాకు నారీ జన్మ

లభించినదని సంతోషించుచున్నది. బహుకాలమునకు పిమ్మట నార్యపుత్రునిఁ గలిసికొని యిఁక నాకష్టములు తొలఁగిన వని దలంచితిని. కాని, విధాత నానోసటియందింకను సహస్రగుణము లధికముగ దుఃఖమును లిఖించి యున్నాఁడని, కలయందైనను దలంచి యెఱుఁగను గదా? అయ్యో! విధాతా! నీసంకల్ప మిట్లుండెనా?" అని నుడివి జానకీదేవి మాటలాడఁజాలక స్థిరభావమునఁ జూచుచుండెను.

కొంతవడికి నిట్టూర్పువిడిచి, తిరిగి యిట్లు చెప్పం బోడంగెను. వత్సా! నేను గత జన్మయందేదియో మహాపాతకం జేసియున్నాను. లేనియెడల విధాత నానోసటియం దింతదుఃఖము నేల లిఖించి యుండును. కాని, యింత విధాతదోషముమాత్ర మేమున్నది? సమస్త మానవులును తమతమ పూర్వ జన్మకర్మకుఁ దగిన ఫలభోగములననుభవించుచుందురు. కావున నేను జన్మాంతరమం దొనర్చిన కర్మకు ననుగుణమగు ఫలమును నేఁడనుభవించుచున్నాను. పూర్వజన్మయందే దంపతులనో యెడబాపియుంటిని. ఆమహాపాతకమువలన నేఁడు నాకీగతి సంభవించినది. ఆర్యపుత్రుని హృదయము దయాస్నేహప్రేమలచేఁ నిండియుండును. నేను

పతియందే ప్రాణములు గల విశుద్ధ చరిత్ర నని, ఆయన పూర్తిగా నెఱుంగును. ఆర్యపుత్త్రుఁడు నన్ని యసమయమందుఁ బరిత్యజించుట, నా పూర్వజన్మ దుష్కృత ఫలము గాక మఱేమున్నది? వత్సా! నేను వనవాసమునకు దుఃఖించుటలేదు. ఆర్యపుత్త్రుని సహవాస సుఖమున బహుకాల మరణ్యావాస మొనర్చి యున్నాను. కాని యొకదినమునఁగాని, లేక యొకముహూర్తమునందుఁగాని, దుఃఖ మెఱుంగను. ఆర్యపుత్త్రునితోఁ గలిసి జీవితకాలమంతయు వనవాసమునఁ గడుపవలసి వచ్చిననుగూడ, నేనణుమాత్రమైనను దుఃఖితనుగాను. ఆర్యపుత్త్రుఁడే కారణమువలనఁ బరిత్యజించెనని మునిపత్నులు ప్రశ్నించినయెడల, నే నెట్టి ప్రత్యుత్తరం బొసంగుదును? ఆర్యపుత్త్రుఁడు కరుణామయుఁడని వారెఱుంగుదురు. కావున నేనే కారణమును జెప్పినయెడల విశ్వసింపక యేదియో గురుతరాపరాధ మొనర్చుటచేత విడనాడెనని తలంతురు. వత్సా! నే నాపన్నసత్త్వను గానిచో నీముహూర్తముననే, గంగయందు దుముకుట కుద్దేశించితిని. కాని యిప్పుడేమి చేయుదును? ఇంకను నాజీవితమువలనఁ బ్రయోజనంబేమి? ఆర్యపుత్త్రుఁడు పరిత్యజించెనను వార్తవినియైనను

నా ప్రాణములు పోకుండుట ఆశ్చర్యముగదా? ఇందు వలన నావంటి మొండిజీవి ప్రపంచమునందు మఱియొక టి లేదనుట స్పష్టము. కానియెడల ప్రాణము లేల పోకున్నవి? నా ప్రాణము పోయినయెడల చిరదుఃఖినిగఁ జేయఁదలఁచిన విధాత సంకల్పము విఫలమగునుగదా? అందువలననే నేను జీవించియున్నాను" అని విలపింపుచు, జానకీదేవి దీర్ఘనిశ్వాసమును విడిచి "అయ్యో! నా బ్రతుకేమైనది?" అని నుడివి మూర్ఛిల్లెను. జానకీదేవి యవస్థకు లక్ష్మణుఁడు పరితపించుచు రోదనము సేయుచు, "ఇదివఱకెప్పుడును, కనివినియెఱుంగని ప్రజానురాగమే, యీ భయానక ఘోరకార్యమునకు మూలకారణము." అని తలంచి విషణ్ణచిత్తుఁడై, యిట్లు పలుకం దొడంగెను. "ఇంతకుఁ బూర్వమే నాకు మరణము సంభవించినయెడల, లోకగర్హితమును ధర్మవిహీనమునైన, యీ ఘోరకార్యమును జూచియుండను గదా? నేనార్యుని యాజ్ఞావహుఁడనై మహాపాపకార్యమొనర్చితిని. నావంటి పాషాణచిత్తుఁడు పృథివియందు వేఱొకఁడుండునా? కానియెడల, నేనిట్టి ఘోరకార్యముమొనర్చుటకేల సమ్మతింతును? సరళహృదయయు, పరిశుద్ధ చరిత్రయు, పతిగత ప్రాణయు, నగు సాధ్వి

మతల్లికిట్టి ఘోరవార్తను వినిపించుట కెట్లు సాహసింపఁగలిగితిని? ఆర్యపుత్త్రుని యాదేశమును బరిపాలించుట కంగీకరింపక యీజన్మ కాయన విరక్తికిఁ బాత్రుఁడనై, పరజన్మయందు నరకగామినైనను, వేయిమడుంగులు శ్రేయోదాయకముగ నుండెడిది. ఎట్లు యోచించి చూచినను నేనొనర్చినది మహాఘోరకార్యము. అయ్యో! విధాతా! ఏకారణమున నాకిట్టి ఘోరకార్యమును నిర్వహించుశక్తిని గలిగించియున్నావు? అయ్యో! కఠోరహృదయమా! నీవింకను బ్రద్దలుకావేమి? అయ్యో! దగ్ధప్రాణమా! నీవింకను నన్ను విడువవేమి? అయ్యో! పాడు శరీరమా! ముక్కలు ముక్కలుగ పీడిపోకున్నావేల? అయ్యో! నేనిఁక నీదురవస్థను జూడఁజాలను. అయ్యో! శ్రీ రామచంద్రా! నీవిట్టికఠిన హృదయుఁడవని కలయందైన నెఱుంగనుగదా? నీమనమం దిట్లుండినయెడల దేవి నుద్ధరించుటకేల విశ్వప్రయత్నము నొనర్పవలయును? మహామర్మజ్ఞుఁడగు దశాననుఁడు సీతాదేవిని బలవంతముగ నెత్తుకొనిపోయినంతనే నీ వున్మత్తుఁడవై హాహాకారములుచేయుచుఁ దిరుగుటకుఁ గల కారణమేమి? నీవిట్లు ఒనర్తువనియా? లంకాయుద్ధమందు దుస్సహ క్లేశ పరం

పరలను సహించితిని? ఏమయినఁగాని నీవంటి నిర్దయుఁ
డును, క్రూరుఁడును, భూమండలమం దింకొకఁ డుండఁ
డనుట నిక్కువము."

అని లక్ష్మణుఁడు శ్రీరాముని నిందించుచు, పొంగి
పొరలు దుఃఖమును గొంచెము మాఁపుకొని, సీతాదేవికి
చైతన్యము కలుగుటకుఁ బ్రయత్నించుచుండెను. కొంత
సేపటికి జానకీదేవికి తెలివివచ్చి, నిమేషకాలము నిస్తబ్ధయై
యుండి, పిమ్మట వాత్సల్యముతోడ లక్ష్మణునిఁ జూచి
యిట్లనియె. "వత్సా! ధైర్య మవలంబింపుము. విల
పింపకుము. పరితాపమును జెందకుము. అదృష్టము
వలననే సమస్త సుఖాసుఖములు లభించుచుండును.
నా యదృష్టమువలన నాకీ దుర్గతి సంభవించినది.
నీవిందులకు దుఃఖించిన ప్రయోజనము లేదు. శోకమును
మానుము. నన్ను వదలి నీవార్యపుత్రుని సన్నిధాన
మునకేగుము. ఆయన నన్నుఁ బరిత్యజించి మితిలేని
దుఃఖమును బొందుచుండును. కావున నీవాయనశోక
నివారణకుఁగాను సర్వదా ప్రయత్నించుచుండుము. ఆ
యన నన్ను పరిత్యజించి మనోవేదనను బొందుచుండుట
యనావశ్యకము. ఆయనయొనర్చినకార్యము సదసద్వివే
చనానుసారముగనే యున్నది. ప్రాణమునర్పించియైనను

ప్రజారంజనం బొనర్చుట రాజులకు పరమధర్మము. కావుననే యాయన నన్నుఁబరిత్యజించి, రాజధర్మమును బాలించుచున్నాఁడు. నే నాయన చిత్తమును బాగుగ నెఱుంగుదును. లోకాపవాద భయమువలననే నన్నుఁ బరిత్యజించినాఁడనుటయందు నాకు లేశమైనను సందియము లేదు. కాఁబట్టి యాయన శోకమును మాని, శాంతచిత్తముస, ప్రజాపాలనం బొనర్చుచుండవలయునని యే నాకోరిక. ఆర్యపుత్రుని పాదపద్మములకు నా సాష్టాంగదండప్రణామంబులర్పింపుము. నేను లోకాపవాద భయమువలన నయోధ్యనుండి వెడలఁగొట్టఁ బడితిని. కాని యాయన హృదయసీమనుండి వెడలఁగొట్టఁ బడకుందును గాత. పునర్జన్మయందుఁగూడ నార్యపుత్రుఁడే నాకు భర్త కావలయునను దృఢసంకల్పమున నేనీ తపోవనమందు తపస్సు చేయుచున్నను, ఆర్యపుత్రుఁడు నన్ను భార్యాభావమునఁ బరిత్యజించి యున్నాఁడు. కాని, సామాన్యప్రజాభావమునఁ గాదుగదా? ఆయన ససాగర భూమండలేశ్వరుఁడు. అందువలన నే నెక్కడ నున్నను, ఆయన యధికారమునకు లోఁబడియే యున్నానని ఆయనతో విన్నవింపుము."

ఇట్లనుచుండుచు జానకీదేవి మిక్కిలి శోకాకులచిత్తయై కన్నీరు మున్నీరుగా నేడ్చి, నిమేషకాలము మౌనావలంబినియై యుండి తిరిగి లక్ష్మణునితోడ నిట్లు చెప్పందొడంగెను. "వత్సా! లక్ష్మణా! నాకు సంభవించిన గతికి నే నంతగా దుఃఖించుట లేదు. కాని యార్యపుత్రునకుఁ గలిగిన మనోవ్యధకు నస్థిరచిత్తనై యున్నాను. "శోక సంవరణం బొనర్చుకొని స్వస్థచిత్తులుగ నుండవలయును" అను నా వినయపూర్వక ప్రార్థనను, ఆయనకు విన్నవింపుము. నా జీవితమంతయు దుఃఖమయమైన దనుమాట వాస్తవము. కాని యీ విషయమున నం దార్యపుత్త్రుని, అణుమాత్రమైనను నిందించను. నాదురదృష్టమువలననే నాకీగతి సంభవించినది. కాఁబట్టి యాయనదుఃఖింపకుండునుగాత. వత్సా! లక్ష్మణా! నీవెప్పుడాయన సాన్నిధ్యమందే యుండవలయునని కోరుచున్నాను. ఆయనను నిమేషకాలమైననొంటరిగనుండనీయవలదు. ఒంటరిగనుండినయెడల నాయన మనోవేదన మిక్కుటమగును. ఆయన సౌఖ్యముగ నుండుటయే నాసౌఖ్యము. కావున నీవాయనసంతోషముగనుండుటకుఁగాను, సర్వదా ప్రయత్నింపుచుండవలయును." అని నుడువుచు లక్ష్మణుని చేయి పట్టుకొని

కన్నీటిని గార్చుచు దీనస్వరముతోడ "ఆర్యపుత్రుని ముహూర్తకాలమైనను విడనాడియుండక సర్వదా యాయనకు సంతోషమును గలుగఁజేయు ప్రయత్నముల యందుండునని నాయెదుట శపథము చేయుము. నేను తపోవనమందుండి యార్యపుత్రుఁడు క్షేమముగనున్నాఁడనువార్తను వినుచుండిన యెడల నా సమస్తదుఃఖములు దూరమగును."

అని చెప్పుచు సీతాదేవి కన్నీరుకార్చుచుండెను. జానకీదేవి పతిభక్తి పరాయణత్వమునకు సంపూర్ణ ప్రమాణవాక్యముల వినుచున్న కొలఁదిని, లక్ష్మణుఁడు పొరలి పొరలి సముద్రతరంగములవలె వచ్చు దుఃఖము నాఁపుకొనఁజాలకుండెను. సీతాదేవి లక్ష్మణునికొంచెము శాంతచిత్తునిఁగ నొనర్చి, "వత్సా! దుఃఖమును మాని త్వరితముగ నార్యపుత్రుని సాన్నిధ్యమునకేఁగుము. ఇఁక నాలసింపవలదు." అనిచెప్పుచు లక్ష్మణుని యయోధ్య కేఁగవలయునని తొందరపెట్టుచుండ, లక్ష్మణుఁడు సీతాదేవికి సాష్టాంగ దండప్రణామం బొనర్చి, ప్రదక్షిణము చేసి చేతులు జోడించుకొని సమ్ముఖమందు నిలిచి, కన్నీరుగార్చుచు, గద్గదవచనములతోడ నిట్లువిన్నవించుకొనెను. "దేవి! నేనార్యపుత్రుని యాజ్ఞానువర్తినని

వీరు బాగుగ నెఱుంగుదురు. ఆయన యాజ్ఞనొసంగి నంత నేమాఱుపలుకక, ఆకార్యమునప్పుడే నిర్వహించుట కుపక్రమింతును. ప్రాణాంతమగు కార్యమైనను, అగ్రజునియాజ్ఞను బాలించుటయే సోదరులకుఁ బ్రధానధర్మము. నేను సోదరధర్మానువర్తినై నేఁడిట్టి ఘోరకార్యమును బాలించుటకుఁ బ్రవృత్తుఁడనైతిని. నేను జేయవలసిన కార్యమును జేసితినికాని దేవీ! నామీఁదఁ దయకు వాత్సల్యము తఱుగకుండుఁగాత. ఆర్యపుత్త్రుని యాదేశానుసారముగ నేను మీకొనర్చిన మహాపరాధమును మన్నించి, నామీఁదఁ బరిపూర్ణకృపనుజూపించుచుండవలయునని మిమ్ముఁ బ్రార్థించుచున్నాను."

శోకాభిభూతుఁడగు లక్ష్మణుని జూచి జానకీదేవి యిట్లనియెను. "వత్సా! ఇందు నీయపరాధ మేమున్నది? ఏల దుఃఖించెదవు? ఏల పరితాప మొందెదవు? నీమీఁద నాకణుమాత్రమైనను కోపముగాని, అసంతుష్టిగాని లేకుండుటయే కాక మనోవాక్కాయకర్మల పునర్జన్మయందును నీవంటి మఱఁదియే కావలయునని నియతి దప్పక దేవతలను బ్రార్థించుచుందును. వత్సా! నీవు చిరంజీవి వగుదువుగాత. అయోధ్యానగరమున కేఁగి యార్యపుత్త్రుని చరణకమలములకు నాసాష్టాంగ దండప్రణా

మంబు లర్పింపుము. ప్రేమాపూరిత వాక్యములభరత శత్రుఘ్నులను, నా చెలియండ్రను, అడిగితినని చెప్పుము. ఋష్యశృంగమహర్షి యాశ్రమమునుండి వచ్చినంతనే, అత్తగార్లకు నా సాష్టాంగ దండ ప్రణామంబు లొనర్పుము. 'వత్సా! నీ కింకొకమాట చెప్పవలసి యున్నది. నేను చిరదుఃఖిని. విధాత నానొసటియందు దదృష్టమును లిఖింపలేదు. అందువలన నాకు సంభవించినవిపత్తునకు నేనంతఁగా దుఃఖించను. కాని నీవు నా చెలియండ్రను దుఃఖించకుండునట్టులు చేయవలయును. వారు నాకొఱ కత్యంత శోకమును బొందుచుందురు. వారి దుఃఖము సమసిపోవుటకు, మీరుముగ్గురు గట్టిగఁ బ్రయత్నింపు చుండవలయునని నాకోరిక. వారు సుఖులైయున్న యెడల నాదుఃఖము చాలవఱకు నశించును. నేను నాదురదృష్టమునకుఁదగు ఫల మనుభవించు చున్నాను. కాఁబట్టి నాకొఱకు శోకించుటవలన లేశమైనను బ్రయోజనము లేదని నా చెలియండ్రతోఁ జెప్పుము."

అని జానకీదేవి నుడివి యాశీర్వదించి లక్ష్మణునకు సెల వొసంగెను. లక్ష్మణుఁడు బాష్పాకుల లోచనములతోడఁ దిఱిగి జానకీదేవికి సాష్టాంగ దండ ప్రణామం బొనర్చి, ప్రదక్షిణము చేసి "దేవి! నాయపరా

ధముల క్షమింపుము" అని నుడివి పడవనెక్కెను. జానకీదేవి రెప్పవాల్పక చూచుచుండ ముహూర్త కాలములో, పడవ గంగానది కావలిగట్టునకుఁ జేరెను. లక్ష్మణుఁడు పడవ దిగి క్షణకాలము జానకీదేవి వంక తదేక నిష్ఠగాఁ జూచి పిమ్మట సంతత ధారగా నశ్రు జలముల విసర్జించుచు, రథముపై కెక్కెను. రథము నడువసాగెను. జానకీదేవి కనఁబడునంతవఱకును లక్ష్మణుఁడు స్థిరనయనములఁ దిలకింపుచుండెను. సీతాదేవి రథమువంక రెప్పవాల్పక చూచుచుండెను. కాని, అయిదాఱు నిమేషములలో జానకీదేవి లక్ష్మణునకు దృగ్గోచరము కాకుండుటచేత, లక్ష్మణుఁడు హాహాకారములు సేయుచు రోదనము చేయసాగెను. రథము కనఁబడనంతనే జానకీదేవి పిండు నుండి విడివడిన కురరి వలె యుచ్చైస్స్వరమున నేడ్చుచుండెను.

జానకీదేవి యాక్రందన ధ్వనిని విని, సమీపారణ్యమునందుఁ దిరుగుచున్న ఋషికుమారులు వచ్చిచూచునప్పటికి, దివ్యసుందరమూర్తియగు నా నారీమణి తలమోదుకొనుచు, రోదనము చేయుచుండెను. తద్దర్శనమువలన వారికోమల హృదయములు కలఁగి, అందుఁ గొందఱు త్వరితగతిని వాల్మీకి సమీపమున కేఁగి

ఇట్లు విన్నవించుకొనిరి. "భగవానుఁడా! మేము ఫల కుసుమములు కుశలు సమిధలు తెచ్చుటకుఁగాను, భాగీరథీ సమీపారణ్యమునందు సంచరించుచుంటిమి. అకస్మాత్తుగా నార్తనాదమును విని, వెదకుచు నేఁగిచూడ, అసమాన రూప లావణ్య సౌందర్యరాశి యగు స్త్రీ యొకర్తుఉచ్చైస్స్వరమున నేడ్చుచుండెను. ఆమె భూమండలమునం దవతరించిన లక్ష్మివలెఁ గన్పట్టుచున్నది. ఆమెను జూచినంతనే మా హృదయములు విదీర్ణము లగుట వలన, నామె నేమియు నడుగఁజాలక, యెట్లో ధైర్యమువలంబించి, తమకీ వార్త నెఱిఁగించుట యుత్తమమని తలఁచి, తమ సన్నిధానమునకు వచ్చితిమి. పిమ్మట తమ చిత్తము."

బాలురు చెప్పు వృత్తాంతమును వినినంతనే, వాల్మీకి బయలుదేఱి భాగీరథీ సమీపారణ్యమం దున్న జానకీదేవి సమీపమునకు వచ్చి, ప్రశాంతభావమున నిట్లు చెప్పఁ దొడంగెను. "బిడ్డా! శోకింపవలదు. నీవు తపోవనమునకు బయలుదేఱక పూర్వమే, యీ విషయమంతయు నాకుఁ బూర్తిగాఁ దెలిసినది. నీవు మిథిలాపురాధీశ్వరుఁడగు జనక మహారాజు పుత్రికవు. కోసల రాజ్యాధిపతి యగు దశరథేశ్వరుని కోడలవు.

రాజాధిరాజగు శ్రీరామచంద్రునిపట్టమహిషివి. శ్రీరామ
చంద్రుఁ డాధారశూన్యమగు లోకాపవాద శ్రవణ
మువలన, వికలచిత్తుఁడై వివేచనాశూన్యుఁడై, నిరపరా
ధయగు నిన్ను, విడనాడి యున్నాఁడు." అని నుడువు
మహర్షి మధురవాక్యముల విని, జానకీదేవి సంతత
ధారగా కాఱు కన్నీటిని దుడుచుకొనుచు, సమ్ముఖమం
దున్న సౌమ్యమూర్తియగు వాల్మీకిమహర్షిని దిలకించి
గళలగ్న వసనయై యాయనకు సాష్టాంగప్రణామం
బొనర్చెను. అంత వాల్మీకి "రఘుకులతిలకులగు తన
యులను బ్రసవింతువు గాత" మని యాశీర్వదించి
"వత్సా! ఆశ్రమమునకుఁ బోవుదము రమ్ము. నాయా
శ్రమమందుండినచో నీ కే విషయమందును గొఱంత
యుండదు. జనపదములయం దుండువారు, అడవుల
నామమును విన్నంతనే భయాకులు లగుచుందురు.
కాని, తపోవనములయం దేవిధమగు భయమున కవకా
శము లేదు. మాయొక్క తపోమహిమవలన, దుష్ట
జంతువులు, తమతమ స్వభావసిద్ధమగు క్రూర ప్రవృ
త్తిని విడనాడి, సమస్త జంతువులతోఁ గలిసి మెలసి,
తిరుగుచుండును. తపోవన ప్రభావమువలనఁ గొలఁదిదిన
ములలోనే, నీకు చిత్తస్థైర్యము గలుగును. నీకు నెలలు

నిండినవి. కావున ప్రసవానంతరము జరుగవలసిన యపత్య సంస్కారములన్నియు యథావిధిగ జరుపుదును. కేవిషయమందును గొఱంతయుండదు. నీసమవయస్కలగు మునికుమారికలు నీకు సహచారిణులుగనుందురు. వారి సహవాసమువలన నీకుఁ జిత్తశాంతి గలుగును. ముఖ్యముగ, నీతండ్రి నాకు పరమమిత్రుఁడు. కావున నీవు నాతపోవనమందుండి నీతండ్రిగృహమందుఁ బొందుచుండు సకల సుఖముల ననుభవింపుచుండ వచ్చును. వత్సా! నిన్ను నాకన్న బిడ్డవలె పోషించుచుందును. ఆలసింపక నావెంటరమ్ము."

అని నుడివి జానకీదేవితోడ వాల్మీకిమహర్షి తపోవనమును బ్రవేశించి, మునికుమారికలకు సమస్త విషయములు చెప్పి వారి హస్తములయందు సీతాదేవిని సమర్పించెను. మునికన్యలు జానకీదేవి సమాగమ లాభమువలన, పరమానందమును బొంది యామెకుఁ జిత్తస్థైర్యముగలుగుటకు పలువిధములఁ బ్రయత్నించుచుండిరి.

# సీతాదేవి వనవాసము

## ఆఱవ ప్రకరణము.

---

శ్రీరామచంద్రుడు, సీతాదేవిని వనవాసమున కంపి, యత్యంతశోకాకులచిత్తుడై దుఃఖించుచుండెను. ఆహారవిహారములను, రాజకార్యాలోచనములు మొదలగువానిని బరిత్యజించి, యితరు లెవ్వరిని దన నివాస గృహమునకు రానియ వలదని సేవకుల కాజ్ఞనొసంగి, యొంటరిగఁ గాలముగడపుచుండెను. సీతాదేవి పతిగత ప్రాణయనియు, పరిశుద్ధ చరిత యనియు, శ్రీరాముఁడు బాగుగ నెఱుంగును. మరియు పృథివియందుండు ప్రియ పదార్థము లన్నిటికంటె జానకీదేవిని మిక్కుటముగఁ ప్రేమించుచుండెను. వీరిద్వురకును శరీరములుమాత్రము భిన్నములు. మనఃప్రాణము లభేదములై యుండెను. సీతాదేవి యేవిధముగ సాధుశీలయు, సరళహృదయయు, పతిగత ప్రాణయు, పతిమంగళ కాంక్షిణియునై, పతి సౌఖ్యమే తన సౌఖ్యముగ భావించుచుండెనో, అదే విధముగ శ్రీరాముఁడు సరళచిత్తుఁడును, సన్మార్గవర్తనుఁడును, సీతాగత ప్రాణుఁడునై, సీత హితమునే

కోరుచు, ఆ సౌఖ్యమే తనసౌఖ్యముగ భావించుకొనుచుండెను. సీతారాములు స్వగృహమునుండి సకలసౌఖ్యముల ననుభవించుచుఁ గాలము గడుపుచుండుట కంటెను, వనవాసమునందిరువురొకచోటనుండి పరమానందముగఁ గాలము గడిపియుండిరి. కావున వనవాసమునుండి తిరిగివచ్చునప్పటికి వీరిరువుర ప్రియానురాగములు వేయిమడుంగులు వృద్ధియయ్యెను. అందువలన వీరొక నిమేషకాలమైనను, ఒకరినొకరు విడనాడియుండఁజాలకుండిరి. శ్రీరామచంద్రుఁడు కేవలము లోకాపవాద భయమువలననే, సీతాదేవిని వనవాసమునకనిపెను. కాని, యామెను బరిత్యజించి సంస్మహాదుఃఖ దవానలముచేత దగ్ధుఁడగుచుండెను.

శ్రీరాముని మనోవేదన కంతము లేకుండెను. "నేనేల రాజవంశమునందు జన్మించితిని? వనవాసమునుండి యేల తిరిగి రాజ్యభారము వహించితిని? దుర్ముఖుని నేల గూఢచారునిఁగ నియమించితిని? లక్ష్మణుని యుపదేశవాక్యముల నేల పెడచెవిని బెట్టితిని? క్రూరుఁడనై సీత నేల వనవాసమున కనిపితిని? ఈయసారరాజ్యభారమును బరిత్యజించి నేనేల సీతవెంట వనవాసమున కేగనైతిని? ఎట్లు మనశ్శాంతి నొందుదును?

ఎట్లు జీవింతును? చూచి కిని వనవాసమున కనుపుటకంటె, నే నాత్మహత్య గావించుకొనిన యెడల వేగ నుడుంగులు శ్రేయోదాయకముగ నుండెడిగదా?" అని తల వోయుచు రామచంద్రుడు మహాశోకార్తుడై విలపించుచుండెను. అంతట, శ్రమనోవేదనాగ్ని వలన దగ్ధుండై సగము మాత్రమే మిగిలియుండెను.

'లక్ష్మణుండు మూండవనాడు మధ్యాహ్నమునకు, అయోధ్యానగరమును ప్రవేశించి, మున్ముందుగ రాముని సందర్శించి, రామునకు సాష్టాంగ దండప్రణామము గావించి, కృతాంజలిపుటుండై, కన్నీరు గార్చుచు, శోకంబున వాక్యముల నిట్లు "ఆర్యా! మహాత్ముండగు లక్ష్మణుండు, తమయాజ్ఞను పాలించి వచ్చియున్నాడు." అని నుడువు వాక్యములు వినగనే, శ్రీరాముడు "హా! ప్రేయసీ!" అని నుడువుచు, మూర్ఛితుండై క్రిందబడెను. ఇదిచూచి లక్ష్మణుడు మిక్కిలి దుఃఖితుండై యనేక ప్రయత్నము లొనర్ప, అంతనకు చైతన్యముగలిగి కొంతవడి లక్ష్మణుని వంకం దెల్లబోయిచూచి, తర్వాత, హాహాకారములు చేయుచు "లక్ష్మణా! సీత నెచ్చట దించి వచ్చితివి? సీతను వదలి నేనెట్లుల జీవింతును? ఈ మనోవేదన నెట్లు సహింతును?" అని నుడువుచు లక్ష్మణుని కౌగి

లించుకొని యుచ్చైస్స్వరమున రోదనముచేయసాగెను. ఇట్లిరువురు కొంతసేపు అధైర్యచిత్తులై తీవ్రమనోవేదనను బొందుచుఁగన్నీటిని గార్చుచుండిరి. పిమ్మట లక్ష్మణుఁడు తన దుఃఖమును గొంచె మాఁపుకొని, యణుమాత్రము ధైర్యావలంబియై, శ్రీరాముని శాంతచిత్తునిఁగఁ జేయఁ బ్రయత్నించుచుండెను. రాముఁ డణుమాత్రము శాంతచిత్తుఁడై లక్ష్మణుఁడు చెప్పు సీతాదేవి విలాప వాక్యముల వినుచుఁగన్నీటిని విడుచుచు మాటలాడఁ జాలకుండెను. పూర్వాపర సందర్భములు మనమునకుఁ బట్టిన కొలఁదిని వృద్ధియగుచున్న శోకము నాఁపుకొన జాలక శ్రీరాముఁడు తిరిగి మూర్ఛితుండాయెను.

లక్ష్మణుఁ డనేక విధముల శ్రీరామచంద్రునకుఁ దెలివివచ్చుటకుఁ బ్రయత్నించుచు, "ఆర్యుఁడెట్టి దుస్తర శోకసముద్రమునందు మునింగినాఁడు? ఈయన, దీనినుండి బయటఁబడి శాంతచిత్తుఁడగు ననుట కలలోని వార్తగానున్నది. ఈయనను, శాంతచిత్తునిఁగఁ జేయుటకు మార్గము గాన్పింప కున్నదిగదా? కాని, యేదోవిధముగ నీయన దుఃఖనివారణకొఱకుఁ బ్రయత్నించుట యావశ్యకము" అని తలంచి యిట్లు పలుకం దొడంగెను. "ఆర్యా!

తమవంటివారలు శోక మోహములవలన నాక్రమింపఁ బడుట ధర్మము గాదు. తమకు సమస్తము దెలియును దైవయోగ మెట్లున్నదో యట్లు జరుగు చుండును. తా మకారణముగాఁ గాని, లేక సామాన్యకారణము చేతఁగాని, జానకీదేవిని బరిత్యజింతు రని యెవ్వ రెఱుంగుదురు? యోచించి చూచినయెడల సంసారమునందన్నియు ననిత్యములు. వృద్ధి క్షయములు, సంయోగ వియోగములు, జననమరణములు, మొదలగు సాంసారిక నియమముల కేకాలమందును మార్పు లేదు. కావున తాము దుఃఖ విదూరు లగుట యుత్తమము. మీరు ప్రజల హితము కొఱకు రాజ్యశాసన భారమును గైకొని యున్నారు. కావున తాము దుఃఖించుట వలనఁ బ్రయోజనము చెడును. అప్రియ మగువాని సంయోగమును, ప్రియమగువాని వియోగమును, దుఃఖమునకు మూల కారణములు. కాని భవాదృశ మహానుభావు లిట్టి విషయములఁ బురస్కరించుకొని దుఃఖించుట యుక్తముకాదు. సామాన్య మానవులు శోకమోహములవలన విచలితు లగుచుందురు. కాని తమవంటివారలు ధైర్యమును విడనాడుట మంచిది కాదు. నిరుపయోగమగు దుఃఖమును దూరీకృత మొనర

ర్చుకొని రాజ్యకార్యములయందు సుస్థైర్య మొన ర్చుడు. మీరు కేవలము లోకాపవాద భయమువల ననే గదా. జానకీదేవిని బరిత్యజించి యున్నారు ! ఇప్పు డామెకొఱకుఁ బరితపించుచుండినయెడల, అపవాద నివృత్తిగాకుండుటయేకాక, అది పూర్వముకంటెను వృద్ధియగును. కాఁబట్టి దేవిని బరిత్యజించుటవలనఁ గలుగ వలసిన ప్రయోజనము గలుగకుండును. శోకవ్యా కులచిత్తులై యున్నంత కాలమును రాజకార్యముల యందు మనోనిలుకడ నొనర్పఁజాలరు. ప్రజాపాలన కార్య ములయం దుదాసీన భావమును వహించుట రాజ ధర్మముకాదు. కావున తామీ విషయములను బాగుగ విచారించి ధైర్యము నవలంబింపవలయును అధిక శోకమును [illegible] యోగ్యమైనది [illegible] కాదు. కడచిన విషయములఁ గూర్చి చింతించుచు కాలయాపన మొనర్చుట వలనఁ బ్రయోజనము లేదు." అను వాక్యముల విని. రామచంద్రుఁడు నిమేష కాలము మౌనావలంబియై యుండి, పిమ్మట లక్ష్మణునితో నిట్లనియెను. "వత్సా ! నీ యుపదేశవాక్యములవలన, నాకు జ్ఞానోదయంబై నది. నీవు చెప్పినదంతయు యథార్థము. నేను పరమ కిరాతుఁడనై జానకిని వనవాసమునకనిపితిని. ఇపుడామె

కొఱకు పరితపించుచుండిన యెడల, నా యుద్దేశ్యము విఫలమగును. క్రమక్రమముగ నభివృద్ధి నొందుటయే లోకముయొక్క ధర్మము. కావున శోకాభిభూతుఁడగు వాఁ డభీష్టసిద్ధిని బొందనేరఁడు. కర్తవ్య కార్యముల నుండు, మనోనివేశనము లేనందువలన, మహాదోషము లాచరించును. కాఁబట్టి నే నీ ముహూర్తమునుండియు, సుఖ నివృత్తికొఱకుఁ బ్రయత్నింతును. నేనిఁక శోకాభి భూతుఁడను కానని ప్రతిజ్ఞ చేయుచున్నాను. ఇఁక నన్ను ప్రజలు శోకాతులుఁడని గ్రహింపఁజాలరు. నేఁటి నుండియు యథావిధిగ రాజకార్య పర్యాలోచన జరుగుచుండును. కావున సకాలమునకుఁ గార్యాలోచన మందిరమునకు రావలయునని మంత్రులకుఁ జెప్పుము."

అని నుడివి శ్రీరాముఁడు కొంతకాలము మాటలాడక మౌనమును ధరించి పిమ్మట కన్నీరు గార్చుచు నిట్లు పలుకందొడంగెను. "అయ్యో! రాజ్యపదవెట్టి విషమవిపత్తుల కాకరమైనది? ఎట్టిసుఖభోగముల ననుభవించవలయునని రాజ్యాధికారమును గోరుచుందురో తెలిసికొనఁ జాలకున్నాను. రాజ్యపద మధిష్ఠించి నే నీజన్మకు నాసకల సౌఖ్యములకు జలాంజలి యర్పించి, అత్యంత క్రూరుఁడనై నిరపరాధయగు జానకిని వనవాస

మున కనిపితిని. ఇప్పుడందుకొఱకొక్క కన్నీటి బిందు వును విడుచుటకైనను బ్రాప్తిలేదుగదా ? అయ్యో ! రాజత్వప్రాప్తివలన దయాస్నేహ మమతలను, నను ష్యత్వమునుగూడ, విడనాడుటయే నాకుఁ జేకూరిన మహాఫలము. కావున నన్ను భవిష్యత్కాలమందలి జనులు క్రూరరాక్షసుఁడని నిందిం చెదరనుట స్పష్టము."

అని నుడువుచు లక్ష్మణునకు సెల వొసంగెను. పిమ్మట శ్రీరాముఁడు ధైర్యమవలంబించి, శోకవేగము నాఁపుకొని, మఱునటిదినము ప్రాతఃకాలమునుండియు, నియమానుసారముగ రాజ్యకార్య పర్యాలోచనలను జేయుచుండెను. ప్రజ లీయనను మిక్కిలి ధైర్యశాలి యనియు, ననాయాసముగ దుఃఖవిముక్తుఁ డాయె నని యుఁ దలంపసాగిరి. కాని యీయన కోమలహృదయ మసహనీయ శోకానలముచేత దహింపఁబడుచుండెను. సీతను బరిత్యజించిన మనోవేదన విషపూరిత తీవ్రశరాణ మువలె యీయనను వేధింపుచుండెను. శ్రీరామ చంద్రుఁడు కేవలము లోకాపవాద భయమునలననే, సీతాదేవిని బ్రవాసమునకనిపి, తిరిగి నేఁ డాభయము తీవ్రదుఃఖమును బహిర్గతము కానీయకుండెను. ఈయన వలననే, సింహాసనాసీనుఁడై మూర్తీభవించిన ధర్మము

వలె స్థిరగంభీర చిత్తమున రాజ్యకార్య పర్యాలోచనం
జేయునప్పుడు ఈయనంతవాఁడఁ జోల్పఁదగిన ధైర్యశాలి
భూమండలమందు మఱి లేఁడని లోకులు దలంపసాగిరి.
కాని రాజకార్యముల ముగించి నివాసభవనమున కేఁగి
యత్యంత వికలచిత్తుఁడగుచుండెను. లక్ష్మణుఁడు ఆయన
వెన్నంటియే తిరుగుచు శ్రీరాముని హృదయ వేదనను
జల్లార్చుటకుఁగాను బహువిధ ప్రయత్నములు చేయు
చుండెను. కాని లక్ష్మణుని శాంత వచనముల వలన
శ్రీరాముని దుఃఖానలము ప్రజ్వలింపుచుఁ గన్నీరుమున్నీ
రుగా నేడ్చుచు తన్నుఁదాను నిందించుకొనుచు సీతా
దేవి గుణకీర్తనను జేయుచు విశ్రామకాలమును గడపు
చుండెను. ఇందువలన రామచంద్రుఁడు శుష్కించి
దుర్బలుఁడై ప్రజాపాలన కార్యములయందుఁ దప్ప మఱి
యేయితర విషయములయందును, ఉత్సాహశూన్యుఁడై
యుండెను.

కొన్ని దినములు గడచిన పిమ్మట వాల్మీకి యా
శ్రమమందు జానకీదేవి కవల శిశువులను బ్రసవించెను.
మహర్షి యా శిశువులకు యథావిధిగా జాతకర్మాది
సంస్కారములొనర్చి పెద్దవానికి కుశుఁడనియుఁ జిన్న
వానికి లవుఁడనియు, నామకరణంబు లొనర్చెను. ముని

కన్యకలు సంతాన ప్రసూతి యగు సీతాదేవిని జూచి యపరిమితసంతసమును బొందసాగిరి. ఆశ్రమమంతయు ఆనంద కోలాహలమున మునింగియుండెను. దుస్సహ ప్రసవవేదన వలన, సీతాదేవి కొంతసేపు తెలివి దప్పి యుండి, పిమ్మట స్వస్థచిత్తయాయెను. మునికుమార్తె లుల్లసితవదనములతో డను బరిపూర్ణ ప్రీతివాక్యములతో డను "జానకీ! నేఁడు నిక్కముగ సంతోషప్రదమైన దిన ము. దివ్యసుందర స్వరూపులగు ఇద్దరు శిశువులను బ్రసవించితివి." అని నుడువ సీతాదేవి వికసిత వదనయై యానంద సాగరమున నోలలాడసాగెను. కాని పూర్ణ కాలములో శోకాకులయై సంతతధారాగాఁ గన్నీటిని గార్చుచుండ మునికన్యలు "జానకీ! ఇట్టి యానందసమ యమందల దుఃఖించెదవు?" అని ప్రశ్నింప నోట మాటరాకుండుటవలనఁ గొంచెముకాలము ప్రత్యుత్తర మీయఁజాలక పిమ్మట తీవ్ర దుఃఖమును గొంచె మాఁపుకొని "ప్రియ సఖులారా! నేనిట్టి సమయ మందేల దుఃఖించుచున్నానో మీరెఱుఁగనే యెఱుం గరా! పుత్రప్రసవమువలన స్త్రీలకుఁ గలుగు సంతస మనంతమనుట నిక్కవము. కాని, నాకెట్టి యవస్థయం దిట్టి యాహ్లాదము సంభవించినది? నా తేజస్సుకు సమస్త

వాంఛలు, సుఖసంతోషములు. పూర్తియైనవి. నాగర్భమందీ హతభాగ్యులు పడవలెనేమోయని, ఆర్యపుత్రుండు నన్నుఁ బరిత్యజించెను వారినుపోషించుటకే, జాహ్నవియందు నామికి, ప్రాణత్యాగ మొనర్చుకొనక యుంటిదానను. లేక యేదోవిధముగ నాత్మహత్యఁ జేసికొని యుందును. అయ్యో! ప్రియసఖులారా! నే నింకను జీవించి యుండవలెనా? ఇంకను బ్రజలకు నా మోమును జూపించవలయునా?" అని పలుకుచు జానకీదేవి యేడ్వసాగెను.

మునికన్యలు హృదయవిదారకమగు జానకీదేవి విలాపవాక్యముల విని, దుఃఖితులై యిట్లు పలుకఁ దొడంగిరి. "ప్రియసఖి! దుఃఖింపకుము. నీవు చెప్పు మాటలు సత్యములు. కాని యిపుడు నీకీదినము లీయవస్థ యందుండదగదు. శ్రీరామచంద్రుండు మూర్ఖమువలన, వివేచనాశూన్యుండై యొకప్పుడును గని విని యెఱుంగని ఘోరకార్య మొనర్చియున్నాఁడు. ఆయన నిన్ను త్వరలో నే గైకొనునని మహర్షి సెలవిచ్చి యున్నాఁడు. కావున దుఃఖమును మానుము." అను మునితనయుల ప్రేమాపూరితవాక్యముల వినుచుండి జానకీదేవి కొంచెముగఁ గన్నీటిని గార్పఁజొచ్చెను.

ఈసమయమునందు శిశువులు రోదనము చేయ సాగిరి. ప్రేమ యెట్టి మోహనశక్తిని గలిగియున్నదో కాని, పసికూనల యేడ్పును వినినంతనే జానకీదేవి విస్మృతశోకయై వారికి స్తన్య మీయఁదొడంగెను.

కుశలవులు శుక్లపక్షచంద్రునిఁబోలి దినదినాభివృద్ధి నొందుచు సీతాదేవికి హృదయానందమును, నయనోత్సవమును జేయుచుండిరి. వచ్చిరాని మాటలతో వారు "అమ్మా, అమ్మా." అని పిలుచునప్పుడు, ముత్యములవంటి పలువరుసను జూచియు, అమృతోపమానమగు సగము సగముమాటలను వినియును, వారిని జంక నెత్తుకొని ప్రేమలోలుకు చూపులఁ జూచుచు, పలుమాఱు ముద్దిడుకొనుచు, శోకమును మఱచి పోవుచుండెను. ఆమె శరీర మమృతాభిషిక్తమై శీతల మగుచుండెను. నయనము లానందాశ్రువులతోడ నిండుచుండెను.

కుశలవుల కయిదవ వత్సరము వచ్చినంతనే వాల్మీకి మహర్షి చూడాకర్మ నొనర్చి యక్షరాభ్యాస మొనర్చెను. బాలకు లసాధారణ శక్తియుతులును, మేధాప్రభావసంపన్నులు నగుటవలన స్వల్పకాలములో వివిధవిద్యాపారంగతులైరి. ఇంతకుఁ బూర్వమే వాల్మీకి

లోకోత్తరమగు రామచరిత్రను గైకొని, రామాయణ మహాకావ్యమును రచించెను. ప్రథమమున నీయమృతాసవర్షిణి యగు రామాయణ మహాకావ్యమును కుశలవులకుం బాఠముం జెప్పెను. ఆమహాకావ్యము కుశలవులకుఁ గంఠస్థమాయెను. వీరు తల్లిసముఖమునందు మృదుమంజుల స్వరమున రామాయణము బఠించునప్పుడు, జానకీదేవి విస్మృతశోక యగుచుండెను. మహర్షి పదునొకండవ వత్సరమున కుశలవులకు నుపనయన సంస్కారమొనర్చి వేదమును జెప్పం దొడంగెను. వీరొక వత్సర కాలములో, చతుర్వేదములను గంఠస్థము చేసికొనిరి. కుశలవులకుం బండ్రెండు వత్సరములు నిండెను. కాని వారింత దనుక తా మెవరో, యేవంశమునందు జన్మించిరో యెఱుంగక, తాము ఋషికుమారులమనియు, తమ తల్లి ఋషిపత్నియనియుం దలంచుచుండిరి. జానకీదేవి ప్రవర్తనను జూచినవార లామెను మునిపత్ని యనియు కుశలవుల యాచార వ్యవహారములను జూచినవారలు వీరిని ఋషికుమారులనియుం దలంచుచుండిరి. కుశలవులు జానకీదేవిని దల్లియని మాత్రమే యెఱుంగుదురు. కాని, కోసలరాజ్యాధిపతి యగు జనకమహారాజు తనయ యని కాని, శ్రీరామచంద్రుని పట్టమహిషి యని కాని

యెఱుంగరు. సుహార్ద్రప్రయత్నపూర్వకముగ నీవిషయమును వారికిఁ దెలియనీయకుండెను. భ్రమప్రమాదములనైనను, కుశలవులకు వారితలిదండ్రుల చరిత్రను, దేనియునుఁ జెప్పవలదని యాశ్రమవాసులకు గట్టిగాఁ జెప్పెను. బాలుర కాత్మపరిచయము చేయవలదని సీతాదేవి వారిఁ జెప్పియుండెను. అందువలన సీతాదేవిగాని, యాశ్రమవాసులుగాని, వారికా విషయమును దెలియనీయకుండిరి. వారు రామాయణమును మిక్కిలి చక్కఁగా గానము చేయుచుండిరి. కాని యందు వర్ణింపఁబడిన సీతయే తమతల్లి యనికాని, రాముఁడే తమతండ్రి యనికాని వారెఱుంగరు.

ఇంతవఱకును జానకీదేవి శోకమును విడనాడి యేవిధములగు చింతలనుగాని, కోరికలనుగాని, మనమునఁ జొరనీయక కుశలవులను బెంచుచుండెను. ఇప్పటికి కుశలవులకు శైశవమతిక్రమించుటవలన మాతృప్రయత్న మంతగా నదికవసరము లేకుండెను. కాఁబట్టి ఋషిపత్నులవలె నను తపస్సుఁ జేసికొనుచుండెను. శ్రీరామచంద్రునకుఁ బ్రతివిషయమునందును మంగళము గలుగవలయుననియే, యీ సీతతపస్సుయొక్క ముఖ్యవిషయమై యుండెను. విరహబాధయగు తన్ను విడ

నాఁడినాఁడని శ్రీరామచంద్రునిపైని హృదయమందొక క్షణకాలమైనను రోషముగాని, విరాగముగాని, యామె పొందియుండలేదు. తన దుర్భాగ్యదోషమువలన తాను దుస్తర శోకజలనిధియందుఁ బడిపోయితినని తలంచుచుండెను. భ్రమప్రమాదములనైనను రఘురాముని యందు దోషము గలదని తలంచకుండుటయేకాక, ఆమనయందుఁ గల యావికలభక్తి, దృఢానురాగము లేశమైనను దఱుఁగకుండెను. సీతాదేవి నియమోపవాసస్నానహోమాద్యకర్మలు శ్రీరామచంద్రుఁడు కుశలముగ నుండవలయు ననియు, ఉత్తరజన్మమునందుఁగూడ నాతఁడే తనకు భర్త కావలయుననియు, సదా దేవతలను బ్రార్థించుచుండెను. సీతాదేవి పగలు తపస్సు మొదలగు కార్యముల యందును, మునికుమార్తెల తోడను గాలము గడపుచుండెను. కాని రాత్రు లేకాకినిగా నుండుటవలన నామె దుస్తర శోక జలనిధి వెల్లివిరియుచుండెను. ఈమె కేవలము శ్రీరామచంద్రునియందు లగ్నహృదయయై యశ్రుజలముల విసర్జించుచు రాత్రులు గడపుచుండెను. పతిగతప్రాణయగు సీతాదేవి పతివిరహ యాతనను సహించుట దుస్తరముగదా? సర్వసాధారణముగా దుఃఖము కాలక్రమమునతగ్గిపోవుచుండును. కాని, యీ

దుఃఖము క్రమక్రమముగా వృద్ధిఁ బొందుచుండ, దీనరూపమును దాల్చుచుండెను. ఈవిధముగ పండ్రెండు వత్సరములనుండి యనివార్యశోకానలముచేత దగ్ధమగుచున్న సీతాదేవి యలౌకిక రూపలావణ్యమంతర్హిత మగుటయేకాక, చర్మావశిష్టమగు కంకాళములు మాత్రమే మిగిలియుండెను.

---

# సీతాదేవి వనవాసము.

## ఆఱవ ప్రకరణము.

---

శ్రీరామచంద్రుఁడశ్వమేధయాగమును జేయఁ దలఁచి, తనయభిప్రాయమును వసిష్ఠుఁడు, జాబాలి, కాశ్యపుఁడు, వామదేవుఁడు మొదలగు మహర్షులకు నివేదించెను. ఈ విషయమును వినినంతనే వసిష్ఠమహర్షి యిట్లు నియె. "మహారాజా! తమసంకల్ప మత్యుత్తమమైనది. తాము ససాగరపృథ్వీశ్వరులు. ఇంతకుముం దేరాజులు సఖండ భూమండలమం దీవిధముగ నేకాధిపత్యమును విస్తరింపఁజేసి యెఱుంగరు. తమ పరిపాలనయందు ప్రజలు కని విని యెఱుంగని స్వచ్ఛంద సౌఖ్యముల ననుభవించుచున్నారు. తాము రాజ్యాభిషిక్తులై చేయవలసిన సత్కార్యములన్నిటిని జేసితిరి. కాని యశ్వమేధ యాగముమాత్రమే మిగిలియున్నది. ఆయాగ మొనర్చిన యెడల, తమ రాజ్యాధికారమం దేవిధమగు లోపములుండవు. నేనింతకుఁబూర్వమే యీ విషయమును తమకు నివేదింపఁ దలఁచి యుంటిని. కాని తమంతట తామే అశ్వమేధ యాగమును జేయఁ

వలచుటవలన మిక్కిలి సంతసించుచున్నాను. కాబట్టి యిక నాలసింపక వెంటనే తద్విషయిక ప్రయత్నముల కాజ్ఞ నొసంగుడు."

శ్రీరామచంద్రుడు తమ్ములవంకజూచి, "సోదరులారా! వసిష్ఠమహర్షి వాక్యముల వింటిరి గదా! మీయభిప్రాయములం దెలిపిన మొదలం గర్తవ్యకార్యముల నుపక్రమింపవచ్చును" అని యడుగ రామచంద్రుని యాజ్ఞానువర్తులగు నమ్మువ్వురు సోదరు లంగీకరించిరి. పిమ్మట శ్రీరాముండు కుల పురోహితుండగు వసిష్ఠ మహర్షిని సంబోధించి "భగవానుడా! నాయభిలాషను నాసోదరులును, తామును, అంగీకరించుటవలన నా సంకల్పము నెఱవేరిన దని తలచుచున్నాను. నైమిశారణ్యము పరమపవిత్రమగు యజ్ఞక్షేత్రము. తామంగీకరించిన యెడల యాగము నచ్చట చేయుదును." అని యడుగ వసిష్ఠుం డామోదించెను.

పిమ్మట రామచంద్రుండు తమ్ములతో నిట్లనియె. "సోదరులారా! వృథా కాలహరణం బొనర్చుట యుక్తము గాదు. కాబట్టి మీరు వెంటనే యజ్ఞ ప్రయత్నములకుం గడంగుడు. మన యాజ్ఞాధీనులను శరణాగతులను, స్నేహ సంబంధము గల రాజులను,

యజ్ఞమున కాహ్వానింపుడు. యజ్ఞకాలమును నిర్ణయించి దానిని రాజ్యమునందంతటం బ్రకటింపుడు. లంకా యుద్ధమునందు సాహాయ్యమొనర్చిన పరమస్నేహితులను సన్మానపూర్వకముగ నాహ్వానింపుడు. మనకొఱకు వారెన్నియో కష్టముల ననుభవించి యున్నారు. వారు యాగమునకు వచ్చినట్లయిన నేను చరితార్థుండ నగుదును. ఋషులనందఱ నాహ్వానింపుడు. వారందఱు వచ్చిన యెడల మనము ధన్యులము. భరతా! నీవు వెంటనే బయలుదేఱి నైమిశారణ్యమున కేఁగి యజ్ఞభూమిని నిర్ణయింపుము. లక్ష్మణా! కావలసిన సమస్త పదార్థములను సమకూర్చి వెంటనే నైమిశారణ్యమున కనుపుము. యజ్ఞమును జూచుటకుఁగాను ప్రజలు లెక్కకు మిక్కుటముగ వత్తురు. చూడవచ్చినవారి కేవిషయమందైనను లోపముగలుగకుండునటుల జాగ్రత్త పుచ్చుకొన వలయును. వారి కణుమాత్రమైనను కష్టముగాని, యసౌఖ్యముగాని, కలుగఁగూడదు. సోదరులారా! మీరు సమస్తవిషయములందును బారదర్శకులు. కావున మీకింతకంటె నధికముగ నుపదేశించుట అనావశ్యకము."

వసిష్ఠుఁడు రామచంద్రుని జూచి 'మహారాజా! యజ్ఞమునకుఁ గావలసినదానికంటె మిక్కుటముగ సమస్త ప్రయత్నములు జరుగు ననుట నిస్సంశయము. కాని, యొకవిషయమందుమాత్రమసందర్భము గన్పట్టు చున్నది.' అని నుడువ "మీ రేవిషయమునం దసందర్భమును గాంచుచున్నారు?" అనియడుగఁగా, వసిష్ఠుఁ డిట్లనియె. "మహారాజా! భార్యా సమేతముగ ధర్మ కార్యము లనుష్ఠింపవలయు నని ధర్మశాస్త్రములు చెప్పుచున్నవి. కావున మీ రీ విషయమునం దేమి చేయఁదలఁచితిరి?" అను వాక్యములు శ్రవణ గోచర మైనంతనే రాముని ముఖకమలము మ్లానమయ్యెను. నేత్రము లశ్రుపూరితములయ్యెను. మౌనము వహించి క్రిందఁ జూచుచుండెను. పిమ్మట దీర్ఘనిశ్వాసమును బరిత్యజించి పొంగి పొరలుచున్న శోకవేగము నాఁపు కొని "భగవానుఁడా! నేనింతకుఁ బూర్వ మీవిషయ మును గూర్చి యోచింపలేదు. కావున నేమి చేయవల యునో, సెలవిండు." అనియడుగ వసిష్ఠుఁడు కొంతవడి యోచించి, 'మహారాజా! తిరిగి వివాహ మాడుట కంటె వేఱుమార్గము లేదు.' అని నుడివెను.

వసిష్ఠుని వాక్యముల విని సభయందున్న వారెల్లరు మౌనమును ధరించిరి. రాముడు సీతాగతప్రాణుడు. లోకులు నిందింతురను భయమువలననే యామెను వనవాసమున కనిపి, తాను జీవన్మృతుడై యుండెను. రాముని కామెయందుండుగల యవిచలిత స్నేహానురాగము లణుమాత్రమైనను దఱుగకుండుటయె కాక, క్రమక్రమము నవి వృద్ధియగుచుండెను. దివ్యసుందర మోహనమూర్తియగు సీతాదేవి నిత్యనూత్న విలాసములతోడ నహర్నిశ మాయన హృదయ సింహాసనమునందు విరాజిల్లుచుండెను. అందువలన యజ్ఞము చేయుటకు రాముడు తిరిగి వివాహమాడు ననుట యసంభవము. కాని వసిష్ఠుడు వివాహామాడవలయు నని ప్రోత్సాహపఱచ, రామచంద్రుడు తన యసంగీకారమునుదెలిపి మాటలాడక క్రిందుచూచుచుండెను. అంత సభాసదు లీవిషయమును గూర్చి పలువిధముల చర్చించి, యందు ఏకగ్రీవముగ బంగారుతోఁ జేసిన సీతాదేవి ప్రతిమను పార్శ్వమందుంచుకొని యజ్ఞము చేయవచ్చునని సిద్ధాంతీకరించిరి.

వెంటనే భరతుడు నైమిశారణ్యమున కేఁగి స్థలమును నిర్ణయించి యజ్ఞశాలను నిర్మించి, దానికి

సమీపమునం దప్పటిచ్చట నాహ్వానింపఁబడిన వారి కనుగుణ్యమగు పాకలను, గుడారములను, నిర్మించెను. కొలఁదికాలములో లక్ష్మణుఁడు హోమ పదార్థములను సమకూర్చి యజ్ఞక్షేత్రమునకనిపెను. శ్రీరామచంద్రుఁడు యథావిధిగా యాగాశ్వమును వదలి దాని రక్షణభారమును లక్ష్మణున కర్పించి చతురంగ బలసమేతుఁడై తల్లులు మొదలగు వారితో నైమిశారణ్యమున కేఁగెను. ఉపాయనము లర్పించుట కమూల్యవస్తువులను గైకొని రాజులును, శిష్యజనపరివేష్టితులై ఋషులును, గుంపులు గుంపులుగఁ బ్రజలును, ప్రతిదినము వచ్చుచుండిరి. నృపతులను సమ్మానించు భారమును భరతశత్రుఘ్నులు గైకొనిరి. ఋషులపరిచర్యకు విభీషణుఁడు నియమింపఁ బడెను. ఆహ్వానింపఁబడిన యితరవారి సమ్మానభారమును సుగ్రీవునిపై నిడిరి.

ఇక్కడ వాల్మీకిమహర్షి యిట్లు తలపోయసాగెను. "జానకీదేవి స్థితిఁ జూడ నిఁక నధిక దినములు జీవించునను నమ్మకము లేదు. కుశలవులు రాజాధిరాజ తనయులు. కావున వారు యావజ్జీవితము తపోవనమందే యుండుట యుక్తము గాదు. వారు ధనుర్వేదమును, రాజనీతిని, అభ్యసింపవలసిన కాలము గడచు

చున్నది. కాఁబట్టి రాముఁడు పుత్త్రిలుండ సీతాదేవిని గైకొనుటకుఁ దగుమార్గము గనిపట్టుట యత్యావశ్యకము. ఇచ్చుటకు శ్రీరామచంద్రుని రప్పించి గాని, లేక నేనయోధ్య కేఁగి గాని పుత్త్రసహితముగ సీతాదేవిని గైకొన వలయు నని ప్రార్థించినయెడల రాముఁడు నాప్రార్థనను నిరాకరింపఁడు." తిరిగి మహర్షి నిమేషకాల మూరకుండి యోచించినపిమ్మట "రామచంద్రుఁ డత్యంత ప్రజానురాగ ప్రియుఁడు. ప్రజల విరాగమునకుఁ బాత్రుఁడ నగుదునేమో యను భయమువలననే, పూర్ణగర్భావస్థ యందున్న జానకీదేవిని బరిత్యజించి యున్నాఁడు. కాఁబట్టి, నేను చెప్పినంతనే జానకీదేవిని గ్రహించు ననుటకు సందియము గలుగుచున్నది. కాని యేదోవిధముగ రామచంద్రునకు వార్తను బంపక నిశ్చింతగా నుండుటకు వీలులేదు. ఈబాలురేకదా ముందు కోసల రాజ్యాధిపతు లగుదురు. వీరు తండ్రి సన్నిధానమందుండి రాజనీతి నభ్యసించనియెడల రాజకార్య నిర్వహణమం దసమర్థులై రాచమర్యాదలను రక్షించుకొనఁ జాలకుందురు. కోసలరాజ్య క్షేమమునకుఁ బ్రయత్నింపనైతి నని రామచంద్రుఁడు నన్ను నిందించును. కాఁబట్టి యీ విషయమునం దింక నుపేక్షవహించి యుండుట

భావ్యము గాదు. రామచంద్రున కీవిషయమును దెలియఁ జేయుటయే యుక్తము. కాని మున్ముందు వశిష్ఠు నితోఁగాని, లక్ష్మణునితోఁ గాని, మాటలాడి వారి యభిప్రాయమును దెలిసికొనుట మంచిది." అని నిశ్చయించుకొనెను.

ఒకనాఁడు వాల్మీకిమహర్షి, సాయంసంధ్యను హోమవిధులను నిర్వర్తించుకొని, యేదియో యోచించుచుఁ గూర్చుండి యుండ, రాజభటుఁ డొకఁడు వచ్చి శ్రీరామ నామాంకితముగల యాహ్వాన పత్త్రికయొక దానిని, మహర్షి చేతి కిచ్చెను. ఆ పత్త్రికను జదువుకొని మహర్షి పరమానంద భరితుఁడై, రాజభృత్యునకు సెలవొసంగి వాని కాహారమును బెట్టించుట కొక శిష్యుని నియమించి, యిట్లు చింతింపఁ దొడంగెను. "నేను యోచించుచున్న విషయము నెఱవేరుటకుఁ దగు మార్గమును దైవమే చూపించి యున్నాఁడు. కావున రామచంద్రుని బ్రార్థింపకుండనే, యీ కార్యమును సాధింపవచ్చును. కుశలవులను శిష్యభావమున వెంట నిడుకొని యశ్వమేధ యాగమున కేఁగుదును. వీరిని జూచినంతనే రూప సాదృశ్యమువలన రామచంద్రునితనయులని యెల్లరును సులభముగ గ్రహింతురు.

వారిని దిలకించినమాత్రమున రామచంద్రుని హృదయము కఱఁగి నీరై పాఱుననుటకు నిస్సంశయము. అందువలన నా ప్రయత్నము తనంతట తానుగ నెఱవేరును."

అని సిద్ధాంతీకరించుకొని జానకీదేవి కుటీరమున కేఁగి "బిడ్డా! రామచంద్రుఁ డశ్వమేధయాగ మొనర్పఁ బూని నాకాహ్వానపత్రిక నంపి యున్నాఁడు. నే పుదయమున నేనేఁగదలఁచితిని. ఇతర శిష్యులతోఁ బాటు కుశలవులనుగూడ నా వెంటఁ దీసికొని పోవుదును" అని నుడువ సీతాదేవి తన యామోదమును దెలిపెను. వెంటనే మహర్షి తనకుటీరమున కేఁగి, యజ్ఞమున కేగుటకుఁగాను సంసిద్ధులరై యుండవలయు నని శిష్యుల కాజ్ఞాపించి, కుశలవులతోడ నిట్లనియె. "మీరింతదనుక జనపదములందలి యే కార్యములను జూచి యెఱుంగరు. శ్రీమద్రామాయణ మహాకావ్యమునకు నాయకుఁడగు, శ్రీరామచంద్రుఁ డశ్వమేధయాగమును జేయఁ బోవుచున్నాఁడు. ఆయాగమునకు మిమ్ముఁదోడ్కొని యేఁగఁ దలఁచితిని. మీకు యజ్ఞ దర్శనముతోఁ బాటు రాజదర్శనము గూడ లభించును. అక్కడకు వివిధాచార వ్యవహారములు గల జనులు లెక్కకు మిక్కుటముగ వత్తురు. వారి నందఱను మీరు చూడవచ్చును."

కుశలవులు రామాయణమందు శ్రీరాముని యసాధారణ కీర్తివర్ణనలను బఠించి యుండుటవలన, ఆయన యద్వితీయుఁడని తలంచుచుండిరే కాని ప్రత్యక్షముగఁ జూచి యెఱుంగరు. ఇప్పు డాయనను జూడ వచ్చు ననుతలంపున పరమానంద భరితులైరి. నానా దేశములనుండి వచ్చు వివిధాచార వ్యవహారములు గలవారిని జూడవచ్చునను కుతూహలము గూడ, వీరికి మిక్కుటముగ నుండెను.

అశ్వమేధ యాగమును గూర్చి విని, సీతాదేవి కన్నీరు మున్నీరుగా నేడ్వసాగెను. నిమిషకాలములో నింకొక విషయ మామెచిత్తము నాక్రమించుటవలన నామెదుఃఖము దుర్భర మయ్యెను. సీతాదేవి యింత వరకును, శ్రీరాముఁడు తనమీఁద నపారప్రేమ గలిగి యున్నాఁడను దృఢ విశ్వాసమున నుండెను. ప్రజల విరాగమునకుఁ బాత్రుఁడ నగుదు నేమో యనుభయము వలన మాత్రమే తన్ను విడనాడినాఁడని నమ్మియుండెను. కాని, రాముఁ డశ్వమేధయాగమునకుఁ బూనుకొనె నని వినినంతనే యాయన యింకొక భార్యను పరిగ్రహించి యుండునని తలఁచి మృతప్రాయురాలయ్యెను. తన్ను బరిత్యజించిన దుఃఖమును సీతాదేవి సహింపఁ గలైను

కాని రాముఁడు రెండవ భార్యను స్వీకరించినాఁ డను విషయము చిత్తమునకుఁదట్టినంతనే, యామెమనోవేదన యసహనీయ మయ్యెను. నిరపరాధయగు తన్ను వనవాసమున కనిపినను, తనమీఁదనాయనకుఁ గల యవిచలితస్నేహము, గాఢానురాగము లణుమాత్ర మైనను దఱుఁగకుండు నని తలంచుచుండెను. కాని యిప్పుడు తిరిగి వివాహమాడుటవలన దనమీఁద నాయనకుఁగల ప్రేమానురాగములు పోయెనని తలఁచి వర్ణనాతీత మగు చిత్త సంక్షోభమువలనఁ దత్తరిల్లు చుండెను.

కుశలవులు సీతాదేవి కడకు వచ్చి యిట్లనిరి. “అమ్మా! అశ్వమేధ యాగమునకు రేపుదయమున మమ్ముఁదీసికొని వెళ్లుదు నని మహర్షి చెప్పియున్నాఁడు. మే మాహ్వానపత్త్రమును దెచ్చినవానికడ కేఁగి రామచంద్రునిగూర్చి అనేక ప్రశ్నలను బ్రశ్నించితిమి. విచారించినకొలందిని, ఆయనచరిత్ర యసామాన్యముగఁ దోఁచుచున్నది గదా. అమ్మా! మే మొక విషయమునందు, మిక్కిలి యాశ్చర్యాన్వితులమైతిమి. రామాయణమును జదువుటవలన నాయనమీఁద మాకుఁ గలిగిన దృఢతరభక్తి నేఁడు విన్నమాటలను బట్టి

వేయిరెట్లువృద్ధిపొందినది. రామచంద్రుఁడు ప్రజారంజనార్థము భార్యను బరిత్యజించె నని విని "ఆయన తిరిగి వివాహమాడినాఁడా! లేనియెడల యజ్ఞమెట్లుచేయును? యజ్ఞమునుచేయుటకు సహధర్మిణి యుండవలయును గదా?" అని ప్రశ్నింపనాతఁడు "వివాహమాడవలయు ననివసిష్ఠమహర్షి రామచంద్రుని పలుమఱు తొందరించెను. కాని యాయన యంగీకరింపఁడయ్యె. అందువలన సీతాదేవిప్రతిమూర్తిని బంగారుతోఁ జేయించినారు. ఆమూర్తిని పార్శ్వమందుంచుకొని శ్రీరాముఁడశ్వమేధయాగమును జేయును." అని నుడివినాఁడు. అమ్మా! ఇట్టి మహాపురుషుఁడు భూమండలమం దెప్పుడును బుట్టియుండలేదనుట నిక్కువము. రామచంద్రుఁడు రాజ్యధర్మమును నిర్వహించుటయం దెట్టి యనురాగము గలిగియున్నాఁడో దాంపత్యధర్మమునం దట్టి యనురాగమే గలిగియున్నాఁడు. మే మితిహాసగ్రంథములయం దనేక రాజులయు మహాపురుషులయు, చరిత్రలను జదివి యున్నాము. కాని యేవిషయమందును రామునితోఁ బోల్పఁదగిన రాజుగాని మహాపురుషుఁడు గాని మఱి కానరాఁడు. ప్రజారంజ నానురోధమువలన భార్యను బరిత్యజించుటయు ఆమోయం దుండు చిర

నిర్మల ప్రేమవలన యావజ్జీవమును తిరిగి వివాహమాడ కుండుటయును గని విని. యెఱుంగని కార్యములు గదా? అమ్మా! రామాయణమును బఠించినప్పటి నుండియు, రామచంద్రునిఁ జూడవలయు నను కోరిక మమ్ము బ్రోందరింపుచున్నది. ఇప్పుడు మా యభిలాష సిద్ధికి సుయోగము లభించినది. కావున నాజ్ఞ నొసంగినయెడల రామచంద్రుని దర్శించుట కేఁగుదుము." అని యడుగ, జానకీదేవి తనయంగీకారమును దెలిపెను. వెంటనేవారు పరమానంద భరితులై మహర్షి సాన్నిధ్యమున కేఁగిరి.

శ్రీరామచంద్రుఁడు తిఱిగి వివాహమాడె నను సంశయమువలన సీతాదేవి శరీర మంతట వ్యాపించిన విషాదవిషము సువర్ణమూర్తి మాటను విని నంతనే దగ్ధమాయెను. ఆమె హృదయమును దహించుచున్న చిరప్రదీప్తమగు శోకానలము చల్లారెను. నయనములనుండి యానంద బాష్పములు రాల సాగెను. తనను బరిత్యజించినాఁడను సంతాపము నశించుటయే కాక, ఆమె హృదయమం దపూర్వమగు సౌభాగ్యగర్వ మావిర్భవించెను.

మఱుదిన ముదయముననే కుశలవులను, శిష్యులను, వెంట నిడుకొని వాల్మీకిమహర్షి నైమిశారణ్యము

నకు బయలు దేఱెను. వీరు రెండవదినము మధ్యాహ్నమునకు యజ్ఞభూమిని బ్రవేశించిరి. వసిష్ఠుఁడు పరమానందభరితుఁడై తగు నివాసస్థలమునందు వీరిని బ్రవేశ పెట్టెను. పిమ్మట కుశలవులు రామచంద్రునిఁ జూచి పులకాంకితులై తమలోఁ దామిట్లు చెప్పుకొన సాగిరి. "రామాయణమునందు వర్ణింపఁబడిన యసమాన గుణము లన్నియు నీయన యాకారమునందు సుస్పష్టముగఁ బ్రతిఫలించుచున్నవి. ఈయనను జూచినంతనే మహాపురుషుఁడని ద్యోతక మగుచున్నది. ఈయనతన సౌమ్యమూర్తికిఁదగిన గంభీర ప్రకృతిగలవాఁడు. మన గురు వెట్టి యసామాన్యకవిత్వసంపన్నుఁడో, యీయన యట్టి యపూర్వ సుగుణగణసంపన్నుఁడు. ఇట్టి మహాపురుషుఁడు నాయకుఁడు గాని యెడల, మహర్షి ప్రణీతమగు నీ మహాకావ్యమున కిట్టి గౌరవంబుండనేరదు! రామచంద్రుని యసాధారణ గుణకీర్తనను జేయుటవలననే, మహర్షి యత్యద్భుత కవిత్వశక్తి సార్థకత నొందినది. నేఁటికీ మహాపురుషుని సందర్శించుటవలన మనకు నేత్రసాఫల్యమైనది."

దినముల నరుసను క్రమక్రమముగా యాగమునకాహ్వానింపఁబడిన వా రెల్లరు విచ్చేసిరి. అతికోలాహల

ముండ నిరూపితదివసమం దశ్వమేధ యాగము ప్రారంభింపఁబడెను. గణనాతీతముగ వచ్చియున్న వికలాంగులు, దరిద్రులు, మొదలగు వారు కోరు కోరికలన్నియుఁ బూర్తి యగుచుండెను. అనవరతము నలు దిక్కుల నృత్యగీత వాద్యములు జరుగుచుండెను. ఎల్లరును మనోహర వేషభూషలను ధరించి యుండిరి ప్రతిమనుజునిమోమును సంతోషముతోడఁ బ్రకాశించుచుండెను. ఎవరును దుఃఖమును గాని, కష్టమును గాని పొంది యెఱుంగక మహానందముగ యాగమును సందర్శించుచుండిరి. నృపతులు, ఋషులు, మొదలగువారిలో వృద్ధులందఱేక గ్రీవముగ నిట్టి యజ్ఞమును మే మెప్పుడును జూచి యెఱుంగమని నుడువసాగిరి. ఈవిధ మగు సంతోష కోలాహలముతోడ నశ్వమేధ యాగము నడుచుచుండెను. ఆహ్వానింపఁబడిన వారెల్లరు యజ్ఞసభ యందుఁ జేరి మహానందముగ యజ్ఞమును సందర్శించుచుండిరి.

---

# సీతాదేవి వనవాసము.

## ఏడవ ప్రకరణము

ఒక దినమున వాల్మీకి మహర్షి యొంటరిగఁ గూర్చుండి యిట్లు యోచించుచుండెను. "నే నీయోగ దర్శనమునం దాసక్తుఁడనై యింతదనుక వృథా కాలమును గడపితిని. కాని తలపెట్టిన కార్యసాధనకుఁ బ్రయత్నింపనైతిని. కుశలవుల నేయుపాయమున రామచంద్రుని సందర్శించునట్లు చేయుదును? ఏమియుఁదోఁచకున్నదిగదా! వీరిని వెంటనిడుకొని రాజసభ కేఁగుదునా? లేక యేదో యొక మిషమీఁద రామచంద్రుని యచ్చటకు రప్పించి సకల విషయములు సవిస్తరముగఁ జెప్పి పుత్రసమేతముగ సీతాదేవిని గైకొను మని ప్రార్థింతునా ?" అని పలు విధములఁ దర్కించుకొని చివర కిట్లు నిశ్చయించుకొనెను. "కుశలవులచేత రామాయణమును గానము చేయింతును. వీ రచ్చటచ్చట గానము చేయుచుండిన యెడల రామున కీ విషయము కర్ణగోచరమగును. అప్పు డాయన స్వకీయ చరిత్రను వినవలయు నను తలంపునఁ గుశలవులను దన సమీప

మున కాహ్వానించును. అందువలన సునాయాసముగ నీ కార్యము సఫలమగును."

అని నిశ్చయించుకొని వాల్మీకి, కుశలవులను పిలిచి యిట్లనియె. "ప్రతిదినమును మీ రప్పుడప్పుడు ఋషులు నివసించు కుటీరముల సమీపమునందును, నృపతుల పటకుటీర పురోభాగంబునను, పురజనులు మొదలగువారు నివసించుపాకల కెదుటను, సభాభవన సమ్ముఖమందును, రామాయణమును గానము చేయు చుండుడు. రాజు మిమ్ముఁ బిలువనంపి గానము సేయుం డని కోరినయెడలఁ దత్క్షణమే గానము సేయుఁడు. ఆయన సాన్నిధ్యమునందున్నంత కాలమును మిక్కిలి వినయ విధేయతలతోఁ బ్రవర్తింపవలయును. సమస్త జనులకు రాజు తండ్రివంటివాఁడు. కావున. మీ రాయ నయెడల పితృభక్తిని జూపవలయును. . ఆయన మీ సంగీతమునకు సంతసించి ధనమొసఁగఁ దలఁచిన యెడల ధనమును గైకొనకుఁడు. భక్తిపూరిత వినమ్రవచనముల తోడ మీనిరాకను వెల్లడింపవలయును. 'మహారాజా! మేము వనవాసులము. తపోవనమందుండి కందమూల ఫలములతోఁడఁ బ్రాణధారణం బొనర్చుకొనుచుందుము. కావున మాకు ధనమునలనఁ బ్రయోజనము లేదు.'

అని సుమంత్రుఁడు. మీరెవరిని యడిగిన మొదల వాల్మీకి శిష్యుల మని చెప్పుఁడు."

అని యుపదేశించి యాజ్ఞ నొసంగినంతనే, కుశలవులు వాల్మీకి యాదేశానుసారముగ, వీణను మీటుచు బ్రహ్మానందముగ రామాయణమును గానము చేయసాగిరి. వీరి గానమును వినువారలు పరవశులై స్థిరచిత్తముగ గానమును వినుచు, కన్నీరు కార్చుచుండిరి. ఏలయన! శ్రీరామచంద్రుని చరిత్ర, యత్యద్భుతమును, పవిత్రమును, మనోహరమునై యుండెను. ఈ మహా కావ్యయమును రచించిన వాల్మీకి మహర్షి కవిత్వ మత్యుత్కృష్టమై హృదయాహ్లాదకరమై యుండెను. కుశలవుల రూప రేఖా విలాసము లద్వితీయములై చూపఱు మోహా పరవశులుగ నొనర్చుచుండెను. వీరి మృదు మంజుల స్వరములు వినినకొలఁదిని కోకిలల కూజితములు కర్క ప్రాయములుగఁ దోచుచుండెను. ఇదివర కెవరును కని విని యెఱుంగ నంతటి నైపుణ్యము వీణా వాద్యము నందు వీరి కలవడియుండుటవలన వీరి గానమును వినువార లనిర్వచనీయ ప్రేమా రసమునందు మునింగి యానంద బాష్పములు గార్చుచుండి రని నుడువుటయం దాశ్చర్య మేమున్నది?

ఒకటి రెండు దినములు గడచిన పిమ్మట వీరి గానమును వినినవారిలో ననేకులు శ్రీరాముని సమీపించి "మహారాజా! ఇద్దరు సుకుమార ముని కుమారులు వీణను వాయించుచు, మీచరిత్రను గానము చేయుచున్నారు. ఆ గానము శ్రోతలను పరవశులనుగ నొనర్చుచున్నది. పుట్టి బుద్ధియెఱింగిన దాదిగా మే మెప్పు డిట్టి మృదుమధుర గానమును విని యుండలేదు. వారు కవలపిల్లలు. ఇంతవఱ కెవ్వరును మానవదేహమున నిట్టి రూపమాధురిని జూచి యుండ రనుట నిక్కువము. వారిగానమును, కిన్నరులు వినినయెడల, పరాభవింపఁబడితి మని తమంతట తాముగనే యంగీకరింతురు. వారు గానముచేయు కావ్య మెవరు రచించిరో కాని, ఆ యమృతోపమానమగు కవిత్వ మపూర్వమైయున్నది. మహారాజా! ఆ ముని కుమారులఁ బిలువనంపి తమ సన్నిధానమందు గానము చేయింపవలయునని ప్రార్థించుచున్నాము. తాము వారిని జూచినను, వారి సంగీతమును వినినను, పరమానంద భరితులగుదు రనుట నిస్సందియము." అని విన్నపించుకొనిరి.

వీరి మాటలు వినినంతనే, శ్రీరామచంద్రునకు బాలురను జూడవలయునను కుతూహలము మిక్కుటమై, వారిని బిలుచుకొని వచ్చుటకు సభాసదులలో నొక బ్రాహ్మణుని బంపించెను. రాజు పిలుచుచున్నాండని విని, కుశలవు లాలసింపక యత్యంత వినయ విధేయతలతోడ సభామండపమును బ్రవేశించిరి. కుశలవులను జూడఁగానె, రామచంద్రుని హృదయమున నవిర్వచనీయమగు భావోదయంబయ్యెను. కాని. యీయన తన శరీరమునం దంతటను వ్యాపించుచున్నది ప్రీతిరసమో, లేక విషాదమో, నిర్ణయించుకొనఁ జాలకుండెను. కొంతవడి సుకుమారద్వయమును దిలకించి యాకులచిత్తుఁడై దృష్టిని మరలించుకొనఁజాలక చిత్రప్రతిమవలెఁ గూర్చుండి యుండెను.

బాలురు నెమ్మదినెమ్మదిగా శ్రీరామచంద్రుని సమీపించి "మహారాజునకు జయ మగుఁ గాక" అని నుడివి, ఆయన యాదేశానుసారము సముచిత ప్రదేశమందుఁ గూర్చుండి భక్తిశ్రద్ధలతోడ "మహారాజా! మమ్మేల పిలువ నంపితిరి?" అని ప్రశ్నించిరి. రామచంద్రుఁడు కుశలవుల శరీరములయందు, తనయొక్కయు జానకీదేవి యొక్కయు, సంపూర్ణానయన లక్షణముల

లక్షించి వికలచిత్తుఁడాయెను. కాని, యప్పుడు రాజ సభయంతయు భూవరులతో డ నిండి నిబిడీకృతమై యుండుటవలన, మిక్కిలి కష్టమునఁ జిత్తవికార మాఁపు కొని, యతిగంభీరతను దాల్చి, "మీ యపూర్వ గానమును విన్నవారెల్లరు పరమానంద భరితులై, మిమ్ము వేయినోళ్ళఁ బ్రశంసించుచున్నారు. కావున మీ గానమును వినవలయునను తలంపున మిమ్మాహ్వానించితిని. మీకిష్టమైనయెడల కొలఁదికాలము గానమొనర్చి మా కానందమును గలిగింపుఁడు." అని రాముఁడు నుడువ, కుశలవు లిట్లనిరి, "మహారాజా! మేము గానము చేయు చున్న కావ్యము బహువిస్తృతము. దానియందు మీ పావనచరిత్ర పరిపూర్ణముగ వర్ణింపఁబడి యున్నది. కావున మే మేభాగమును గానము చేయవలయునో సెలవిండు."

కుశలవులను జూచినప్పటి నుండియు రామ చంద్రుఁడు చంచలచిత్తుఁడై యుండెను. సీతాదేవిని వనవాసమున కనిపిన దుఃఖము, ఆయన హృదయము నుండి వెల్లివిరియుచుండెను. అందువలన శ్రీరాముఁ డిఁక ధైర్యావలంబియై యుండుట యసాధ్యమని తలఁచి, తక్షణమే సభముగించి విజనప్రదేశమున కేఁగవలయు

నను నాతురతఁగోఁడ, బాలురనుజూడ, "నేఁడుమీకిష్టము వచ్చినపట్టును గానముచేయుఁడు. రేపుమొదలు ప్రతిదిన ముదయమునను గొంచెముకొంచెముగఁ గావ్యమంతయు వినుచుండెదను." అని నుడువ కుశలవులు గాన మారంభించిరి. వీరి గానమాధురికి సభాసదులెల్లరు పరవశులై యేకగ్రీవముగ "సాధు సాధు!" అని పలుకఁ దొడంగిరి. రామచంద్రుఁడు, కవిత్వపటుత్వసంపదకును, రచనాలాలిత్యమునకును, పులకాంకితుఁడై "ఈ కావ్యమును రచించిన వారెవరు? మీరెవరికడ సంగీతవిద్య నభ్యసించితిరి?" అని ప్రశ్నింప, కుశలవులు "మహారాజా! ఈ కావ్యమును వాల్మీకిమహర్షి రచించినాఁడు. మేమాయన యాశ్రమమందే యుందుము. ఆయనయే మాకు సంరక్షణకర్త. ఆయనయొద్దనే విద్య నభ్యసించితిమి." అని నుడువ శ్రీరాముఁ డిట్లనియె. "వాల్మీకి మహర్షి యీకావ్యమునందు దన యద్భుతకవితాశక్తిని వెల్లడించియున్నాఁడు. కావున దీనిని గొంచెముగ విని సంతృప్తినొందుటకు వీలులేదు. అయినను నేఁడు మీకు మిక్కిలి పరిశ్రమ గలిగినది. కావున నింతకంటె మీకెక్కువ కష్టమును గలిగించుట నాకిష్టము లేదు. మీరిఁక మీ నివాసముల కేఁగుఁడు."

అని నుడువుచు శ్రీరాముఁడు, కుశలవులకు సెల వొసంగి, వెంటనే సభను ముగించి నివాస భవనమున కేఁగి, ఒంటరిగఁగూర్చుండి యీవిధముగఁ దలపోయ సాగెను. "ఈ బాలురు నాకంటి కగపడినంతనే నా హృదయ మాకులత నెందుటకుఁ గారణం బేమి? స్వ సంతానమును జూచినప్పుడు హృదయమందు వాత్సల్యరసము వ్యాపించునని వినినటులు, వీరిని జూచి నంతనే నాచిత్తము కరుణారసముతోడ నిండి పోవు చున్నది. కాని, కారణము మాత్రము గన్పట్టుట లేదు. వీరు ఋషికుమారులు గదా! కాకున్నను, నే నట్టి యాశను గలిగియుండుటకు వీ లెక్కడ? పూర్ణగర్భా వస్థయందు ప్రేయసిని వనవాసమున కనిపితిని. అట్టి స్థితియందు సీత దుస్సహశోకభరమునను, అసహనీయ మగు నవమానతాపమువలనను, ప్రాణత్యాగ మొనర్చు కొని యుండుననుట నిక్కువము. లేనియెడల నేదో యొక క్రూరజంతువున కాహారమైయుండును. ప్రేయసి యట్టి యవస్థయందు ప్రాణధారణం బొనర్చుకొని, నిర్విఘ్నముగ సంతానమునుగని వారిని బెంచి పెద్దవారిని జేసినదనుట కేవలముదురాశగదా! కాకున్నను నావంటి హతభాగ్యున కట్టి సౌభాగ్యము లభించుననుట కెటుఁ జూచినను సంభవము గాదు."

అని తలంచుచు మిక్కిలి వికలచిత్తుఁడై కన్నీరు గార్చుచుండెను. పిమ్మట దుఃఖమును గొంచెము మాఁపుకొని యిట్లు తలపోయసాగెను. "వీరి రూప రేఖా విలాసములు చూచిన క్షత్రియ కుమారు లని స్పష్టముగఁ దోఁచుచున్నది. ఇంతియకాక వీరి శరీరముల యందు నాయవయవ లక్షణములు సంపూర్ణముగ లక్షితము లగుచున్నవి. వీరు నాకుఁ బ్రతిబింబము లని నిస్సంశయముగఁ జెప్పవచ్చును. పరిశీలించి చూచిన యెడలఁ బ్రేయసీయవయవ సాదృశ్యములు వీరియందు సలక్షణముగఁ బొడగట్టుచున్నవి. వీరి భ్రూయుగ్మము, నయనములు, నాసిక, కర్ణములు, చెక్కిలు పలువరుస మొదలగు వానియందు లేశమైనను భేదము గన్పట్టుట లేదు. ఇట్టి పోలికల కేవిధమగు సంబంధము లేక యుండునా? వీరు వాల్మీకి చేత సంరక్షింపఁ బడుచున్నామని నుడివి యున్నారు. ప్రేయసిని వాల్మీకి తపోవనమందు దిగవిడిచి రావలయునని లక్ష్మణున కాజ్ఞ యొసంగియుంటిని. అందువలన వాల్మీకి కరుణారసపూరితుఁడై సీతను తనయాశ్రమమునకుఁ దోడ్కొని పోయి యుండవచ్చును. అక్కడ సీత యీకవలపిల్లలను బ్రసవించి యుండవచ్చును. ప్రవాసమునకుఁ బూర్వము

జానకిని జూచిన వారెల్ల రామె గర్భమందుఁ గవలపిల్లలు గలరని దలంచుచుండిరి. కాఁబట్టి నాయాశ యంతగా నిరాశ యని చెప్పుటకు వీలులేదు. కాని యెండమావుల యందు జలము గలదని భ్రమఁ జెందినట్లు, నేను భ్రమఁ బడుచున్నానేమో! క్రూర రాక్షసునికంటెను గూడ కఠినుఁడనై నిరపరాధ యగు ప్రేయసిని వనవాసమున కనిపి యిప్పుడట్టి కోరిక గలిగియుండుట మూర్ఖత్వము గదా! అయ్యో! ప్రేయసీ! నీవు సుశీలవు. పరమ పావనివి. సరళ హృదయవు. కాని నిశ్శీలుఁడగు నిక్రూర చిత్తుని హస్తములయందుఁ బడితివిగదా! పతిగతప్రాణ వనియును, పరమపావన చరిత్ర వనియును దెలిసి యుండియు నిష్కారణముగ వనవాసమున కనిపి యింతవఱకును జీవించి యుంటిని. కావున నావంటి క్రూరుఁడు, పాషాణచిత్తుఁడు, పుడమియందు మఱియొకఁ డుండఁడు. మఱి యుండఁబోఁడు."

అని తలంచుచు రాముఁడు దుస్సహ శోక భరము వలన, విచేతనప్రాయుఁడై సంతతధారగా కన్నీటిని గార్చుచు, తిరిగి తిరిగి దీర్ఘ నిశ్వాసమును విడుచుచుండెను. పిమ్మట కొంచెము శాంతచిత్తుఁడై "వాల్మీకి సీతను దన యాశ్రమమునకుఁ దీసికొని వెళ్లియుండును.

అచ్చట ప్రేయసి యీకవలపిల్లలఁ బ్రసవించిన దనుట నిక్కువము. వీరు ఋషికుమారులు గారని యింకొక ప్రబలకారణము కూడఁ గన్పట్టుచున్నది. ఎద్ది యన, వీరికి కొలఁది దినముల క్రిందటనే యుపనయన మయిన దని స్పష్టముగఁ దోఁచుచున్నది. కావున వీరికి పదునొకండవవత్సరమునందే యుపనయనమైనది. క్షత్రియ కుమారులు గానియెడల వీరి కీవయస్సునం దేల యజ్ఞోపవీతధారణం బొనర్తురు? ఋషికుమారులే యయిన యెడల నేడవయేటనే యుపనయనమై యుండును. ఇది యునుగాక, యుపనయనమైన ఋషికుమారుల వేషమునకును, వీరి వేషమునకును, జాలవ్యత్యాసము గాన్పించుచున్నది. అందువలన వీరు క్షత్రియకుమారు లని తలంచుటకు వీలుగలదు. క్షత్రియకుమారులే యయిన యెడల సీతకుమారులనితలంచుట కెక్కువయవకాశము గలదు. ఎందువలన ననఁగా క్షత్రియకుమారు లేల తపోవనమందుందురు? అచ్చటనే యేల యుపనయనము జరిగియుండును? కాఁబట్టి వీరు నావంటి హతభాగ్యుని సంతానమే యయి యుండవలయును."

అని మనస్సునందు తర్కవితర్కము లొనర్చుకొనుచు, "జానకి యింతదనుక జీవించియుండి, వీరు నా

పుత్త్రికే నైనచో నాయానంద మనిర్వచనీయము గదా? తిరిగి ప్రేయసి నా నేత్ర పర్వంబొనర్చునా? నా హృదయానందదాయిని యగునా? నాకిట్టి భాగ్యము లభించునా? ఈవిషయము చిత్తమునకుఁ గట్టినంతనే నాహృదయ మమృతసిక్తమగుచున్నది." అని తలంచుచు సీతాసమాగమంబు నిశ్చయ మని తలంచి తిరిగి యిట్లను కొనసాగెను. "దీర్ఘకాల వియోగానంతరము ప్రేయసిని జూచినంతనే యాహ్లాదమువలన వివశుఁడ నగుదును. ప్రేయసి యత్యంత సంతోషమున మునుంగును. అప్పుడు మాయిరువుర నేత్రములనుండి యానందాశ్రువులు ప్రబల వేగమునఁ బ్రవహించును." అని తలంచి కొంతవడి చింతానిమగ్నుఁడై యుండి పిమ్మట యిట్లు తలపోయ సాగెను. "మహాక్రూరకృత్య మొనర్చిన నేను ప్రేయసి మోమెట్లుచూతును? సాధుశీలయు, సరళహృదయయు, నగు సీత ననాయాసముగ నాయపరాధములను క్షమించు ననుట నిక్కువము. కావున నేను, ప్రేయసి పాదముల మీఁదఁబడి క్షమాపణ గోరెదను." అనుకొని తిరిగి "ప్రజల విరాగమునకుఁ బాత్రుఁడ నగుదు నేమో యనుభయము వలననే గదా ప్రేయసిని వనవాసమున కనిపితిని. ఇప్పుడు స్వీకరించిన

అచ్చట ప్రేయసి యొకవలపిల్లలఁ బ్రసవించిన దనుట నిక్కవము. వీరు ఋషికుమారులు గానని యింకొక ప్రబలకారణము కూడఁ గన్పట్టుచున్నది. ఏద్ది యన, వీరికి కొలఁది దినముల క్రిందటనే యుపనయన మయిన దని స్పష్టముగఁ దోఁచుచున్నది. కావున వీరికి పద నొకండవవత్సరమునందే యుపనయనమైనది. క్షత్రియ కుమారులు గానియెడల వీరి కీవయసునందేల యజ్ఞోప వీతధారణం బొనర్తురు ? ఋషికుమారులే యయిన యెడల నేడవయేటనే యుపనయనమై యుండును. ఇది యునుగాక, యుపనయనమైన ఋషికుమారుల వేష మునకును, వీరివేషమునకును, జాలవ్యత్యాసము గాన్పిం చుచున్నది. అందువలన వీరు క్షత్రియకుమారు లని తలంచుటకు వీలుగలదు. క్షత్రియకుమారులే యయిన యెడల సీతకుమారులనితలంచుట కెక్కువయవకాశము గలదు. ఎందువలన ననఁగా క్షత్రియకుమారు లేల తపోవనమందుందురు? అచ్చటనే యేల యుపనయనము జరిగియుండును ? కాఁబట్టి వీరు నావంటి హతభాగ్యుని సంతానమే యయి యుండవలయును."

అని మనస్సునందు తర్కవితర్కము లొనర్చు కొనుచు, "జానకి యింతదనుక జీవించియుండె, వీరు నా

పుత్త్రి లేదైనచో నాయానంద మనిర్వచనీయము గదా? తిరిగి ప్రేయసి నా నేత్ర పర్వంబొనర్చునా? నా హృదయానందదాయిని యగునా? నాకిట్టి భాగ్యము లభించునా? ఈవిషయము చిత్తమునకుఁ గట్టినంతనే నాహృదయ మమృతసిక్తమగుచున్నది." అని తలంచుచు సీతాసమాగమంబు నిశ్చయ మని తలంచి తిరిగి యిట్లను కొనసాగెను. "దీర్ఘకాల వియోగానంతరము ప్రేయసిని జూచినంతనే యాహ్లాదమువలన వివశుఁడ నగుదును. ప్రేయసి యత్యంత సంతోషమున మునుంగును. అప్పుడు మాయిరువుర నేత్రములనుండి యానందాశ్రువులు ప్రబల వేగమునఁ బ్రవహించును." అని తలంచి కొంతవడి చింతానిమగ్నుఁడై యుండి పిమ్మట యిట్లు తలపోయ సాగెను. "మహాక్రూరకృత్య మొనర్చిన నేను ప్రేయసి మోమెట్లుచూతును? సాధుశీలయు, సరళహృదయయు, నగు సీత ననాయాసముగ నాయపరాధములను క్షమించు ననుట నిక్కువము. కావున నేను, ప్రేయసి పాదముల మీఁదఁబడి క్షమాపణ గోరెదను." అనుకొని తిరిగి "ప్రజల విరాగమునకుఁ బాత్రుఁడ నగుదు నేమో యనుభయము వలననే గదా ప్రేయసిని వనవాసమున కనిపితిని. ఇప్పుడు స్వీకరించిన

యెడల నా యపవాదము తిరిగి ప్రజ్వలింపదా? ఇంత కాలము మే మిరువురమును దుస్సహ విరహ యాతన చేత దగ్ధుల మగుట నిష్ఫల మగును గదా."

అని యోచించుచు రామచంద్రుఁడు సహాయ హీనుఁడై, కొంతవఱ మౌనావలంబియై యుండి, పిమ్మట నాకస్మికముగ రోషావేశ పరవశుఁడై "ఇఁక నేను కార ణములేని లోకనిందను గణనచేయను. సీతను గ్రహించి యే తీరుదును. నేను స్వతంత్రుఁడను. నావలె నెవఁడు రాజ్యపీఠము నధిష్ఠించి, ఆత్మసుఖములకు జలాంజలి యర్పించుకొనెను? ప్రేయసిని వనవాసమునకనుపుట యె జ్ఞానహీన మగు కార్యము. కావున సీతను స్వీకరింతును. ఇట్లొనర్చుట యుచితము. కానియెడల రాజ్యమును భర తున కప్పగించి వానప్రస్థాశ్రమమును గైకొందును. ప్రేయసిని విడిచి రాజ్యభోగముల ననుభవించుటకంటె ప్రేయసితోడ వనవాస మొనర్చుటయే మిక్కిలి సౌఖ్య దాయకము." అని తలంచుచు రాముఁడా రాత్రి గడపెను.

# సీతాదేవి వనవాసము.

## ఎనిమిదవ ప్రకరణము.

"వాల్మీకి మహర్షి శ్రీరామచంద్రుని చారిత్రమును గైకొని యత్యద్భుత మహాకావ్యమును రచించినాఁడు. ఆయనకుఁ దరుణ వయస్కులగు శిష్యు లిరువురు గలరు. వారి కంఠము కోకిల కంఠమును మించియుండెను. వారిద్దఱు మధుర స్వరమున రామాయణమును గానముచేయుదురు. రాజ సభయందు రేపుదయముననే గానము ప్రారంభ మగును." అను విషయమును యాగదర్శనమునకు వచ్చిన వారెల్లరు జెప్పుకొన సాగిరి. అందువలన ప్రభాతమైనంతనే సంగీత శ్రవణ కుతూహలాయత్త చిత్తులై ఋషులు, రాజులు, మొదలగు వారెల్లరు, త్వరితగమనమున రాజసభకు వచ్చి తమతమ స్థానముల నాక్రమించుచుండిరి. సభయంతయుఁ గలకలలాడుచుండెను. శ్రీరామచంద్రుఁడు సింహాసనాసీనుఁడయ్యెను. భరత లక్ష్మణ శత్రుఘ్నులును, సుగ్రీవుఁడు విభీషణుఁడు మొదలగు స్నేహితులును, సింహాసనమునకుఁ గుడి యెడమ వైపులఁ దమ

తమ స్థానములయం దాసీనులైరి. కౌసల్య, కైక, సుమిత్ర, ఊర్మిళ, మాండవి, శ్రుతకీర్తి, మొదలగు వారును, అరుంధతి మొదలు గాగల ఋషిపత్నులును, వారికిఁగాను ప్రత్యేకముగ నేర్పాటుచేసిన స్థానమందుఁ గూర్చుండిరి. సభాసదు లెల్లరు నూతన కావ్యమును, సుకుమార గాయకద్వయమును గూర్చి యొకరితో నొకరు ముచ్చటించుకొనుచు, మిక్కిలి యాతురతతో డ కుశలవుల యాగమనమును నిరీక్షించుచుండిరి. కుశలవుల వెంట నిడుకొని వాల్మీకి మహర్షి సభాభవనమును బ్రవేశించెను. వారిని జూడఁగనే సభయందంతట సంతోష కోలాహలము పుట్టెను. పూర్వదినమునఁ గుశలవులను జూచినవారు తమ ప్రక్కనుండువారికి వ్రేలితో వారిని జూపుచుండిరి. మహర్షి మండపమును బ్రవేశింపఁగానే, సభాసదులు లేచి నిలిచి యాయనను గౌరవించిరి. పిమ్మట వారికిఁ గాను వేఱుగ నేర్పాటుచేసిన స్థలమున మహర్షియు, కుశలవులును, గూర్చుండిరి. సభయందున్న వారెల్ల రత్యుత్సాహచిత్తమున సంగీతమును వినుట కాతురులై యుండిరి.

మహర్షి యొక మాఱు సభనంతటను గలయఁ జూచి, రామచంద్రుని వంకఁదిరిగి "మహారాజా! సభా

సభ్యు లెల్లరు గానమును వినవలయునను కుతూహల
ముతోఁ గూడుకొని యున్నారు. తమరాజ్ఞ నొసంగి
నంతనే సంగీత ముపక్రమింపఁబడును." అని యడిగి
సెలవు గైకొని గానము నుపక్రమింపుఁడని, కుశలవులకు
సెలవొసంగెను. రామచంద్రుని యాజ్ఞను గైకొని,
వెంటనే వారు వీణెను వాయించుచు రామాయణ మహా
కావ్యమును గానము చేయసాగిరి. సీతా రాముల
పరస్పర స్నేహానురాగ వర్ణనలు గల పట్టుల నెక్కువగ
గానముచేయవలయునని ఇదివఱకే వాల్మీకి కుశలవు
లకుఁ జెప్పియుండెను. అందువలన కుశలవులు సీతా
రాముల పరస్పరప్రేమలోలుకు పట్టులలో నొక దానిని
గానముచేయఁ బ్రారంభించిన, కొన్ని నిముసముల
లోపల. రామచంద్రుని హృదయము కఱఁగి యశ్రు
పూర్ణ నయనుఁడయ్యెను. ఆ సుకుమార బాలగాయ
కులఁజూచిన కొలఁదిని వారు సీతాతనయు లను దృఢ
విశ్వాస మాయనకుఁ గలుగఁజొచ్చెను. భరతలక్ష్మణ
శత్రుఘ్నులు, కుశలవులయందుఁ గల సీతారాముల
యవయవలక్షణములఁ దిలకించిన కొలఁదిని, మనముల
యం దనేక విధములఁ దలపోయసాగిరి. సభాసదు లెల్ల
రేకగ్రీవముగ "ఏమి? ఈ యాశ్చర్యము? ఈఋషి

కుమారులు వీరుపురు రామచంద్రునకుఁ బ్రతిబింబములుగ నున్నారు. వేషమందును, వయసునందును వ్యత్యాసము లేని యెడల, వీరికిని రామచంద్రునకును, లేశమైనను భేద ముండదు గదా! రామచంద్రుఁడు బాల్యరూప మును ధరించి, యీఋషికుమారుల వేషమును దాల్చి నాఁడా యన్నట్లున్నారు. బాల్యమునందు శ్రీరామ చంద్రుఁ డెట్టి రూపమాధురి గలిగియుండెనో, యట్టి రూపమాధురినే వీరు గలిగియున్నారు." అనితలంచుచు పరవశులై కదలక మెదలక, యేకాగ్రచిత్తమున సంగీ తమును వినుచు, రెప్ప వాల్పక వారి రూపలావణ్య ములఁ గ్రోలుచుండెరి.

కొంతసేపు గానమును విని శ్రీరాముఁడు లక్ష్మ ణునిఁ జూచి "వత్సా! వీరికి వేయి బంగారు ముద్రలను బహుమాన మొసఁగుము." అని నుడువ, కుశలవు లిట్లు విన్నవించుకొనిరి. "మహారాజా! మేము వనవా సులము. మాకు భోగాభిలాష కాని, భోగాసక్తి కాని లేదు. అనాయాసముగ లభించు కందమూల ఫలము లను భుజింతుము. వల్కలముల ధరింతుము. కావున మాకు సువర్ణ ముద్రలచేఁ బ్రయోజనం బేమి? మేము మిక్కిలి పరిశ్రమ చేసి మీచరిత్ర నభ్యసించి

తిమి. నేఁడుమీరు వినుటవలన మాప్రయత్నము సఫల మైనది. మీరు ప్రీతులై సుప్రసన్నులగుటవలన మేము చరితార్థులమైతిమి." అని నుడువు బాలుర విచక్షణ జ్ఞానమును, ధనమునందు నిరాకాంక్షను జూచి, సభా సదు లెల్లరు సంతసించిరి.

కౌసల్యాదేవి కుశలవులను రెప్పవాల్పక చూచి వీరు సీత తనయులను ధృఢవిశ్వాసమున మిక్కిలి చంచలచిత్తయై దీర్ఘనిశ్వాసము విడిచి "అయ్యో! జానకీ!" అని నుడువుచు భూమిమీఁదఁ బడి మూర్ఛిల్లెను. తద్దర్శనమువలన మిగత వారెల్లరు విక లాంతఃకరణులై వివిధ ప్రయత్నములు చేయ, కౌసల్యా దేవికిఁ దెలివివచ్చెను. తదనంతరము కుశలవుల గాన మును వినిన కొలఁది సీతాదేవి శోకము ప్రబల మగుట వలన, మిగిలిన వారు కూడ కన్నీరు కార్చుచుండిరి. కౌసల్యాదేవి యత్యంత మనోవేదనతోఁ గూడుకొని పిచ్చిదానివలె నిట్లు పలుకం దొడంగెను. "నాయొద్ద కెవరైనను ఆ సుకుమార కుమారులను దీసికొనిరండు. వారిని కౌఁగిలించుకొని యెత్తి ముద్దిడుకొందును. వీరు నాసీత తనయులు. వీరిని జూడఁగానే నాప్రాణమెట్లో యున్నది. వారిని నాయొద్దకుఁ దీసికొని రానిచో నేనే

వారిదెసఁ జూచుచుండ కేఁగుదును. ఒకమాఁటు వారిని ముద్దిడుకొనిన యెడల జానకీశోకము కొంతవఱకుఁ దగ్గును. వీరియందు మీకు సీతారాముల యవయవ లక్షణములు గన్పట్టుట లేదా? వీరు సభను బ్రవేశించునప్పుడు రాముని పుత్త్రు లిరువురు వచ్చుచున్నారని యెవరో రహస్యముగ నా చెవిలోఁ జెప్పిరి. అప్పటి నుండియు నా ప్రాణము వారికొఱకుఁ దల్లడిల్లుచున్నది. ఇప్పటికి నేదోవిధముగ సీతశోకమును మఱచి పండ్రెండు వత్సరము లైనది. కాని వీరిని జూచి నంతనె జానకీశోకము నూతనాకారమును దాల్చుచున్నది. అయ్యో! జానకీ! నీ వెక్కడ నున్నావు? నీ కెట్టి దురవస్థ సంభవించినది? అప్పటినుండియు నీవు జీవించి యుంటివా? లేక యీ పాపిష్ఠ నరలోకమును విడచితివా? అయ్యో! ఏమి చేయుదును! ఏమియుఁ దెలియదుగదా?" అని పరితపించుచు, తిరిగి మూర్ఛిల్లెను. మిగతవారి ప్రయత్నములవలన కొంతవడికి కౌసల్యా దేవికిఁ దెలివి వచ్చి "మీ రిప్పుడు వారిని నాయొద్దకుఁ దీసుకొని రండు. మీచేతఁగానియెడల, లక్ష్మణునితోఁ జెప్పుడు. లక్ష్మణుఁడు దీసికొనివచ్చి వారిని నా యొడియందు బడవేయును." అని నుడువుచు రోదనము చేయసాగెను.

కౌసల్యాదేవి దుఃఖమును, చంచలత్వమును జూచి యరుంధతీదేవి సమీపమందున్న భటునితోడ లక్ష్మణునియొద్ద కేఁగి యీవిషయమంతయు నివేదింపుమని యాజ్ఞనొసంగెను. భటుఁ డేఁగి లక్ష్మణున కీవిషయము విన్నవింపఁగా, ఆయన సభ నాదినమునకుఁ జాలించున ట్లొనర్చి కుశలవులను వెంట నిడుకొని కౌసల్యాదేవి సమీపమునకు వచ్చెను. కుశలవులు సమీపింపఁగనే కౌసల్యాదేవి వారిని కౌఁగిలించుకొని ముద్దిడుకొనుచు "అమ్మా! జానకీ! నీవెచ్చట నుంటివి!" అని నుడువుచు బిగ్గరగ నేడ్వసాగెను. తద్దర్శనమువలన, సుమిత్ర, ఊర్మిళ, మొదలగు వార లస్థిర చిత్తలై, కన్నీరు మున్నీరుగ నేడ్వసాగిరి. కుశలవులు నివ్వెఱపడి పరివంకఁ జూచుచుండిరి.

కొంతవడికి కౌసల్యాదేవి కొంచెము దుఃఖ మాఁపుకొని సందేహనివృత్తికిఁగాను బాలురను జూచి "నాయనలారా! మీనామధేయము లెవ్వి? మీ తలిదండ్రుల నామధేయము లెవ్వి?" అని ప్రశ్నింప, వారు వినయవిధేయతలతోడ తమ నామధేయములను చెప్పి, "మాతండ్రియెవరో మాకుఁ దెలియదు. మే మెప్పుడు ఆయనను జూచి యెఱుఁగము. మా తల్లి యున్నది.

ఆమె తపస్విని. కాని యామె నామధేయము గూడ మాకుఁ దెలియదు. మాకెవ్వరును జెప్పలేదు. మే మామెనుగాని యితరులనుగాని యడిగి తెలిసికొనలేదు. మేము వాల్మీకి మహర్షి శిష్యులము. తపోవనమునం దాయనచేతఁ బాలింపఁబడుచు, ఆయనయొద్దనే విద్య నభ్యసించితిమి." అని నుడువు మాటల నాకులచిత్తమున వినుచున్న కౌసల్యాదేవి సంశయము దీఱెను. కాని పూర్తిగ సంశయ నివృత్తికొఱకు "మీ తల్లి యాకార మెట్లుండును?" అని ప్రశ్నింప, కుశలవులు తమ తల్లి యాకారమును వర్ణించి చెప్పిరి. అందువలన వీరు సీత తనయులను విశ్వాసము నితరవారికిఁ గూడఁ గలిగెను. కౌసల్య మొదలగువారెల్లరు పొంగిపొరలు దుఃఖమున మునింగి యేడ్వసాగిరి. పిమ్మట దుఃఖమును గొంచెము మాఁపుకొని కౌసల్యాదేవి "ఇప్పుడు మీతల్లి యెట్లున్నది?" అని ప్రశ్నింప, "మాతల్లి జీవన్మృతయై యున్నది. దినముల వరుసను శుష్కించి పోవుచున్నది. ఇంక నధికదినములు జీవించుట దుస్తరము." అని చెప్పి క్రిందఁజూచుచు కన్నీరు విడువసాగిరి.

కుశలవులు చెప్పుమాటల వినుచున్న వారెల్లరు రోదనముచేయుచుండ, కొంతసేపటికి కౌసల్యాదేవి తిరిగి

క్రొంచెము ధైర్యమువలంబించి, లక్ష్మణునిం జూచి వాల్మీకి మహర్షి నిటకుం దోడ్కొని రమ్మని చెప్పెను. వెంటనే లక్ష్మణుండేగి వాల్మీకిమహర్షిని వెంట నిడుకొని వచ్చెను. మహర్షి కెల్లరు భక్తిశ్రద్ధలతో దండప్రణామము లొనర్చి, ఉచితాసనాసీనునిం జేసిరి. పిమ్మట కౌసల్యాదేవి చేతులు జోడించుకొని "భగవానుఁడా! ఈ కుమారు లెవ్వరో దయయుంచి తెలుపవలయును." అని ప్రార్థింప వాల్మీకి, లక్ష్మణునకు సీతను తన తపోవనమునకు దగ్గఱ విడిచి నప్పటినుండియు నేటివఱకు జరిగిన వృత్తాంతమంతయుం జెప్పి, రామచంద్రుని విరహావస్థను సీతాదేవి ప్రసూతావస్థను బూర్తిగ వర్ణించిచెప్పెను. వాల్మీకి వాక్యముల వినుచున్న వారెల్లరు సంతతధారలఁగన్నీరు గార్చుచు, పెద్దపెట్టున రోదనము చేయసాగిరి. కౌసల్యాదేవి "అయ్యో! జానకీ! విధాత నీ నొసటియం దింత దుఃఖమును లిఖించినాఁడా?" అని బిగ్గరగ నేడ్వసాగెను.

పండ్రెండు వత్సరములకు కుశలవు లాత్మ పరిచయము నొందిరి. అందుచేత వారి హృదయములయం దనిర్వచనీయ భావము లుదయింపసాగెను. వాల్మీకి బాలకుల వంకఁజూచి "వత్సా! కుశ! వత్సా! లవ! పితామహులకును, పిత్రవ్యపత్నులకును, వందనము లాచ

రింపుడు." అని చెప్పఁగా, వారు కౌసల్యా, కైకేయీ, సుమిత్త్రలకును, ఊర్మిళా, మాండవీ, శ్రుతకీర్తులకును సాష్టాంగదండప్రణామంబు లొనర్చిరి. తదనంతరము మహర్షి కుశలవులతోడ "మీరు రామాయణమునందుఁ బఠించిన లక్ష్మణ నామధారి యగు నీయన మీకు మూడవ పినతండ్రి," అని నుడువ కుశలవులు, విస్ఫారిత నేత్రములతోడ లక్ష్మణుని, ఆపాద మస్తకము నొక్క-మాఱు దిలకించి, దృఢతర భక్తిశ్రద్ధలతో సాష్టాంగ దండప్రణామం బాచరించిరి. కౌసల్యాదేవి యాదేశానుసారము లక్ష్మణుఁడు శ్రీరామచంద్రుని, వశిష్ఠమహర్షిని దోడ్కొని వచ్చెను. కౌసల్యాదేవి బాష్పాకులలోచనములతోడ కుశలవులను గూర్చి వారికి సవిస్తరముగఁ జెప్పి, సీతాదేవి జీవించి యున్నదనినుడివెను. ఈమాటలు వినినంతనే రామచంద్రున కనుమాన నివృత్తియై కన్నీటిచేత నభిషేకింపఁబడుచు అత్యంత వాత్సల్యభరణమున కుమారుల నెప్పవాల్పక చూచుచుండెను. కౌసల్యాదేవి పుత్త్రిసమేతముగ సీతను గ్రహింప వలయు నని రామచంద్రునకుఁ జెప్పెను. ఆయన ప్రత్యుత్తరం బొసంగకుండెను. ప్రత్యుత్తరం బొసంగకుండుటయే సమ్మతి యని గ్రహించి, కౌసల్యాదేవి సీతను దీసికొని రావలయు

నని వాల్మీకిని ప్రార్థింప, ఆయన తన నివాసమున కేఁగి కౌసల్యాదేవి పంపించిన శిబికమీఁద జానకీదేవిని దోడ్కొని రావలసిన దని శిష్యునొక్కని బంపించెను.

సభాసదు లెల్లరు క్రమక్రమముగా కుశలవులు రామచంద్రుని తనయు లనియు, జానకీదేవి వాల్మీకి యాశ్రమమునందే కవల పిల్లలను బ్రసవించె ననియు, ఆమె యిప్పటికిని జీవించి యున్నదనియు, రామచంద్రుఁ డామెను తిరిగి స్వీకరించు ననియు, ఆమెను దీసికొని వచ్చుటకు, వాల్మీకి తన శిష్యులను బంపించి యున్నాఁ డనియుఁ దెలిసికొనిరి. సభాసదులయం దనేకులు కీవార్త సంతోషప్రదాయని యయ్యెను. కాని కొందఱు మాత్ర మిట్లు పలుకఁదొడంగిరి. "మనరాజు చంచల చిత్తుఁడు. ఆమె నేల యప్పుడు పరిత్యజింప వలయును? తిరిగి యిప్పుడేల స్వీకరింప వలయును? విడనాడునప్పటి జానకీదేవియే గదా యిప్పుడు గైకొను జానకీదేవి? ఆ కారణ మిప్పటికిని నిలిచియే యున్నది. కాని గొప్ప వారి చర్యలు విచిత్రముగ నుండును."

జానకీదేవిని గ్రహించుటకు రాముఁ డీ విధముగ నిశ్చయించుకొనెను. కాని ప్రజలయభిప్రాయముల కర్ణాకర్ణికగ వినుటవలన దిరిగి వికలచిత్తుఁడాయెను.

ప్రథమమున జానకీదేవిని గైకొనిన యెడలఁ బ్రజ లెట్టి యాటంకమును జెప్పరని తలంచి యుండెను. కాని యింతదనుకను ప్రజలకు సీతాదేవి చరిత్రసంబంధ మగు సంశయము తీఱకుండుటను జూచి శ్రీరామచంద్రుఁడు మహాదుఃఖ నిమగ్నుఁడై, లక్ష్మణునిఁ బిలువనంపి యాయనతో నీ విషయమును గూర్చి ప్రసంగింపఁ దొడంగెను. అనేక వాదోపవాదములు జరిగిన పిమ్మట జానకీదేవి తాను పవిత్రచరిత్ర యని సప్రమాణముగఁ జూపించిన యెడల నామెను స్వీకరించునట్లు శ్రీరాముఁడు నిశ్చయించి, ఆ విషయమును వాల్మీకి మహర్షికి నివేదింపు మని లక్ష్మణున కాజ్ఞాపించెను.

వాల్మీకిమహర్షి యీవిషయమును వినినంతనే, రామచంద్రుని సమీపమున కేఁగి సీతాదేవి పరిశుద్ధ చరిత్రనుగూర్చి బోధింపసాగెను. ఆయనవాక్యములు విని రామచంద్రుఁ డిట్లనియె. "భగవానుఁడా! సీత చరిత్రవిషయమునందు నా కణుమాత్రమును సందియము లేదు. నేను రాజ్యభారమును వహించుటచేత మిక్కిలి పరాధీనుఁడ నైతిని. ప్రాణముల నర్పించి యైనను బ్రజారంజనం బొనర్చుట రాజులకు పరమధర్మ మనియు, ఆవిషయమునం దుపేక్షించిన యెడల నిహ

లోకమునం దపకీర్తియు, పరలోకమున నరకబాధయు నొందవలసి వచ్చుననియు, తామే యుపదేశించి యున్నారు. సీతచరిత్రవిషయమునందు ప్రజలకు మిక్కిలి సందేహము గలదు. దానిని దీర్పక నే నెట్లు గ్రహింతును? సీతను బరిత్యజించి నప్పటినుండియు నా సమస్త సుఖములకు జలాంజలి యర్పించియున్నాను. నేను జీవించియుండుటయే, నాకాశ్చర్యముగఁదోఁచుచున్నది. అస్వాధీనుఁడ నగుటవలననే సీతను బరిత్యజించితిని. ఒక్కొకమాఱు ప్రజలయసంతృప్తిని గణనచేయక సీతను గైకొనవలయు నని తలంతును. కాని యట్లొనర్చిన యెడల రాజధర్మము చెడునుగదా! అందువలన లేశమైనను ధైర్యము నవలంబింపఁ జాలకున్నాను. భరతుని హస్తములయందు రాజ్యభారము నర్పించి, సీతను స్వీకరింపవలయు నని తలంచితిని. కాని యాయోచన యంత యుక్తముగ దోఁచుటలేదు. సీతవిషయమునందు నేనొనర్చిన క్రూరకృత్యమువలన ఘోరతర పాపనవాలనమునందుఁ దగులొంటి ననుట నిక్కము. నేను కేవలము దుఃఖభోగముకొఱకు జన్మించితిని. నే నిప్పుడు పొందు మనఃపరితాపమును నాయంతరాత్మయే యెఱుంగును. మహర్షీ నాకిప్పుడు మరణము సంభవించిన యెడల ధన్యుఁడ నగుదును గదా?"

అని చెప్పుచు రామచంద్రుఁడు కన్నీటిని గార్చుచు పిమ్మట మహర్షి నిట్లు ప్రార్థింపఁ జొచ్చెను. "భగవానుఁడా! సీత వచ్చినంతనే, యామెను వెంట నిడుకొని మీరు సభకు విచ్చేయుఁడు. నేనామెను స్వీకరించువిషయమును గూర్చి తమతమ యభిప్రాయములను దెలుపుఁ డని మీరు సభాసదులను గోరుఁడు. సభాసదులెల్ల రంగీకరించిన యెడల నేనామెను గైకొందును. వారు సమ్మతింపనిచో సీత ప్రజల సందేహ నివారణకుఁ దగు ప్రమాణమును జూపింపవలయును." అని నుడువు మాటలను వాల్మీకి సమ్మతించి విషణ్ణవదనమున నివాసమున కేఁగెను.

అక్కడ జానకీదేవి, కౌసల్యాదేవి పంపించిన శిబికమును జూచి, మహర్షి పంపించిన శిష్యునివలన నాయన యాజ్ఞనువిని, యీవిధముగఁ దలపోయసాగెను. "నేటికిఁగదా విధి కరుణారస పరిపూర్ణుఁడై నాదుఃఖమున కంతముగల్పించి యున్నాఁడు! కౌసల్యాదేవి శిబికమును బంపించుటవలననే కాఁబోలు నేఁడు నా వామనయనము విరామము లేక యదరుచున్నది. నేనార్యపుత్త్రుని దయా స్నేహ ప్రేమల నెఱుంగుదును. కేవల మస్వాధీనుఁడగుటవలననే, ఆయన

నన్నుఁ బరిత్యజించి యున్నాఁడు. నేనాయన వియోగమువలన పరితపించుచుండు విధముననే, ఆయన నా వియోగమునకు విలపించు చుండును. ఆయనకు నా మీఁద ననురాగ మణుమాత్రము తగ్గనందు తిరిగి వివాహమాడుటకు వెనుదీసియుండెను. ఆయన సహధర్మి స్థానమున నా ప్రతిమూర్తి నుంచుకొని నాపైఁగల యనురాగము యొక్క పరమోత్కృష్టతను బ్రకటించి నాకు సౌఖ్యనివృత్తిని గలిగించి యున్నాఁడు. తిరిగి యార్యపుత్రుని సహవాస సుఖము లభించు నని స్వప్నమందైనను దలంచి యెఱుంగనుగదా?"

అని తలంచుచుండ నత్యానందమువలన జానకీదేవి నయనములనుండి యానందాశ్రువులు రాలసాగెను. ఆమె శరీరబలము పూర్వముకంటె మూఁడురెట్లు వృద్ధియయ్యెను. తిరిగి పరిగ్రహింపఁబడుదుననుభావోదయమువలన నామె హృదయ కంధరమునుండి యానంద ప్రవాహము వెల్లివిరియఁ జొచ్చెను. భవిష్యదాశ నుద్ఘోషించు సంకల్పమునకుఁ గలశక్తియనంతరము గదా! ఆమె భవిష్యదాశపై నిర్భరపడి మనమునందెన్నియో కల్పనలను జేసికొనుచుండెను. శ్రీరాముఁడు చేపట్టినంతనే జరుగు విషయము లన్నిటిని దలంచు

కొని, వానిని హృదయ పటమునందు చిత్రించుకొనుచు, అవి యన్నియు, యథార్థముగ జరుగుచున్నవను జ్ఞానమునఁ జెప్పశక్యము గాని సంతోసము ననుభవించు చుండెను. తాను రాముని సన్నిధానమున కేఁగి నంతనే రాముఁడు లజ్జవలన ముఖమెత్తి మాటలాడకుండు టనియు, పిమ్మట రామచంద్రుఁడశ్రుపూర్ణ నయనుఁడై ప్రియవాక్యములు పలుకుచుండు నప్పుడు, తా నభిమానము వలన మాటలాడని రసవిహీన మగు మోము తోడ నిలిచియుండుటయును, ప్రథమ సమాగమ సమయమునం దిరువురు జడప్రాయులై స్థిర నయనముల పరస్పరము చూచుకొనుచుండు నటులును, పిమ్మట తామిరువురొక యాసనముమీఁద గూర్చుండి యొకరినొకరు దీర్ఘ కాల వియోగదుఃఖమును వర్ణించి చెప్పుకొనుచుండ, తమకు తెలియకుండఁగనే రాత్రి గడచు ననియు, తర్వాత అత్తగార్ల యొద్ద కేఁగి సాష్టాంగ దండప్రణామం బాచరించుటయు, వారు ముద్దుపెట్టుకొని, శల్యావశిష్టయై యున్న తన్నుజూచి, పరితపించుటయు, వారడుగు ప్రశ్నలకుఁ బ్రత్యుత్తరం బిడు సమయమందు బాష్పాకులనయనములతోడ మఱఁదులు వచ్చి నమస్కరించుటయు, తదనంతరము ముప్వురు

చెలియండ్రును వచ్చి తన పాదముల మీఁదఁ బడి నమస్కరింప, పరస్పర సందర్శనమువలన దుఃఖము పొంగిపొరల నేడ్చుచుండుటయు, పిమ్మట రాముని పార్శ్వమందున్న హిరణ్మయామూర్తిని దీసివేసి, యా స్థలమునందు దానుగూర్చుండి యజ్ఞకార్యములయందుఁ దనపనులను దాను నిర్వహించుటయుఁ దలంచుకొని యానందము ననుభవించుచు, సంతోషమువలన పులకాంకురిత యగుచుండెను.

పిమ్మట జానకీదేవి శిబికమునందుఁ గూర్చుండెను. సాయంకాలమునకు మఱుదినము శిబికము నైమిశారణ్యమందలియజ్ఞక్షేత్రమును బ్రవేశించెను. సీతాదేవిని జూచినంతనే వాల్మీకి "నిన్ను పరిగ్రహించుటకు శ్రీరాముఁ డంగీకరించినాఁడు. రేపుదయముననే నిన్ను రాజసభకుఁ దోడ్కొనిపోయి సభాసదుల సముఖమునను రామచంద్రుని హస్తములయందు సమర్పింతును," అని నుడివెను. రామచంద్రుఁడు సీతాదేవిని స్వీకరించు విషయమునుగూర్చి సభాసదులకు నివేదించినయెడల సభయం దెవరు ననంగీకారమును సూచింపరను దృఢవిశ్వాసము గలిగి యుండుటవలన, వాల్మీకి సీతాదేవి తన విశుద్ధ చరిత్రను సప్రమాణముగఁ జూపింపవలసి వచ్చినయెడలఁ

జూపింపవలయు ననువిషయమును, జానకీదేవికిఁ జెప్పకుండెను. పిమ్మట జానకీదేవి కుమారులవలన జరిగిన వృత్తాంత మంతయు విని, రామచంద్రుఁడు తన్ను స్వీకరించు నని నమ్మి, పరమానందభరితయై ప్రతిదివసమును, ప్రభాతమును నిరీక్షించుచుండెను. కాని యా రాత్రి యొకటి మాత్రమైనను కన్నుమూసి యెఱుఁగదు.

ఆ రాత్రి గడచెను. ప్రభాతమయ్యెను. వాల్మీకి మహర్షి స్నాన సంధ్యాద్యనుష్ఠానములఁ దీర్చుకొని సీతాదేవిని, కుశలవులను, వెంటనిడుకొని సభామండపమును బ్రవేశించెను. శల్యావశిష్టయగు జానకీదేవిని జూడఁగనే రాముని హృదయము వ్రయ్యలుకాఁజొచ్చెను. శ్రీరాముఁ డతికష్టముమీఁద దుఃఖము నాఁపుకొని సీత విషయమునందుఁ బ్రజ లేవిధముగఁ బల్కుదురో యని చూచుచు మిక్కిలి యాకులచిత్తుఁడై యుండెను. చిక్కి శల్యమై యున్న సీతాదేవిని జూచి సభాస్థలం దనేకులు వాత్సల్యరసమున మునింగి పోవుచుండిరి. వాల్మీకి మహర్షి నిలిచి సభాసదుల సంబోధించి యిట్లనియె.

"మీరెల్ల రెఱింగిన విషయమేకదా! రాజాధిరాజగు రామచంద్రుఁడు నిరాధారమగులోకాపవాద భయము వలన నితాంతనిరపరాధయగు సీతాదేవిని బరిత్యజించి

యున్నాఁడు. కాఁబట్టి యామె నిప్పుడు శ్రీరామ చంద్రుఁడు స్వీకరించు విషయమునందు మీ మీ యామోదమును ప్రశాంతచిత్తమునఁ దెలుపవలయునని గోరుచున్నాను. జానకీదేవి చరిత్ర విషయమునందు మానవ మాత్రునకు సంశయముండఁజనదు."

అని చెప్పి మహర్షి విరమించినంతనే సభయందు మహా కోలాహలము పుట్టెను. నృపతులును, ప్రధాన ప్రజలును లేచినిలిచి చేతులుజోడించుకొని "జానకీదేవిని గ్రహింపవలయు నని శ్రీరాముని మేము నిష్కల్మష చిత్తమునఁ బ్రార్థింపుచున్నాము. ఆయన సీతాదేవిని గ్రహించిన యెడల మే మపరిమితానందమును బొందుదుము." అని నుడివి కూర్చుండిరి. తక్కుంగలవా రెల్లరు మౌనమును ధరించి తలవంచుకొని క్రిందుజూచుచుండిరి. రాముఁడింత దనుకను సంతోషముతోఁ గూడుకొని యుండెను. కాని యిప్పుడు సీతను స్వీకరించు విషయమునందు సర్వసామాన్యముగ నంగీకసమ్మత మని స్పష్టముగఁ దెలిసికొనెను. ఇందువలన నాయన మోము వాడిపోయెను. మృతప్రాయుడయ్యెను. స్థిర నయనముల వాల్మీకి ముఖనిరీక్షణము చేయుచుండెను. అంత వాల్మీకి యుత్సాహశూన్యుఁడై వేఱు మార్గము

నోఁపక సీతాదేవి వంకఁజూచి "వత్సా! జానకీ! నీచరిత్ర విషయమునందు ప్రజలకుఁ గల సంశయము నేఁటికిని దీఱలేదు. కావున నీ వేదైన తగుప్రమాణమును జూపించి ప్రజల సంశయమును బోఁగొట్టుము" అని నుడివెను. సీతాదేవి వాల్మీకి దక్షిణపార్శ్వమునుండి మిక్కిలి యాతురతతోడ ప్రతినిముసమును రాముఁడు తన్ను స్వీకరించునని నిరీక్షించుచుండెను. అట్టి సమయమందు పిడుగువంటి వాల్మీకిమాటలను వినినంతనే సీతాదేవి వాతాహతకదళీతరువువలె భూతలశాయిని యయ్యెను.

జానకీదేవిని జూచి కుశలవులు పెద్దపెట్టున నేడ్వసాగిరి. ప్రజానురాగప్రియతవలన రాముఁడింతవఱకును ధైర్యమవలంబించియుండెను. కాని సీతాదేవి భూమిమీఁద బడినంతనే "అయ్యో! ప్రేయసీ!" యని యఱచుచు, మూర్ఛితుఁడై సింహాసనమునుండి క్రిందకు దొర్లిపడెను. "అయ్యో! జానకీ!" యని యఱచుచు కౌసల్యాదేవి మూర్ఛిల్లెను. ఊర్మిళ మొదలగువారు రోదనము చేయసాగిరి. సభాసదులెల్లరు చిత్రప్రతిమలవలె చేష్టలు దక్కి నిర్వాదులై చూచుచుండిరి. భరత లక్ష్మణ శత్రుఘ్నులు తమ దుఃఖమును గొంచె

మాంపుకొని శ్రీరామునకు చైతన్యము గలుగుటకుఁదగు ప్రయత్నముల నొనర్ప, గొంతవడి కాయనకుఁ దెలివి వచ్చెను. మహా సీతాదేవికి చైతన్యము గలుగుటకుఁ గాను పలుప్రయత్నము లొనర్చెను. కాని యాయన ప్రయత్నములు విఫలమాయెను. పరమపావని యగు సీతాదేవి యిహలోకమును విడనాడెను.

సీతాదేవి మిక్కిలి సుశీలయు సరళహృదయయు నై యుండెను. ఆమెం బోల్పఁదగిన పతిభక్తిగల స్త్రీని ఏకాలమం దెవ్వరును కని విని యెఱుంగరు. మానవ జాతికి పతివ్రతాధర్మము నుపదేశించుటకు విధాత సీతాదేవిని సృజించి యామెయందు పరిశుద్ధవర్తనమును పతిభక్తిపరాయణతను పరమోత్కర్ష నొందించియు న్నాఁడని చెప్పవచ్చును. ఈమెతోఁ దులఁదూఁగఁదగిన సర్వగుణ సంపన్నవగు నారీమణి యేకాలమునను, భూమండలమం దవతరించి యుండలేదు. అట్టిస్త్రీ జన్మించినను సర్వగుణసంపన్నుఁడగు భర్తనుబడసి చిరసుఖిని యైన దని కని విని యెఱుంగము.

సంపూర్ణము.

# ప్రకటన.

౧. సతీదేవి:—(దాక్షాయణి)

మూడురంగుల బొమ్మలుగలవు ౦-౮-౦.

౨. సావిత్రీదేవి:—

మూడురంగుల బొమ్మలు గలవు ౦-౮-౦.

3. సీతాదేవి వనవాసము ౦-౧౦-౦.

ఈ మూడుగ్రంథములు పాఠశాలలయందు బఠనీయగ్రంథములుగ టెక్స్టుబుక్కుకమిటీవా రంగీకరించి యున్నారు.

సరస్వతీ నికేతనము.
మచిలీపట్టణము.